ఆ గొంతు మూగపోయింది
కాని . . .
ప్రజల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది

# ప్రజా స్వేచ్ఛ

హక్కుల ఉద్యమ వేదిక

సంపుటి : 7 సంచిక : 10 అక్టోబర్ - 2009 అనంతపురం విడిప్రతి : 5-00



మాటలో రాతలో చేతలో
ఆలోచనల్లో.. వైరుధ్యమే లేని ఆచరణతో
హక్కుల ఉద్యమాన్ని నలుదిక్కుల తీసుకపోయి
నిలువెత్తు చైతన్యంగా సాగిన నీ ప్రయాణంతో
విభేదాలు ఎన్ని ఉన్నా హక్కుల ఉద్యమాల లక్ష్యం ఒక్కటే!

ఆదర్శనీయ నిబద్ధతతో ఆశయ సాధనలో
నిత్య స్ఫూర్తిని ఇచ్చే నీ కార్యాచరణ ప్రేరణగా
హక్కుల ఉద్యమాన్ని ప్రజాఉద్యమాలను కొనసాగిస్తాం !!

**జోహార్ బాలగోపాల్**



# అతనెప్పుడూ - అతడే



రక్త సిక్త దేహాల మధ్యకు
నిబ్బరంగా నడిచి వెళ్ళి
నిరంతరం సత్యశోధన
చేసే సాహసి అతడు
అతనెప్పుడూ అతడే....

నిర్నిద్ర నేత్రాలతో
సిరా చుక్కలను పలుదిక్కులకు
శాంతి కపోతాల్లా ఎగురవేసేది
అతడే.....

ఇదివరకెన్నడూ పరిశోధకులకందని
అయస్కాంత క్షేత్రం అతను
కలలు కనే కళ్ళను
నిత్యం తన వైపుకు ఆకర్షించే
గొప్ప హక్కుల కార్యక్షేత్రం అతను....

వడివడిగా అనునిత్యం
పరుగులు తీస్తూ
కాలప్రవాహంలో దూకే
జలపాతం అతనే
హక్కుల ఆరాటం అతనే....

అతనొక ఆదివాసీ
అతనొక గిరిజన గూడెం
అతనొక పీడితుని దుఃఖం
అతనొక దళితుని వ్యధ....
అతనొక గనికార్మికుని గొంతు
అణిచివేతకు గురయిన స్త్రీల ఆక్రందనం
అతడు.....

అలసట ఎరుగని సత్యాన్వేషి
నూతన మానవుని ఆకాంక్షలను
తన భుజస్కంధాలపై తానే ప్రియంగా మోసుకుని
తిరిగే నిర్విరామ బాటసారి
అతడు

ఏ తల్లి తండ్రీ ఊహలకందని
ఓ వినూత్న, విలక్షణ, విభిన్న మానవుడతడు
ఈ భూమి కలకన్న పుత్రుడతడు

ఇంతలోనే వినమ్రంగా
ఎక్కడికో అదృశ్యమై
ఇప్పుడే ఇక్కడే
మనమధ్యే నిల్చుని
తన గొంతు చివరిసారిగా
సవరించుకొని
ఇంకనైనా 'మీ గొంతులు విప్పండి
పేదల హక్కుల కోసం'
అంటూ వేల గొంతులలో
విస్ఫోటనం అవుతున్న
స్వాప్నికుడతడు
అతనెన్నడూ అతడే.

(అక్టోబరు 8వ తేదీ 2009 అర్థాంతరంగా అదృశ్యమైన
డా॥ బాలగోపాల్ గారికి కన్నీటి నివాళులతో)

20.10.2009 తేదీన అనంతపురం ఎన్.జి.వో.హోంలో హెచ్ఆర్ఎఫ్
నిర్వహించిన సంస్మరణ సభలో ఆర్. శశికళ చదివిన కవిత.

ప్రజా స్వేచ్ఛ

హక్కుల ఉద్యమ వేదిక


ఎడిటర్
ప్రొఫెసర్ ఎస్. శేషయ్య


వర్కింగ్ ఎడిటర్
డి. సురేష్ కుమార్

సంపాదకవర్గ సభ్యులు
టి. ఆంజనేయులు
కె. నాగేశ్వరాచారి
బి. రామకృష్ణ
యన్. నారాయణరావు

ప్రజా స్వేచ్ఛ చందా వివరాలు
విడిప్రతి: 5/-రూ.
సంవత్సర చందా : 50/- రూ.
జీవిత చందా: 500/-రూ.


రచనలు, రిపోర్టులు, సంస్థ కార్యకలాపాలు, రెన్యూవల్స్, కొత్త చందాలు పంపవలసిన చిరునామా


**డి. సురేష్ కుమార్**
వర్కింగ్ ఎడిటర్, ప్రజా స్వేచ్ఛ,
ఇ.నెం. : 298, టిఆర్‌టి కాలనీ,
రైల్వేస్టేషన్ ఎదురుగా,
విద్యానగర్, హైదరాబాద్ - 44.
ఫ్యాక్స్ నెం : 040-27651256,
ఇ-మెయిల్ : sureshkd@hotmail.com

# విషయ సూచిక

## సంపాదకీయం


- హక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్‌కు నివాళి 2


## బాలగోపాల్ ప్రసంగ - వ్యాసాంగాలు


- భయాంధ్రప్రదేశ్! ... బాలగోపాల్ చివరి ప్రసంగం 3
- ఈ వేట ఆపమని నినదిద్దాం! 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ... బాలగోపాల్ వ్యాసం 5
- హింస - ప్రతిహింస 7 (ఇ.పి.డబ్ల్యూ. పత్రికకు 'పీపుల్స్ ఎన్‌కౌంటర్' సినిమాపై బాలగోపాల్ రాసిన సమీక్షావ్యాసానికి తెలుగు అనువాదం)


## బాలగోపాల్ స్మృతిలో ప్రత్యేక వ్యాసాలు


- బాలగోపాల్ స్ఫూర్తితో అణిచివేతను వ్యతిరేకిద్దాం! హక్కులను కాపాడుకుందాం! ... శేషయ్య 12
- పౌరహక్కుల సంఘంలో బాలగోపాల్ ... హరగోపాల్ 16
- బాలగోపాల్ - ప్రజాస్వామిక అవగాహన ... వరవరరావు 19
- హక్కుల పరిభాషతో 'స్వేచ్ఛ'ను తీర్చిదిద్దిన బాలగోపాల్ ... కోదండరామ్ 21
- భారతదేశంలో కులం పౌరహక్కుల సమస్యగా గుర్తింపచేయడంలో బాలగోపాల్ ... సత్యనారాయణ 22
- చరిత్ర మలిచిన నిత్య చలనశీలి బాలగోపాల్...రామకృష్ణ 24


## కార్యకలాపాలు


- ఎన్‌కౌంటర్ హత్యలు-న్యాయమైన ప్రశ్నలు ఢిల్లీలో సిడిఆర్ఓ నిరసన కార్యక్రమాలు 26
- దంతెవాడ జిల్లాలో భద్రతాదళాలు చేసిన హత్యలపై నిజనిర్ధారణ నివేదిక 28
- ఆదివాసులపై ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో సైనిక దాడిని అందరం ఒకటయి వ్యతిరేకిద్దాం! (కరపత్రం) 30
- అతడు అతడే.. బాలగోపాల్ పై కవిత ...శశికళ ii Cover page
- సంస్థ కార్యకలాపాలు - ఫోటోలు iii Cover page
- పురుషోత్తం సంస్మరణ సభ కరపత్రం iv Cover page

**సంపాదకీయం**

# హక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్‌కు నివాళి

హక్కుల నేత బాలగోపాల్ ఆకస్మిక మరణం ప్రజాస్వామికవాదులందరిని నిర్ఘాంత పరచింది. హక్కుల ఉద్యమప్రస్థానంలో ఆయన లేనిలోటును ఇప్పట్లో భర్తీ చేయడం కష్టసాధ్యం. వాస్తవానికి రాష్ట్రవ్యాపితంగా, దేశవ్యాపితంగా హక్కుల ఉద్యమానికి ఒక గుర్తింపును, విశ్వసనీయతను తీసుకురావడంలో బాలగోపాల్ విశేష కృషి దాగివుంది. హక్కుల ఉద్యమానికి ఒక కొత్త ఒరవడిని, ధృక్పథాన్ని యివ్వడమే కాకుండా దాన్ని ఆచరణలో సాధించడానికి తన జీవితాన్ని అంకితం చేశాడు. బాలగోపాల్‌ది విశిష్టమైన వ్యక్తిత్వం. మేధావిగా, రచయితగా, నేతగా, సాధారణ కార్యకర్తగా ఒకే వ్యక్తిలో మేళవించి ఉండటమే ఆయన ప్రత్యేకత. సంస్థకు బాధ్యతాయుత స్థానంలో ఉన్నా సాధారణ కార్యకర్తలాగా గోడకు పోస్టర్లు అంటించడం, కరపత్రాలు పంచడం, సంస్థ ప్రచురణలను అమ్మడం చేయగలడు. వ్యక్తే సంస్థగా, సంస్థలో ఒక వ్యక్తిగా గొంతులేని వారి తరఫున గొంతెత్తాడు. మన రాష్ట్రంలో హక్కుల ఉద్యమానికి చిరునామా అయ్యాడు. హక్కుల ఉద్యమచరిత్రలో సమున్నతంగా నిలిచిపోయాడు.

1970ల ప్రాంతంలో శ్రీకాకుళ గిరిజన రైతాంగపోరాటాలపై ప్రభుత్వ ఫాసిస్టు దమన కాండకు వ్యతిరేకంగా, ప్రత్యేకించి బూటకపు ఎన్‌కౌంటర్ల రూపంలో అమలయిన రాజ్యహింసకు వ్యతిరేకంగా, మన రాష్ట్రంలో పౌరహక్కుల ఉద్యమం మొదలయింది. ఎమర్జెన్సీ తర్వాత బూటకపు ఎన్‌కౌంటర్లపై తార్కుండే కమిటి, జస్టిస్ భార్గవ కమీషన్‌ల విచారణ జరగడానికి పౌరహక్కుల సంఘం కృషివుంది. భూమయ్య, క్రిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలకు వ్యతిరేకంగా పౌరహక్కుల ఉద్యమం స్పందించి పనిచేసింది. ఆనాటి ప్రజాఉద్యమాల స్ఫూర్తితో బాలగోపాల్ హక్కుల ఉద్యమాన్ని తన కార్యక్షేత్రంగా ఎంచుకుని 1980ల నుండి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి దగ్గరయ్యాడు. కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. అనతికాలంలోనే, అనగా 1983లోనే సంస్థ ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. 15సంవత్సరాల పాటు సంస్థకు నాయకత్వం వహించి, పౌరహక్కుల సంఘాన్ని విస్తృత పరచడంలో ఎనలేని కృషి చేశాడు.

ఎటువంటి నిర్బంధాన్నైనా తట్టుకుని నిలబడగలగడం పౌరహక్కుల కార్యకర్తలకు వుండాల్సిన ముఖ్య లక్షణం. ఈ విషయంలో బాలగోపాల్ నుండి నేర్చుకోవాల్సింది ఎంతైనా వుంది. పౌరహక్కుల సంఘంపై ప్రభుత్వ నిర్బంధం తీవ్రరూపం దాల్చి, గోపిరాజన్న, జాపాలక్ష్మారెడ్డి, డా॥ రామనాథం, నర్రా ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తం, ఆజాంఆలీలు రాజ్యహింసకు బలైపోయినా, తనను పోలీసులు కిడ్నాప్ చేసినా, ఏ మాత్రం బెదరకుండా సంస్థను ముందుకు నడిపించడంలో బాలగోపాల్ అసమాన ధైర్యసాహసాల్ని చొరవను ప్రదర్శించాడు. సమాజంలో ప్రతి సమస్యకు హక్కులకోణం వుంటుందని చాటిచెప్పి, హక్కుల ధృక్పథాన్ని విస్తృతపరచాడు. "సమాజంలో ప్రతి మనిషి గౌరవంగా, హుందాగా బ్రతకడానికి హక్కులు అవసరం. అంతేకాకుండా మనిషిని శాసించి, అతని ఎదుగుదలకు ప్రతిబంధకంగా ఉన్న శక్తులను ప్రశ్నించడానికి హక్కులు అవసరం. సమాజంలో అసమానతలను, ఆధిపత్యాన్ని, పీడనలను ప్రశ్నించడానికి హక్కులు ఒక సాధనం". అని బాలగోపాల్ హక్కుల అర్థాన్ని, అవసరాన్ని తెలియజెప్పాడు.

హక్కులు సార్వజనీనం. హక్కులు అందరికీ వుండాలి. వాటిని అనుభవించే అవకాశం వుండాలి. వాటిని ఉపయోగించుకునే సామాజిక, ఆర్థిక వాతావరణం కావాలని బాలగోపాల్ అభిలషించాడు. కానీ నిత్యం సమాజంలో సామాన్య ప్రజల హక్కులు ఏఏ రూపాల్లో ఉల్లంఘనలకు గురవుతున్నాయో పరిశీలించి, అందుకు దారితీసిన సామాజిక ఆర్థిక పరిస్థితుల్ని కారణాలను అవగాహన చేసుకుని, ప్రభుత్వ విధానాల మంచి చెడ్డలను చర్చించి ఎన్నో సమస్యలపై బాలగోపాల్ నివేదికలను రూపొందించాడు. నిజనిర్ధారణ అంటే కేవలం వాస్తవాలను సేకరించి పత్రికా ప్రకటనలు ఇవ్వడం కాదు. నిజనిర్ధారణ ద్వారా చేసిన అధ్యయనం, రిపోర్టులు ప్రజలను చైతన్య పరచడానికి, ఆ చైతన్యంలో ప్రజలు స్వతంత్రంగా తమ హక్కుల కోసం పోరాడే ధైర్యాన్ని ఇవ్వడం జరగాలని బాలగోపాల్ చెప్పేవారు. తన పని విధానం హక్కుల కార్యకర్తలందరికీ అనుసరణీయం. ఇవ్వాళ హక్కుల సంస్థల్లో పనిచేస్తున్న వందలాదిమందికి బాలాగోపాల్ స్ఫూర్తిగా నిలచాడు. సమాజంలో ముందుకు వచ్చే ప్రజాస్వామిక ఉద్యమాల ఆకాంక్షలను ఆకళింపు చేసుకోవడం, వాటిని సమర్థించడం, హక్కుల కోణం నుండి వాటికి మద్దతు తెలుపడం హక్కుల ఉద్యమ కర్తవ్యంగా భావించాడు బాలగోపాల్.

పౌరహక్కుల ఉద్యమ పరిధిని, అవగాహనను విస్తృతపరచడంలో బాలగోపాల్ ప్రధాన భూమికను పోషించాడు. 1985లో కారంచేడులో దళితుల ఊచకోత ఘటన నేపథ్యంలో సమాజంలో హక్కుల ఉల్లంఘనకు 'కులవ్యవస్థ' ప్రధాన కారణమనే అవగాహనతో దళితులపై దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. కులప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం సమానత్వపు హక్కుకు వ్యతిరేకం అనే అభిప్రాయం నుంచి రిజర్వేషన్లు ఒక ప్రజాస్వామిక హక్కుగా అవగాహన చేసుకోవడం, కుటుంబ హింసకు నేపథ్యంగా వున్న పురుషాధిక్య సమాజాన్ని గుర్తించి హక్కుల ధృక్పథాన్ని విస్తరించాడు. కరువు సమస్యలో హక్కుల కోణాన్ని తీసుకురావడం, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను అమలు చేయకపోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యం ద్వారానే కరువు సమస్య ఉందని, తద్వారా జీవించే హక్కుకు ప్రమాదం వుంటుందని వ్యాఖ్యానించాడు. రాజ్యహింసతోపాటు, ఇతర సామాజిక, ఆర్థిక వ్యవస్థల, అధిపత్య వ్యవస్థల హింసను అర్థం చేసుకోవాలన్నాడు. హక్కుల స్పృహతో వీటిని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామికీకరణం కోసం కృషిచేయాలని వాదించాడు.

కొన్ని అంశాలపై అవగాహనలో ఏర్పడిన అభిప్రాయభేదాల వల్ల బాలగోపాల్ 'మానవ హక్కుల వేదిక'ను ఏర్పాటు చేశాడు. అయినా ఏకాభిప్రాయం ఉన్న అనేక హక్కుల ఉల్లంఘనలపై పౌరహక్కుల సంఘంతో కలసి పనిచేశాడు. ఎన్నో ఉమ్మడి కార్యక్రమాల్ని చేపట్టడం జరిగింది. ఉద్యమకారుల హింసపై విమర్శనాత్మకంగా స్పందించినప్పటికి, రాజ్యహింసను ఎండగట్టడంలో ఎక్కడా రాజీపడలేదు. చివరగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతో చేపట్టిన మావోయిస్టుల ఏరివేత కార్యక్రమం అమాయక గిరిజనుల మరణానికి దారితీస్తుందనే ఆందోళనతో 'ఆ వేటను ఆపమని నినాదిద్దాం' అనే పిలుపునిచ్చాడు. అయితే ఇప్పుడు ఆ కంఠం మూగబోయింది.

# భయాంధ్రప్రదేశ్!

*అక్టోబర్ 2, 2009 అనంతపురంలో మానవహక్కుల వేదిక మూడవ రాష్ట్ర మహాసభల్లో కె. బాలగోపాల్ చేసిన ప్రసంగంలోని కొన్ని భాగాలు*

**భయం నుంచి బయటపడి ధైర్యంగా ఆత్మస్థైర్యంతో మాట్లాడేటటువంటి ఆ ప్రజాస్వామిక విలువను కాపాడుకోవటం కూడా చాలా ముఖ్యమైన పనైపోయింది ఇవ్వాళ మన ఆంధ్రప్రదేశ్‌లో. ఆత్మస్థైర్యం, ధైర్యం, నిర్భీతి, ఈ ప్రజాస్వామిక విలువలు లేకపోతే హక్కులసాధన అయ్యేపనికాదు, ఇవి లేకపోతే మనం హక్కుల కోసం కొట్లాడటమనేది సాధ్యమయ్యేపనికాదు. అది చెప్పటం అవసరమని నేననుకుంటున్నాను.**

సమాజంలో భయపడుతూ ఉంటే, నిజం చెప్పటానికి భయపడుతూంటే, అబద్ధాన్ని అబద్ధం అనడానికి భయపడుతూ ఉంటే ఏ హక్కులు సాధించుకుంటాం?

దళితులు గానివ్వండి, కార్మికులు గానివ్వండి, సత్యాన్ని సత్యం అనగలగాల, అసత్యాన్ని అసత్యం అనగలగాల, నాకిది న్యాయమూ అని నిర్భయంగా చెప్పగలగాల. అది సాధ్యం గాని చోట హక్కులు అనే మాటకు అర్థం ఉండదు. ఈ రాష్ట్రాన్ని భయం ఏలుతూ ఉంది. ఆ భయం నుంచి ఈ రాష్ట్రం బయటపడలేదు అని - పడింది అని ఒకవేళ అనుకున్నా ఎప్పుడైనా - రాజశేఖరరెడ్డి మరణం తరువాత జరుగుతున్నటువంటి పరిణామాలు స్పష్టం చేస్తావున్నాయి.

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వ్యక్తి తన కుర్చీలో కూర్చోలేడు. ధైర్యం చాలడం లేదు.. తన తోటి మంత్రులు పని చెయ్యకపోతే, ఎందుకు పని చేయడం లేదు అని వాళ్ళనడగకుండా, 'ఏం? మంత్రి ప్రతిరోజూ సంతకం చేయాలా సెక్రటేరియట్‌లో కూర్చోని?' అని వాళ్ళ తరపున ఆయనే జవాబు చెప్తున్నాడు. అడగటానికి ఆయనకు భయం.

రాజశేఖరరెడ్డి చనిపోయినాక రాష్ట్రంలో ఎవరో అన్నారంట, ప్రతి పెద్ద ఆస్పత్రిలోను కూడ రోజుకో ఇరవై అయిదు ముప్పై అయిదు మంది గుండెపోటుతో వస్తుంటారు, పోతుంటారు, కొందరు మళ్ళీ ఇంటికి పోతుంటారు అని. ఇవ్వన్నీ గూడా ఆ చావుకు సంబంధించిన మరణాలే అని బుకాయించారని ఒక ఆంగ్ల పత్రికలో ఆంగ్ల మీడియా చెప్పవలసివచ్చింది. మనకు ధైర్యం చాలడం లేదు. ఇక్కడ మీడియాకు ధైర్యం చాలడం లేదు. ఇక్కడ వ్యాఖ్యాతలకు ధైర్యం చాలడంలేదు. అన్నిటినీ తీవ్రంగా విమర్శించే వ్యాఖ్యాతలుగా టివిలో కనిపించినటువంటి మహానుభావులు, పేర్లు చెప్పొద్దు, బాగుండదు, వాళ్ళకి సాధ్యం కాదు.

ఎటువంటి సమాజజంలో జీవిస్తున్నాం మనం? ఈ సాధ్యం కాకపోవడం, నిజాన్ని నిజం అనలేకపోవడం, కొందరిలో భయం కావచ్చు. కొందరిలో అవకాశవాదం కావచ్చు, రెండూ కూడా ప్రజాస్వామ్యానికి వినాశకరమే, ఎందుకంటే, నిజాయితీ లేకపోతే, భయం ఉన్నా నిజాయితీ ఉండదు, అవకాశమున్నా నిజాయితీ ఉండదు, నిజాయితీ లేకపోతే ప్రజాస్వామ్యముండదు. హక్కుల సాధన సాధ్యం కాదు. హక్కులు సాధించుకోవడం సాధ్యంకాదు, ఇటువంటి సమాజంలో బ్రతుకుతున్నాం మనమూ అనే ఓ సిగ్గుపడే పరిస్థితి, బుర్రరాములు అననే అన్నాడు. మనకు వాస్తవానికి ఉంది నెలరోజులుగా. అరే, గమనించలేదే మనం, ఇంతటి దౌర్భాగ్య పరిస్థితులలో మనమున్నామని మనకు మనమే చెప్పుకోవలసి వస్తుంది. ఎట్లా దీన్నించి బయటపడాలా అనే ప్రశ్న వేసుకోవలసి వస్తుంది.

హైదరాబాద్‌లో బ్రతికి వాళ్ళకి ఓ జ్ఞాపకం తప్పనిసరిగా వస్తుంది. ఎవ్వరూ మాట్లాడలేకపోతున్నారు. జగన్‌మోహనరెడ్డిని ముఖ్యమంత్రిగా చెయ్యకపోతే ఇది జేస్తాం అది జేస్తాం అనడం, ఇక్కడా అక్కడా దౌర్జన్యానికి పాల్పడటం చూస్తూ ఉంటే, హైదరాబాద్ నివాసులమైన మాకు 1992 జ్ఞాపకం వస్తుంది. ఒక ముఖ్యమంత్రిని దించి మరొకరిని ఎక్కించడానికి పీకలు కోసిన ఆ మారణకాండ జ్ఞాపకం వస్తుంది. తండ్రి పీకలు కోసి ఆ రోజు ముఖ్యమంత్రులను మార్చాడు. కొడుకు అదే పని చేస్తాడా అన్న భయం. మీకిది అతిశయోక్తిగా అనిపియ్యవచ్చు బయట వాళ్ళకు. హైద్రాబాదులో బ్రతికిన వాళ్ళకు, చూసిన వాళ్ళకు, ఆ ఘటన కాలంలో అక్కడ జీవించిన వాళ్ళకు సహజంగా వచ్చేటటువంటి సందేహం. ఎందుకు అనలేకపోతున్నారు ఈ విషయాలన్నీకూడా, ఎందుకు మాట్లాడలేక పోతున్నాం? ఈ జాతి, హక్కుల సాధనకు యోగ్యమైన జాతేనా? ఈ జాతి ప్రజాస్వామ్యానికి అర్హతున్న జాతేనా, ఈ తెలుగు జాతి? విమర్శకులుగా, మేధావులుగా, ప్రగతిశీల వ్యక్తులుగా పేరుబడ్డ వాళ్ళు, భయంలోపల తమ అవకాశాలు వెతుక్కుంటూ, దౌర్జన్యం లోపల తమకు అవకాశాలు వెతుక్కుంటూ, పోతూంటే, ఈ జాతి భవిష్యత్తు ఏమిటీ అన్న ప్రశ్న. మేధావులు, బుద్ధిజీవుల పాత్ర ఎక్కువగా అంచనా వేయనక్కరలేదుగాని, నిజాయితీగల బుద్ధి

---

సంపాదకీయం 2వ పేజీ తరువాయి

హక్కుల ఉద్యమానికి బాలగోపాల్ లేనిలోటు వాస్తవమే. కానీ ఏ ఉద్యమమైనా సంఘటితమే కదా! నాయకత్వం క్రియాశీలత, సాధారణ కార్యకర్తల కృషి సహకారం లేకుండా ఏ ఉద్యమం ముందుకు పోదు. పౌరహక్కుల ఉద్యమంలో అనేక మంది తమ ప్రాణాలు త్యాగం చేశారు. ఉద్యమాలు నిర్మాణయుతంగా, సంఘటితంగా ఉన్నపుడు మరింత బలంగా ఎదుగుతాయి. ప్రస్తుతం హక్కుల ఉద్యమం అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నది. హక్కుల నేతలు తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ విధానాల మూలంగా ప్రజల హక్కులు నిరాకరణకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో హక్కుల పరిరక్షణకు సంఘటితంగా ఉద్యమించడం అవసరం. బాలగోపాల్‌లోని నిజాయితీని, నిబద్ధతను మనలో అంతర్లీనం చేసుకుని హక్కుల పరిరక్షణకు నడుం బిగించడమే హక్కుల కార్యకర్తలు ఆయనకు ఇవ్వగల నిజమైన నివాళి.

జీవులు ఉండటమనేది ఒక సమాజం పురోగతికి ఒక అవసరమైన విషయమది. వాళ్ళ చేతిలో అంతా లేకపోయినా గూడా, నిజాయితీ ఉన్న బుద్ధిజీవులు లేరు ఈ ఆంధ్రప్రదేశ్‌లో, ఈ తెలుగు జాతిలో, ఎంత బాధాకరమైన పరిస్థితి. భయం సంగతి పోనివ్వండి, రాజశేఖరరెడ్డి పథకాలలో భాగంగా ఇక ఇందిరమ్మ ఇల్లొచ్చినటువంటి ఒక బీదవాడు ఏడిచి, ఆయన చనిపోయాడని ఏడిస్తే నేనర్థం చేసుకుంటాను. తనకు తెలిసింది అంతే ప్రపంచం, అంతకంటే సమగ్రమైన వివేచన తనకు సాధ్యం కాదు, ఆ సమాచారం లేదు, ఆ విశదీకరణ తెలియదు. ఆరోగ్యశ్రీ పథకం వల్ల, చాలాకాలం నయం కానివాడు, రోగం నయమయిన వ్యక్తి అయ్యో రాజశేఖరరెడ్డి చనిపోయాడని ఏడిస్తే నేను అర్థం చేసుకుంటాను. అంతకన్నా సమగ్రమైన విశ్లేషణలో అంతర్భాగంగా దానిని చూడటం ఆ వ్యక్తికి సాధ్యం కాదు. కాని దేన్నైనా ఒక మొత్తంలో చూడాలి, మొత్తంలో భాగంగానే ఆ భాగానికీ అర్థముంటుంది, మొత్తానికీ అర్థముంటుంది అని విశ్లేషించుకునేటటువంటి ప్రగతిశీల సంప్రదాయమున్న ఈ రాష్ట్రంలో, ఈ సంక్షేమ చర్యలు అన్నీ సంక్షేమచర్యలేనా? ఆ ప్రశ్న వేసుకోవచ్చు. కొన్ని అవును, కొన్ని కాదు, కొన్ని ఆయనవి కానేకాదు. అదట్లావుంచి, ఏమి తీసుకుని ఏమిస్తున్నారుయ ఇది ఇవ్వటానికి ఎంత తీసుకుంటూవున్నారు, ఏమి గుంజుకొని చేతిలో కొంత బెడుతున్నారు, ఎంత గుంజుకొంటున్నారు ఎంత పెడుతున్నారు అనే ప్రశ్న వేసుకుంటే తప్ప ఈ మొత్తం అర్థం గాదు, దాంట్లో భాగం అర్థం కాదు, ఆ సంక్షేమం అర్థం గాదు, అనే ఒక ప్రాథమిక విశ్లేషణ వివేచన చేయలేకపోతున్నారు అంటే అది భయమైనా, అది అవకాశవాదమైనా, ఏదో తమకోసం పొందామనేటటువంటి ఆకాంక్ష అయినా, దౌర్జన్యానికి భయపడి నోరు మూసుకునే పరిస్థితి అయినా, చాలా బాధాకరం. ఎక్కడ నుంచి వస్తున్నాయి ఇవన్నీ గూడా? ఎందుకు ఆకస్మాత్తుగా ఈ పదిహేను సంవత్సరాలలోనే, కోట్లాది రూపాయలు దీనికి దానికి మరొకదానికి పేదవాళ్ళకు ఇస్తున్నాము, ఇవ్వగలుగుతాము మేము అని కొందరు ఇస్తున్నారు? నేను ఇంకా ఎక్కువ ఇస్తాను అని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు గారైతే ఫ్రీగా డబ్బులే ఇస్తాను, నగదు బదిలీ అన్నాడు. ఏమిటీ దీని వెనకాలనున్నటువంటిది ఇవి ఇవ్వడానికి? ఇచ్చేవాడే ఆయన గెలిచుంటే, కొంతగాకపోతే కొంతైనా ఇచ్చుండేవాడు, ఇవ్వాళ గాకపోతే రేపైనా, ఈ దాతృత్వం వెనకాల, ఈ సంక్షేమం వెనకాల ఉన్నటువంటి ఒక టోటాలిటీ ఏమిటి? ఒక మొత్తం ఏమిటి?

నరసింహారెడ్డిగారు చెప్పారు, ప్రపంచీకరణలో భారతదేశ భాగం అయిన తరువాత మిగులు చాలా పెరిగింది. ఆ మిగులు విదేశీ మారక ద్రవ్యంలోనూ ఉంది, దేశం లోపల కన్సాలిడేటెడ్ ఫండ్‌లోనూ ఉంది. ఆ మిగులు నుంచి ఇవ్వగలుగుతున్నారు, చెయ్య గలుగుతున్నారు. ఆ మిగులు నుంచే అనేక సంక్షేమ పథకాలు అమలుచేయగలుగుతున్నారు. కానీ ఆ మిగులు పొందడానికి, ఆ ప్రపంచీకరణ అమలుచేయడానికి ఎంత లాక్కొంటున్నారు అదే ప్రజానీకం నుంచి, ఏమే మి గుంజుకుంటున్నారు అదే ప్రజానీకం నుంచి. ఒక హక్కుగా, ఒక పాలనా బాధ్యతగా, ఈ ప్రజానీకానికి అందవలసినటువంటి విద్యగాని, వైద్యంగాని రోడ్లుగాని, రవాణా సదుపాయాలుగాని, వీటి మీద పెట్టవలసిన ఖర్చంత గూడా ఆపేసి, తగ్గించేసి, కార్పొరేట్ పెట్టుబడి కోసం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మీద ఖర్చు పెట్టుకొంటూపోతున్నారు. వైద్య వ్యవస్థ ఎట్లా నాశనమయ్యింది? విద్యావ్యవస్థ ఎట్లా నాశనమయ్యింది, రవాణా వ్యవస్థ ఎట్లా నాశనమయ్యింది, ఆ డబ్బంతా ఎక్కడికి పోయింది? ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కి పోయింది, కార్పొరేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు పోయింది. అది మనం చూస్తూనే ఉన్నాం.

ప్రజానీకానికి నిత్య జీవితంలో జీవనం కల్పించే ప్రకృతి వనరులు భూమి, నీళ్ళు, అడవులు, గాలి, 2 లక్షల ఎకరాలు ఈ రాష్ట్రంలో వాళ్ల నుంచి గుంజుకొని, ఈ కార్పొరేట్ సెక్టార్‌కు ఇవ్వబడుతున్నాయి, ఇవ్వబడ్డాయి కొంత. అవంతా తీసేసుకొని, ఆ కార్పొరేట్ కంపెనీలకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తయారుచేసి, సదుపాయాలు తయారు చేసి, వాటిని ఆహ్వానించి, ఆ పెట్టుబడుల నుంచి, దాన్నించి వచ్చిన గ్రోత్ రేట్ నుంచి సంక్షేమం ఇస్తే, ఆ మొత్తంలో భాగంగా చూచినప్పుడు ఈ సంక్షేమానికి అర్థమేమిటి? చూడలేకపోతున్నావా నువ్వు? ఎందుకు చూడలేకపోతున్నావు? ఆ దృష్టి నీకు ఎందుకు లేకుండా పోతుంది? ప్రగతిశీలవాదులు, అభ్యుదయవాదులు, విశ్లేషణ చాతుర్యం ఉన్నవాళ్ళు అని పేరుపొందిన వాళ్ళు. నేను అవకాశవాదమే అనుకుంటాను. అందుకే బుద్ధిజీవులు, తెలుగు బుద్ధి జీవులంటే ఇవ్వాళ సిగ్గుపడుతున్నాను. బహిరంగంగా ప్రకటిస్తున్నాను తెలుగుజాతి బుద్ధి జీవుల పట్ల నేను సిగ్గుపడుతున్నాను.

నరసింహారెడ్డి విశ్లేషించి చెప్పుకుంటూ వచ్చారు. ఆయన ఒక మాట అన్నారు. మనం హక్కుల గురించి-ఎన్ని కోణాల నుంచి మాట్లాడినా, ఏమేమి చెయ్యవచ్చు, ఏ విధంగా పరస్పర సహనం పెంపొందించుకోవచ్చు మతాలు కులాలు వీటి పట్ల, అని ఎన్ని మాట్లాడుకున్నా, ప్రపంచీకరణ, నయా ఉదారవాద పాలనా విధానాలు, ఆర్థిక విధానాలు, వాటి ఫలితంగా భౌతిక వనరుల పంపిణీ, వనరుల వినియోగం, దాన్నించి వచ్చే ఫలాల పంపిణీ వాటిని ఏం జేస్తున్నారు అని చూడకపోతే, మనం జేసే మిగిలిన పనులన్నీ గూడా అపరిపూర్ణంగా వుంటాయి. సంపూర్ణంగా ఉండవు. దానిమీద తీవ్రమైన విమర్శ పెట్టాల్సిన అవసరం ఉంది. దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అవన్నీ మర్చిపోతే ఎట్లా? తెలియకకాదు, నరసింహారెడ్డిగారి మాటలు ఇదే మనుషులు గతంలో వినకా కాదు. చాలా బాధకరమైన పరిస్థితి. ఇవ్వాళ భయం నుంచి బయటపడి ధైర్యంగా ఆత్మస్థైర్యంతో మాట్లాడేటటువంటి ఆ ప్రజాస్వామిక విలువను కాపాడుకోవటం కూడా చాలా ముఖ్యమైన పనైపోయింది ఇవ్వాళ మన ఆంధ్రప్రదేశ్‌లో. ఆత్మస్థైర్యం, ధైర్యం ప్రజాస్వామిక విలువలు, ఇవి లేకపోతే హక్కుల సాధన అయ్యేపనికాదు, ఇవి లేకపోతే మనం హక్కుల కోసం కొట్లాడటమనేది సాధ్యమయ్యే పనికాదు. అది చెప్పటం అవసరమని నేననుకుంటున్నాను.

# ఈ వేట ఆపమని నినదిద్దాం!

*('ఆంధ్రజ్యోతి' దినపత్రికకు కె. బాలగోపాల్ రాసిన వ్యాసం)*

'గ్రీన్‌హంట్' మొదలయింది. హోంమంత్రి చిదంబరం సెప్టెంబర్‌లో మొదలు పెడతామని చెప్పి నవంబర్‌కు వాయిదా వేసిన మావోయిస్టుల 'ఏరివేత'కార్యక్రమం మొదట అనుకున్నట్టుగా సెప్టెంబర్‌లోనే ప్రారంభమయింది. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే వార్తల విశ్వసనీయత స్వల్పమే కాబట్టి ఎంత మంది కోబ్రాలు దంతెవాడ జిల్లాలోకి ప్రవేశించారు, కేంద్రం ఎన్ని బెటాలియన్ల పారామిలిటరీని పంపింది. కాల్పులలో ఇప్పటికి ఇటువైపు, అటువైపు ఎంతమంది చనిపోయారు ఇత్యాది విషయాలపై పత్రికలు ఇస్తున్న గణాంకాలు పూర్తిగా సత్యాలు కాకపోవచ్చును. సిబ్బంది సంఖ్య తెలుసుకోవడం కొంచెం ప్రయత్నం చేస్తే అసాధ్యం కాకపోవచ్చును గానీ మరణాల గురించి ఆ మాట అనలేం. మరణానికి సాక్షి మృత దేహం. కానీ ఛత్తీస్‌గఢ్ పాలకులు తమవారి మృతదేహాలను మాత్రమే స్వాధీనం చేసుకొని పంచనామా, పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబం సభ్యులకు అప్పగిస్తారు. మావోయిస్టులు, వారి సానుభూతిపరుల మృతదేహాలను అడవి జంతువులకు వదిలేసి రావడం తరచుగా జరుగుతుంది. ఒక సంవత్సరం క్రితం వరకు ఎప్పుడూ అదే జరిగేది. ఈ మధ్య కొన్ని సందర్భాలలో వారి మృతదేహాలను కూడా తీసుకొచ్చి పంచనామా చేస్తున్నట్టున్నారు. చనిపోయినవారు సాయుధ నక్సలైట్లు కాక గ్రామీణ ప్రజలయితే, వారి మృతదేహాలను అడవిలోనే వదిలేయడం పాలకుల దృష్టిలో తెలివయిన పని. నిజంగా సాయుధ కార్యకర్తలయినా కూడా, ఆ విద్రోహుల శవాలకు ఇన్ని మర్యాదలు, దానికోసం తమకింత శ్రమ అనవసరం అన్న అభిప్రాయం ఛత్తీస్‌గఢ్ పాలనా యంత్రాంగంలో ఉన్నట్టుంది. శ్రీలంకలో ఎల్.టి.టి.ఇ పైన జరిగిన పంచనామాలో వారిని చిత్రహింసలు పెట్టి చంపిన దాఖలా లున్నాయని బయట పడిన తరువాత, పంచనామా చేయకుండా ఖననం చేయొచ్చునని ఆ దేశ ప్రభుత్వం ఆర్డర్ జారీచేసింది. మన ప్రభుత్వాలు అటువంటి ఆదేశాలు జారీ చేయడానికి రాజ్యాంగం అడ్డం రావచ్చును కాబట్టి అలిఖిత ఆదేశాల ద్వారా ఛత్తీస్‌గఢ్ పాలకులు దానిని అమలు చేస్తున్నారు.

మీడియా ఆ ఛాయలకు రాకూడదని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తాఖీదు జారీచేసిందని కూడ పత్రికలు చెప్పున్నాయి. 'గ్రీన్‌హంట్'లో వేటాడబడుతున్నది సాయుధులా లేక వారి వెంబడి ఉన్న ఆదివాసులా అన్నది బయటపడకుండ ఉండడానికి ఈ ఆంక్ష సహితం అవసరం అని రమణ్‌సింగ్ ప్రభుత్వం భావించినట్టుంది. ఈ ఆంక్షను ధిక్కరించే ధైర్యం మీడియాకు ఉంటే గెలవగలరు. ఎందుకంటే పత్రికా స్వేచ్ఛ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగం అని సుప్రీంకోర్టు రాజ్యాంగం రాసిన తొలినాళ్లలోనే వ్యాఖ్యానించింది. దానిని రాజ్యాంగం ఆమోదించిన పరిమితులమేరకు, అదీ చట్టం చేసి, నియంత్రించవచ్చునుగానీ ఏ కారణం చూపించకుండ జీవోల ద్వారా మీడియాను నిషేధించే అధికారం ప్రభుత్వానికి లేదు. తుపాకులు పట్టుకొని అడ్డం నిలబడ్డ కోబ్రాలతో రాజ్యాంగాన్ని గురించి వాదించి ప్రాణాలతో బయటపడడం సాధ్యమని కాదు గానీ, కనీసం ఈ ఆంక్ష చట్ట రీత్యా అక్రమం అని తెలుసుకోవడం అవసరం. లేకపోతే మీడియాను రానివ్వం అని ప్రభుత్వాలు ఒక దాని తరువాత ఒకటి నిషేధాలు పెట్టడం మొదలు పెడితే ప్రజాస్వామ్యానికి చాలా నష్టం. లాల్‌గఢ్‌లో వామపక్ష ప్రభుత్వం మొదలుపెట్టింది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కొనసాగిస్తున్నది. అయితే ఈ విషయంలోనూ శ్రీలంక ఇన్‌స్పిరేషన్ ఉన్నట్టుంది. ఎల్‌టిటిఇ పైన పోరులో చివరి మూడు నెలల్లో శ్రీలంక పాలకులు మీడియాను, దేశ ఉత్తర ప్రాంతానికి రానివ్వలేదు. ఆ దశలో 20 వేల మంది సాధారణ తమిళపౌరులు చనిపోయారని ఐక్యరాజ్యసమితి అధికారులు అంతరంగిక ఉత్తర ప్రత్యుత్తరాలలో చెప్పుకున్న విషయాన్ని చూస్తే శ్రీలంక పాలకుల ఉద్దేశ్యం అర్థం అవుతుంది.

శ్రీలంక ప్రస్తావన ఇప్పటికి రెండు సార్లు వచ్చింది. మూడవసారి వస్తేగాని కథ పూర్తికాదు. ఎల్‌టిటిఇ సైనిక పతనం తరువాత ఇండియా పాలకులకొక ధైర్యం వచ్చింది. మిలిటెంట్ రాజకీయ పోరాటాలతో శాంతి చర్చలు, రాజకీయ పరిష్కారాలూ అక్కరలేదనీ గట్టిగా పూనుకుంటే వారిని భౌతికంగా ఏరివేయవచ్చుననీ ఇప్పుడు మన పాలకులు కూడ నమ్ముతున్నారు. అప్పటికే దేశ అంతరంగిక భద్రతకు ప్రధాన ప్రమాదం అని ప్రకటించబడ్డ మావోయిస్టులను ఏరివేయాలన్న సంకల్పం దీనితో బలపడింది. దేశ అంతరంగిక భద్రతకు మావోయిస్టుల కంటే పాలక పార్టీల అవినీతి, అక్రమపరిపాలన, అసమానతలను వికృతంగా పెంచుతున్న ఆర్థిక విధానాలు ఎక్కువ ముప్పు కాదా అని సాధారణ మానవులకు సహితం సందేహం రావొచ్చు. కాని ప్రస్తుతం హోంమంత్రిగా ఉన్న ఆయన మాజీ ఆర్థిక మంత్రి, దేశ 'అభివృద్ధి'విధానకర్తలలో ఒకడు అయిన చిదంబరానికి తెలిసిన విషయమేమిటంటే అంతరంగిక భద్రత సంగతి ఎట్లాగున్నా మధ్యభారత అడవి ప్రాంతాలలోని అపారమయిన ఖనిజ సంపదను వెలికి తీసి 'అభివృద్ధికి'వనరుగా వినియోగించే ప్రయత్నానికి మావోయిస్టుల ఉనికి అడ్డం కాగలదని, మావోయిస్టులు తమకు ప్రాబల్యం ఉన్న ప్రాంతాలలో బడా పెట్టుబడిదార్ల ఉనికికీ విస్తరణకూ అన్ని సందర్భాలలోనూ అడ్డుపడలేదుగానీ, అడ్డుపడగలరన్న భయం వల్ల పెట్టుబడిదార్లు ముందుకు రాకపోవచ్చునని ఆ ఆందోళన.

అన్నీ కలిసి మావోయిస్టుల ఏరివేత ప్రక్రియకు దారి తీసాయి. భారీగా పారా మిలిటరీని, గెరిల్లా తరహా శిక్షణ పొందిన కోబ్రాలనూ దించి భౌతికంగా మావోయిస్టులను తుదముట్టిస్తాం అని చిదంబరం టూత్‌పేస్ట్ చిరునవ్వు చెదరకుండ చేస్తున్న సవాలు అమలుకావడం మొదలయింది. ఈ ఏరివేతకు అర్థం ఆదివాసుల హననం కాగలదని నిన్న మొన్న దంతెవాడ కాల్పుల గురించి అరకొరగా వస్తున్న వార్తలు తెలుపుతున్నాయి. అయితే మావోయిస్టులూ అదే భాష

మాట్లాడుతున్నారు. తమ తడాఖా చూడమని ప్రభుత్వానికి ఎదురు సవాలు విసురుతున్నారు. అబుజ్‌మడ్‌లో పారామిలిటరీని దించుతాం అని చిదంబరం ప్రకటించిన రెండవరోజే రాజ్‌నంద్‌గాంలో పోలీసులను పెద్ద సంఖ్యలో చంపారు. సాయుధపోరాటమార్గాన్ని ఎంచుకున్నవారు యుద్ధం వచ్చినప్పుడు యుద్ధం చేయక తప్పదుగానీ ప్రజల మధ్య బతుకుతూ యుద్ధాన్ని ఆహ్వానించే పనులు చేయకూడదు. నివారించడానికి ఎంత చేయగలిగితే అంత చేయాలి. ఏం చేయవచ్చునంటే చాలా చర్చ పెట్టుకోవచ్చునుగానీ, అసలు ఆవైఖరి ఉందా అనేది ప్రశ్న. మావోయిస్టు నాయకులకు ఇటువంటి ప్రశ్నలు నచ్చవు. 'మీరు ఎవరి పక్షం?'అని అడుగుతారు. రాజకీయ పక్షపాతాన్నే కాక విలువల పక్షపాతాన్ని కూడ గుర్తించేట్టయితే మేము న్యాయం పక్షం అని జవాబు చెప్పవచ్చు. న్యాయం ఎక్కువ భాగం ప్రజలకోసం పోరాడేవారి వైపే ఉంటుంది గానీ, వారు ప్రజల క్షేమంకంటే తమ రాజకీయ లక్ష్యాన్ని ప్రధానంగా ఎంచినప్పుడు అది అన్యాయం అనక తప్పదు.

'ప్రభుత్వం మాత్రం ఎంతకాలం చూస్తూ ఊరుకుంటుంది'అని అడిగే వారూ ఉంటారు. ప్రజల అవసరాలకోసం మిలిటెంట్ పోరాటాలు చేయడం వేరు, రాజ్యసార్వభౌమత్వాన్నే సాయుధంగా సవాలు చేయడం వేరు. మొదటిదాని పట్ల కొంత ఉదారంగా ఉండగల పాలకులు సహితం రెండవదాని పట్ల ఉండలేరని అంటారు. మావోయిస్టులయినా రేపు అధికారానికి వస్తే ఇంతకంటే భిన్నంగా నడుచుకుంటారా అని ప్రశ్నిస్తారు. ఇది న్యాయమైన ప్రశ్నేగానీ, ఎటువంటి సవాలునైనా ప్రజాస్వామికంగానే ఎదుర్కోవాలనేది ప్రజాతంత్రవాదులివ్వగల ఏకైక సమాధానం. దీనికి మార్గం చెప్పమని కోరుతూ 11వ ప్రణాళికా సంఘం ఒక నిపుణుల కమిటీని నియమించగా మావోయిస్టుల వల్ల ప్రజలు ఏ హక్కులు, ఏ స్వతంత్రం, ఏ జీవనావకాశాలు పొందారో అవి నీ సార్వభౌమాధికారాన్ని వినియోగించి నువ్వే కల్పించడం ఒక్కటే వారిని ప్రజాస్వామికంగా ఎదుర్కొనే మార్గం అవుతుందనివారు చెప్పడం జరిగింది. మన్మోహన్‌సింగ్‌గానీ, చిదంబరంగానీ ఆ నివేదిక చదివిన దాఖలాలు లేవు.

చివరిగా, దంతెవాడ జిల్లాలోని సంఘర్షణ ఎప్పటిలాగే భద్రాచలం డివిజన్‌లో ప్రతిధ్వనించడం మొదలయింది. చింతూరు నుంచి వాజేడు దాకా పోలీసులు ఆదివాసులను బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు రప్పించి అక్రమంగా నిర్బంధించి తీవ్రంగా హింసించి 'బైండోవర్'చేస్తున్నారు. చర్ల పోలీసులు చేతులూ కాళ్లూ కట్టి కొక్కానికి వేళ్లాడదీసి చితకగొట్టిన ఆర్.కొత్తగూడెం కాలనీ వాసి కొమురం నరసింహారావు, మళ్లీ ఏం చేస్తారో అన్న భయానికి ఈ నెల 7వ తేదీన తన ఊరి సమీపంలో ఆత్మహత్య చేసుకోవడంతో ఈ విషయం బయటి ప్రపంచానికి తెలిసింది. ఇక్కడే పరిస్థితి ఇట్లా ఉంటే దంతెవాడలో ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చు. అందుకే ప్రభుత్వం ఈ వేట ఆపాలని అందరమూ నినదించడం అవసరం. మావోయిస్టులూ ఆ దిశగా ఒత్తిడి పెంచే పద్ధతిలో నడుచుకోవాలని కోరడమూ అవసరం.

## ఆహ్వానం

### ఉత్తరాలు

పత్రిక ప్రచురణను మరింత మెరుగుపరుచుకోవటానికి పాఠకుల నిష్పాక్షికమైన స్పందనలు ఎంతో ముఖ్యం. అందుకే పాఠకుల ఉత్తరాలను ప్రచురించదలిచాం. మీ సలహాలను, సూచనలను, రచనలపై మీ స్పందనలను మాకు రాయగలరని కోరుతున్నాం.

### రిపోర్టులు

అన్ని జిల్లా శాఖల బాధ్యులు వారు చేపట్టే నిజనిర్ధారణ నివేదిక కాపీలను, తమ కార్యకలాపాలను రిపోర్టు రూపంలో ఎప్పటికప్పుడు సంస్థ కార్యదర్శికి, స్వేచ్ఛ వర్కింగ్ ఎడిటర్‌కి పంపడం వలన ఆయా జిల్లాల రిపోర్టులన్నింటినీ పత్రికలో సకాలంలో ప్రచురించగలం.

### రచనలు

హక్కుల కోణం నుంచి ప్రాముఖ్యత ఉండే వ్యాసాలను, అనువాద వ్యాసాలను (మూలవ్యాసంతో సహా) ఇతర రచనలను వర్కింగ్ ఎడిటర్ చిరునామాకు పంపితే, ప్రాధాన్యతననుసరించి వాటిని ప్రచురించగలము.

# హింస - ప్రతిహింస

### పీపుల్స్ ఎన్‌కౌంటర్‌పై సమీక్ష వ్యాసం

విప్లవహింసను కేవలం ప్రజల తక్షణ సమస్యల పరిష్కారానికి ఒక సమర్థవంతమైన సాధనంగా మాత్రమే అర్థం చేసుకున్నా చర్చ యిక్కడితో ఆగిపోవడానికి వీలులేదు. ఇటు విప్లవహింస, అటు పోలీసుహింస అంటే సరిపోదు. వ్యవస్థాగతమైన మూడో హింస ఒకటుంది. దీనిని గురించి మాట్లాడడం రామోజీరావు వాదనకు చాలా ప్రమాదకరం. అందుకే దానినొక అంశంగా ఆయన ఒప్పుకోడు. ప్రజలకు అనేక సమస్యలు వున్నాయని, అవినీతికి అక్రమ మార్గాలకు అలవాటు పడిన అధికార యంత్రాంగం, రాజకీయనాయకులు, వీటిని పరిష్కరించలేకపోతున్నారని - యింతమాత్రమే ఒప్పుకుంటాడు. ఆకలి, పేదరికం, అసమానత, అణచివేత యిదంతా కూడా హింసేనని, ఈ హింస సామాజిక వ్యవస్థలో అంతర్గతమైందని ఆయన ఒప్పుకోడు. ఒప్పుకుంటే విప్లవహింస గురించి జరిగేచర్చ స్వరూపం మారిపోతుంది.

'నక్సలైట్ బెడద'పాలక వర్గాలు ప్రచారం చేస్తున్న అవగాహనకై ఒక బెడదయి కూర్చుంది. నిజానికి అసలు బెడద కంటే ఈ బెడదే ఎక్కువయింది. పత్రికలలోనూ, ఇతర వేదికల నుండి వ్యక్తమవుతున్న ఆందోళనకు మూలం యిదే. నక్సలైట్ల గురించి ప్రజలకు తాము కలిగించదలచుకున్న అవగాహనను చక్కగా తయారు చేసుకున్నామని వాళ్ళు అనుకున్నప్పుడల్లా చరిత్ర రెండడుగులు ముందుకుపోయి తిరిగి కొత్త అవగాహనను రూపొందించవలసిన అగత్యం ఏర్పడుతోంది. ప్రజల దృష్టికి నక్సలైట్లు కేవలం ఒక మిలిటెంట్ పోరాటశక్తిగా కాక ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా కనబడటం ఎక్కువయ్యేకొద్దీ ఈ బెడద మరింత ఎక్కువ అవుతుంది. నక్సలైట్ల గురించి చెడు అభిప్రాయం ప్రచారం చెయ్యాలి కాని అది విశ్వసనీయంగా వుండాలి. వారిని ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా చూడడానికి సిద్ధమవుతున్న ప్రజలు నమ్మేటట్టు వుండాలి.

పాలకవర్గాలు నక్సలైట్ల గురించి ప్రచారం చేస్తున్న అభిప్రాయం కాలక్రమంలో సంకీర్ణమయిన మార్పులకు లోనవుతూ వుంది. ఇదంతా ప్రయత్న పూర్వకంగా ఒక కమిటీ వేసుకుని చేస్తున్నారని అనుకోకూడదు. అలాగే పాలకవర్గాలకూ విప్లవకారులకూ మధ్యనున్న సంఘర్షణ ఒక మలుపు తిరిగినప్పుడల్లా పూర్తిగా కొత్తచిత్రాన్ని తయారు చేసుకున్నారనీ అనుకోకూడదు. అటువంటిదేం జరగలేదు. అయితే ఒక్కొక్క దశలో కొన్ని కొత్త అభిప్రాయాలను, వాదనలను రూపొందిస్తున్నారు. ప్రచారం చేస్తున్నారు, మళ్ళీ తిరస్కరిస్తున్నారు. ప్రతి దశలోను పాలకవర్గాలు ప్రచారం చేస్తున్న చిత్రంలో ఎంతో కొంత అసంబద్ధత వుంటూనే వుంది. పాలకవర్గ భావజాలాన్ని ఎవరూ తీరి కూర్చుని ప్రయత్న పూర్వకంగా తయారుచేయక పోవడం ఈ అసంబద్ధతకు మూలం కాదు. ఏ భావజాలాన్నీ ఎవరూ అట్లా తయారు చెయ్యరు. అంతమాత్రం చేత అసంబద్ధత భావజాలాల సహజలక్షణం కాదు. మరి నక్సలైట్ల గురించి పాలకవర్గాలు ప్రచారం చేస్తున్న భావజాలంలో ఎంతో కొంత అసంబద్ధత సందిగ్ధం వున్నాయంటే దానికి రెండు కారణాలున్నాయి. ఒకటి - పాలకవర్గ రాజకీయాలే యివ్వాళ అనూహ్యంగా భ్రష్టు పట్టాయి. బీహార్ రాజకీయాల గురించి మామూలుగా ప్రచారంలో వుండే కథలన్నీ యివ్వాళ ఆంధ్రలో జరుగుతున్నాయి. అందువల్ల నక్సలైట్ల హింసాకాండ గురించి వాపోవడం వాళ్ళకు ఇప్పుడు పెద్దగా ప్రయోజనకరంగా లేదు. అయినా దానిని మానుకోలేకుండా వున్నారు. ఇదొక సందిగ్ధం. రెండు - నక్సలైట్ల రాజకీయాలు యివ్వాళ విశాల ప్రజానీకాన్ని ఆకర్షించే స్థితి ఏర్పడుతోంది. ఈ రెండవ మార్పు విప్లవపార్టీలకే పూర్తిగా అర్థమైనట్టు లేదు. అర్థమైతే వాళ్ల నిర్మాణ పద్ధతులలో, పని పద్ధతులలో చాలా మార్పులు రావాల్సి వుంటుంది. అయితే అది యిప్పటికి అప్రస్తుతం. కాని ఈ మార్పువల్ల పాలకవర్గాలకూ ప్రజలకూ మధ్యనున్న సంబంధంలోనూ, పాలకవర్గాల అంతర్గత సంబంధాలలోనూ వచ్చిన సంక్షోభం పాలకవర్గ భావజాలంమీద చాలా ఒత్తిడి పెడుతూ వుంది. ప్రయత్న పూర్వకంగానో, కాకుండానో పాలకవర్గ భావజాలాన్ని రూపొందించే మేధావులు, రచయితలు, కళాకారులు, సిద్ధాంత వేతల మీద చాలా భారం పెడుతూ వుంది.

ఈ సంక్షోభాల, ఒత్తిడుల ఫలితాన్ని విశ్లేషించడానికి రామోజీరావు 'పీపుల్స్ ఎన్‌కౌంటర్'సినిమా చక్కగా ఉపయోగ పడుతుంది. ఆంధ్రరాష్ట్ర ప్రాంతీయ పాలకవర్గాల ప్రతినిధిగా రామోజీరావు తన రాజకీయ సైద్ధాంతిక కర్తవ్యాన్ని గురించి ఖచ్చితమైన అవగాహన వున్న వ్యక్తి. ఈ వర్గం సున్నితమైన ఏ కర్తవ్యాన్నయినా సులభంగా భ్రష్టు పట్టిస్తుంది. కానీ రామోజీరావు మటుకు తన కర్తవ్య నిర్వహణలో నేర్పుగల మనిషి. ఈ వర్గం నక్సలైట్ల గురించి ఏమనుకుంటుందో, ప్రజలు ఏమనుకోవాలని ఆశిస్తుందో సంక్లిష్టంగా కలగలిపి తీసిన సినిమా 'పీపుల్స్ ఎన్‌కౌంటర్'. ఇందులో రెండవ విషయమే ప్రత్యక్షంగా కనిపిస్తుంది. వర్గచైతన్యంగల పెత్తందార్లు చేసే రచనల్లోగాని, తీసే సినిమాల్లోగాని తాము ఏమనుకుంటున్నారో చెప్పరు, మనం ఏమనుకోవాలో చెపుతారు. పీడితవర్గాల కళ మట్టుకే ఎప్పుడూ తన స్వంత అభిప్రాయాన్ని (అది సత్యంగాని, భ్రమగాని)వ్యక్తీకరిస్తుంది. మరొక రకంగా చెప్పాలంటే పెత్తందారీ వర్గాల కళలో నిజాయితీ ఎప్పుడూ వుండదు. పీడితవర్గాల కళ భ్రమాజనితమైనా నిజాయితీగా వుంటుంది.

కళారూపంలో ఒక ఉద్యమాన్ని గురించి దురభిప్రాయాన్ని కలిగించడానికి రెండు మార్గాలుంటాయి. ఒకటి - తప్పుడు పోకడలను, పొరపాట్లను ఏరి వాటినే అసలు సరుకుగా చలామణీ చెయ్యటం. రెండు - పొరపాట్లను పక్కకు పెట్టి అసలు విషయాన్నే తీసుకుని దాని గురించి వ్యతిరేకత కలిగే విధంగా వ్యాఖ్యానించడం. తెలుగు దినపత్రికలలో నక్సలిజాన్ని గురించి జరిగే ప్రచారం మొదటి కోవకు చెందింది. ఇందులో రామోజీరావుగారి 'ఈనాడు'ప్రధానపాత్ర

వహిస్తూవుంది. తప్పుడు అవగాహనతో జరిగిన చర్యలను, అనవసరమైన హింసాకాండకు పాల్పడిన సంఘటనలను ఏరి యిదే విప్లవం అంటున్నారు. అయితే ఈ సినిమాలో రామోజీరావు రెండవ పద్ధతిని అనుసరించారు. దినపత్రికలలా కాక ఈ సినిమా ప్రత్యక్షంగా ప్రచారం కోసం ఉద్దేశించింది. అందువల్లే ఈ మార్గాన్ని ఎంచుకున్నారని భావించాల్సి వస్తోంది. అయితే యిదే పోలీసులకు కోపం తెప్పించింది. విప్లవ రాజకీయ ఆచరణలోని చెడును మాత్రమే చూపిస్తే వాళ్ళు సంతోషించేవాళ్ళు. ఆ పని చేయకుండా విప్లవాన్ని సీరియస్‌గా తీసుకొని రాజకీయ విశ్లేషణ యివ్వడం ద్వారా నక్సలైట్లకు అనవసరమైన ప్రతిష్ట కల్పించారని వాళ్ళకుకోపం. అయితే వాళ్ళకు అర్థంకాని దేమిటంటే ఈ ప్రతిష్ట యిప్పటికే ప్రజల దృష్టిలోకి వచ్చివుంది. ఆ వాస్తవాన్ని గుర్తించడం మాత్రమే రామోజీరావు చేసిన పని. నిజానికి ఆ వాస్తవాన్ని గుర్తించారు కాబట్టే ఆయన ఈ సినిమా తీశారు.

హింసకు, అహింసకు మధ్యనున్న సంఘర్షణ ఈ సినిమాలోని ప్రధాన అంశం. ఒకప్పుడనలు 'నక్సలైటు సమస్య' గురించి పాలకవర్గాలు చేసే చర్చ మొత్తం ఈ ప్రాతిపదికమీదే నడిచేది. ఆ చర్చలో సహజంగానే అహింస గెలిచేది. మన భారతీయ సంస్కృతికి, మానవత్వ విలువలకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయ సూత్రాలకు అనుగుణమైన మార్గం అహింసేనని వాదించేవారు. ఈ వాదనలో వాస్తమున్నా లేకపోయినా వాదించడంలో ఒకప్పుడు ఎంతో కొంత నిజాయితీ వుండేది. ప్రజల అసంతృప్తినీ, తమ అంతర్గత కలహాలనూ ఎదుర్కోవడానికి పెద్ద ఎత్తున ప్రత్యక్ష హింసాకాండకు పాల్పడవలసిన అవసరం రాదని మనదేశ పాలకవర్గాలవారు ఒకనాడు భావించారు. ఆరోజులు పోయాయి.

అయినప్పటికీ పాలకవర్గాల ప్రచారకులు హింస, అహింసల చర్చను కొనసాగిస్తూనే వున్నారు. వాళ్ళ రాజకీయ భ్రష్టత్వం వల్ల ప్రాప్తించిన దివాళాకోరుతనం దీనికి మూలం. అయితే రామోజీరావు ఈ చర్చను ఎట్లాగయినా కాపాడదామని దానికి రెండు అదనపు వాదనలు చేర్చారు. ఈ సినిమాలో అహింసకూ, నిర్మాత చెప్పదలచుకున్న అన్ని విషయాలకూ ప్రతినిధి జ్యోతి అనే డాక్టర్. నక్సలైట్లకు, పోలీసులకు భిన్నంగా ఈమెలో చాలా మానవీయత వుంది. ఆకర్షణ వుంది. ప్రేక్షకులను సులభంగా ఆకట్టుకునే వ్యక్తిత్వం వుంది. జ్యోతి అహింసను నిర్ద్వందంగా సమర్థిస్తుంది. విధి నిర్వహణ పేరిట ప్రాణాలు తీయడాన్ని సహించలేక పోలీసు అధికారి అయిన భర్తను వదిలిపెడుతుంది. ఆదర్శాల పేరిట ప్రాణాలు తీయడాన్ని సహించలేక నక్సలైటు అయిన తమ్ముడితో విభేదిస్తుంది. నిర్మాత హింసాహింసల గురించి తాను చెప్పదలచుకున్న అన్ని వాదనలను జ్యోతి ద్వారా చెప్పిస్తాడు. హింస నైతికంగా తప్పనే సంప్రదాయక వాదనకు మరి రెండు వాదనలు జోడించాడు. ఒకటి - న్యాయాన్ని సాధించడానికి హింస అనవసరమనేది, రెండు - హింసవల్ల ప్రజల మీద అనవసరంగా నిర్బంధం వస్తుందనేది. ఇందులో మొదటి వాదన జ్యోతి చేసినప్పుడల్లా ప్రేక్షకులు నవ్వడం ఈ సినిమా చూసినవాళ్ళందరికీ ఎదురైన అనుభవం. జ్యోతి తరచుగా ప్రజాస్వామ్యాన్ని గురించి, హింసను గురించి నక్సలైట్లకు ఉపన్యాసాలిస్తుంది. హింసామార్గాన్ని వదిలిపెట్టి, ప్రజలను సమీకరించి, ఎన్నికల్లో నిలబడి అధికారాన్ని సాధించుకొమ్మని సవాలు చేస్తుంది. ఎన్నికల్లో గెలుస్తున్నది ప్రజాసమీకరణకంటే సారాయి, డబ్బు, గూండా బలగాల సమీకరణ ద్వారా అనేది అందరికీ తెలిసిన వాస్తవం. కాబట్టి ప్రేక్షకులకు నవ్వు రావడంలో ఆశ్చర్యం లేదు. నిజానికి ప్రేక్షకులలో అమాయకులెవరయినా వుండవచ్చును గాని నిర్మాతకు ఈ విషయం అందరికంటే బాగా తెలుసును. అయినా నమ్మించగలమేమో చూద్దామని తన ప్రయత్నం తాను చేశాడు. మనకు ఓపిక వుండాలే గాని ప్రజల సమస్యలను ప్రజాస్వామికంగా చట్టబద్ధంగా పరిష్కరించడం సాధ్యమేననీ, ఆ సహనం ప్రజాస్వామ్యానికి మనం చెల్లించే మూల్యమనీ, సహనంలేనివాళ్ళే తొందరగా పరిష్కారం దొరకాలని హింసకు పాల్పడతారని వాదిస్తాడు. ఈ వాదనకు నిదర్శనంగా ఒక వుదంతాన్ని సినిమాలో ప్రవేశ పెడతాడు. గిరిజన ప్రాంతంలో నివసించే ఒక భూస్వామి గిరిజనుల భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. వాళ్ళు ప్రతిఘటించేసరికి ఒక ఎత్తుగడ వేస్తాడు. పులుల అభయారణ్యం కోసం ఆ భూమికావాలని ప్రభుత్వం నుండి ఒక ఆర్డరు తీసుకొచ్చి గిరిజనులను తొలగించే ప్రయత్నం చేస్తాడు. జ్యోతి నాయకత్వంలో గిరిజనులు శాంతియుతంగా ధర్నా చేస్తారు. పోలీసులు వాళ్ళ మీద పడి విపరీతంగా కొడతారు. ఈ దశలో నక్సలైట్లు రంగ ప్రవేశం చేసి భయంకరమైన మారణాయుధాలతో పోలీసుల మీద దాడిచేసి తరిమేస్తారు. హింసాత్మకమైన ఈ జోక్యాన్ని జ్యోతి నిరసిస్తుంది. దానివల్ల గిరిజనుల మీద నిర్బంధం వస్తుందని వాదిస్తుంది. తాను చట్టబద్ధంగానే గిరిజనుల భూములను కాపాడతానని సవాలు చేస్తుంది. నక్సలైట్లు నవ్వుతారు. (ప్రేక్షకులు కూడా నవ్వుతారు)ఆమె మొదటి ప్రయత్నాలకు అవినీతి అవరోధం ఎదురవుతుంది. లంచాలు మేసిన మినిస్టర్లు, అధికారులు అడ్డుపడతారు. ఈ విధంగా ఒక వాస్తవికమైన సమస్యను నిర్మాత ప్రవేశ పెట్టాడు. దాని పరిష్కారాన్ని వాస్తవికంగా అన్వేషించి వుంటే 'నక్సలైటు సమస్య'కొంత మేరకయినా అర్థమై వుండేది. అయితే నిర్మాత సమస్యను చాలా అవాస్తవికంగా పరిష్కరిస్తాడు. జ్యోతి హైకోర్టులో రిట్ పిటిషన్ వేయగా హైకోర్టు దానికి స్పందించి ఆ ప్రాంతంలో పులులు సంచరించిన దాఖలాలేవీ లేవు కాబట్టి అభయారణ్యం కోసం ఆ గిరిజనుల మీద పెట్టిన కేసులను కూడా కొట్టి వేయాలని కోర్టుల ద్వారా న్యాయం సాధించటం అంత సులభమైతే రాజకీయ హింసా అహింసల చర్చ కేవలం సైద్ధాంతిక చర్చ అయివుండేది. ఒక రాజకీయ సమస్య అయివుండేది కాదు. శ్రామికప్రజలకు రాజ్యాధికారం శాంతియుతంగా రాదని కమ్యూనిస్టు విప్లవకారులు నమ్మవచ్చునేమో గాని శ్రామిక ప్రజానీకం విప్లవ హింసను అందుకోసం ఆమోదించరు. ప్రజలకు న్యాయం చేయవలసిన సంస్థలు ఏవీ సమర్థవంతంగా పనిచేయని పరిస్థితిలో సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యామ్నాయమార్గంగా ఆమోదిస్తారు.

రామోజీరావు పాలనా యంత్రాంగానికి చాలా సన్నిహితుడు. గిరిజనుల భూమి సమస్యను గురించి ప్రభుత్వం దగ్గర, కోర్టుల దగ్గర వందల పిటిషన్లు మగ్గుతున్నాయని వారికి తెలియంది కాదు. అందులో చాలా కొద్ది పిటిషన్లు మాత్రమే గిరిజనులకు అనుకూలంగా పరిష్కారమయ్యాయనేది ఆయనకి తెలియంది కాదు. నక్సలైట్లు జోక్యం చేసుకున్నచోటే గిరిజనులను వారి భూములనుండి తొలగించే ప్రయత్నాలు ఆగాయని, ఈ రకంగా గిరిజనులు రాష్ట్రంలో 'చట్టవ్యతిరేకంగా'అనుభవిస్తున్న అటవీభూమి ఐదులక్షల ఎకరాల దాకా ఉందనేదీ వారికి తెలియంది కాదు. పేదలను, పీడితులను శాంతియుతంగా చట్టబద్ధంగా సమీకరించే ప్రయత్నం చేసినవారు ఎన్ని అవాంతరాల్ని ఎదుర్కొంటారో, ఎంతగా నిస్పృహ చెందుతారో అందరికి తెలుసును. కోర్టులో పిటిషన్ వేస్తే సరిపోయేదానికి అనవసరంగా హింసకు పాల్పడుతున్నారని నిందించడం ప్రజల వివేచనను కించపరచడం తప్ప వేరే కాదు.

అదట్లాగుంచి ఇది ఎవరూ విశ్వసించగల వాదన కాదు. కాబట్టి నిర్మాత పైన చెప్పిన రెండవ వాదనను ప్రధాన వాదనగా ఉపయోగిస్తాడు. ఈ వాదనకంటే ఎక్కువ నిజాయితీ వుందని కాదు గాని యిది పూర్తిగా విశ్వసనీయతను యింకా కోల్పోలేదు. కాబట్టి నిర్మాత లక్ష్యానికి పనికొస్తుంది. ఇది ఒకరకంగా చాలా తెలివైన వాదన. అహింస అనే వాదనను వ్యవస్థకు అనుకూలంగా, విప్లవకారులకు వ్యతిరేకంగా ఉపయోగించే బదులు యిటు వ్యవస్థకూ అటు విప్లవకారులకూ వ్యతిరేకంగా 'ప్రజల'పక్షాన ఉపయోగిస్తాడు. "మీ హింసకూ, వారి హింసకూ మధ్యన మేము నలిగిపోతున్నాం"అని ప్రజలచేతే చెప్పిస్తాడు. ఈ వాదనను నిజానికి తెలుగు పత్రికారంగంలో రామోజీరావుగారి 'ఈనాడు'ఆవిష్కరించింది. మితిమీరిపోతున్న పోలీసు అత్యాచారాల గురించి ఇక మౌనంగా వుండడం సాధ్యం కాని దశలో నక్సలైట్లు రాజకీయాలకు ప్రోత్సాహం యివ్వకుండా పోలీసు అత్యాచారాలను ఎట్లా ఎండగట్టాలా అన్న సందిగ్ధానికి ఈ వాదన ఒక సులువైన పరిష్కారాన్ని చూపించింది. తెలుగు దినపత్రికల్లో ఇది తరచుగా దర్శనమిస్తూ వుంటుంది. నైతికంగా పతనమై రాక్షసంగా తయారైన పాలకవర్గంతోనూ, దయాదాక్షిణ్యాలు లేని కరడుగట్టిన నక్సలైట్లతోనూ ప్రజలు జరిపే ఎన్‌కౌంటర్ 'పీపుల్స్ ఎన్‌కౌంటర్'. ఈ రూపంలో మటుకే అహింస అనే వాదనకు ఇంకా ఏ మాత్రమైనా విశ్వసనీయత మిగిలి వుంది.

అయితే నక్సలైట్లు హింసను ఎందుకు ఉపయోగిస్తారు? పోలీసులు ప్రజలను ఎందుకు హింసాత్మకంగా అణచివేస్తారు? పాలకవర్గం 'నక్సలైటు సమస్య'గురించే చేసే ప్రచారంలో ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. విప్లవకారులు దీనికో సమాధానం చెపుతారు - పెత్తందార్ల సాయుధ రాజ్యాన్ని కూలదోసి శ్రామిక ప్రజల రాజకీయ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి హింస అనివార్యమనేది. వారి సమాధానం. అయితే పాలక వర్గాల ప్రచారం దీనిని ఎప్పుడూ చర్చించదు. ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలో తిరిగిన రామోజీరావుకు ఈ సమాధానం తెలియకపోలేదు. కాని ఆయన కూడా చర్చించడు. మరొక వైపు విప్లవహింస గురించి పోలీసుల అభిప్రాయం. నిర్మాతకు ఈ వాదనలు ఎంత నచ్చినా ప్రేక్షకుల విశ్వసనీయతను పొందవలసిన సినిమాకు అవి పనికి రావు. ఎందుకంటే ప్రజలకు విప్లవ హింసను గురించి తమ స్వంత అభిప్రాయం వుంది. ప్రజలలో ఎక్కువగా ప్రచారంలోవున్న అభిప్రాయమేమిటంటే ప్రజాస్వామ్యంలోని అన్ని సంస్థలూ ధనవంతులకు, బలవంతులకు వూడిగం చేస్తున్న స్థితిలో ప్రజలకు న్యాయం చేకూర్చేది విప్లవహింస ఒక్కటేనని. ఈ అభిప్రాయం యివ్వాళ మన సమాజంలో విస్తృతంగా ప్రచారంలో వుంది. పత్రికా సంపాదకులకు, యజమానులకు ఎంత నచ్చకపోయినా వారి గ్రామీణ విలేఖరులే దీనిని ప్రచారం చెయ్యడంలో ముఖ్యపాత్ర వహించారు. రామోజీరావు ఈ సినిమాలో ఈ అభిప్రాయానికే ప్రాధాన్యత యిస్తాడు. అయితే 'ప్రభుత్వ హింసకూ విప్లవకారుల హింసకూ మధ్యన నలిగిపోతున్న ప్రజలు'అనే మౌలికమైన అవగాహనలో అంతర్భాగంగానే ఈ వాదనను ప్రవేశపెడతాడు. అవినీతి పరులైన రాజకీయ నాయకులు, స్వార్థపరులైన అధికారులు మన ప్రజస్వామ్యాన్ని దిగజార్చారు. నక్సలైట్లు ఈ అవకాశం చూసుకుని సమస్యలను వేగంగా నిర్దయగా పరిష్కరించే మార్గం చూపించి ప్రజలను ఆకట్టుకుంటున్నారు. అయితే ఆ క్రమంలో వాళ్ళు దిగజార్చిన ప్రజాస్వామ్యాన్ని వీళ్లు పూర్తిగా ధ్వంసం చేసి అమాయకుల నెత్తుటితో తమ ఆధిపత్యానికి బాట వేసుకుంటున్నారు. ఇది ఈ సినిమా ప్రచారం చేసే అవగాహన. ఈ అవగాహనలో పోలీసు హింస నక్సలైట్ల వ్యూహానికి ఒక అనివార్యమైన ప్రతివ్యూహం అవుతుంది. ఏ వ్యవస్థయినా తన దౌర్బల్యాన్ని ఆసరా చేసుకుని తనను ధ్వంసం చేసే వారిని సహించలేదు కదా! అయితే పోలీసు హింసపట్ల ప్రజలకుండే తీవ్రమైన ద్వేషాన్ని రామోజీరావు విస్మరించలేడు, విస్మరిస్తే సినిమాకు విశ్వసనీయత వుండదు. అందువల్ల ఈ సినిమాలో పోలీసుల చిత్రీకరణ చాలా నీచంగా వుంది. ఎంత నీచంగా వుందంటే రాష్ట్ర పోలీసు అధికారులకు సెన్సార్‌ల మీద చాలా కోపం వచ్చిందట కూడా. అయితే రాజకీయ హింస మీద ఇటు ప్రజలనూ, అటు పోలీసులనూ కూడా ఆకట్టుకునేటట్టు సినిమా తీయడం యివ్వాళ సాధ్యం కాదు. అయినా పోలీసు యంత్రాంగంలోని పతనాన్ని ఈ రకంగా ఎంతగా చూపించినా మొత్తం రాజకీయ వ్యవస్థలో ఆ యంత్రాంగంలోని పతనాన్ని ఈ రకంగా ఎంతగా చూపించినా మొత్తం రాజకీయ వ్యవస్థలో ఆ యంత్రాంగం నిర్వహిస్తున్న పాత్రను గురించి ప్రేక్షకులలో కలిగించే అభిప్రాయానికి ఏమీ తేడా రాదు.

విప్లవహింసను కేవలం ప్రజల తక్షణ సమస్యల పరిష్కారానికి ఒక సమర్థవంతమైన సాధనంగా మాత్రమే అర్థం చేసుకున్నా చర్చ యిక్కడితో ఆగిపోవడానికి వీలులేదు. ఇటు విప్లవహింస, అటు పోలీసుహింస అంటే సరిపోదు. వ్యవస్థాగతమైన మూడో హింస ఒకటుంది. దీనిని గురించి మాట్లాడడం రామోజీరావు వాదనకు చాలా ప్రమాదకరం. అందుకే దానినొక అంశంగా ఆయన ఒప్పుకోడు. ప్రజలకు అనేక సమస్యలు వున్నాయని, అవినీతికి అక్రమ మార్గాలకు అలవాటు పడిన అధికార యంత్రాంగం, రాజకీయనాయకులు, వీటిని పరిష్కరించలేకపోతున్నారని - యింతమాత్రమే ఒప్పుకుంటాడు. ఆకలి,

పేదరికం, అసమానత, అణచివేత యిదంతా కూడా హింసేనని, ఈ హింస సామాజిక వ్యవస్థలో అంతర్గతమైందని ఆయన ఒప్పుకోడు. ఒప్పుకుంటే విప్లవహింస గురించి జరిగేచర్చ స్వరూపం మారిపోతుంది. ఈ వ్యవస్థ స్వర్గతుల్యం కాకపోవచ్చు గాని మౌలికంగా మంచిదేనని, జీవనయోగ్యమేనని, అయితే ఈ మధ్య కాలంలో అవినీతి, అణచివేత దురదృష్టవశాత్తూ పెరిగిపోతున్నాయని మాత్రమే ఒప్పుకుంటాడు. బుట్టలో కొన్ని పళ్ళు మాత్రమే కుళ్ళిపోయయని ఒప్పుకుంటాడు. ఈ సినిమాలో వ్యవస్థకు ప్రతినిధులుగా ఒక క్రూరుడైన భూస్వామిని, అతనికి గులాములైన అటవీశాఖ అధికారులను చూపిస్తాడు. ఆ భూస్వామి ఒక స్త్రీని లోబర్చుకుని తనకు గులాములైన ప్రభుత్వాధికారులను చూపిస్తాడు. ఆ భూస్వామి ఒక స్త్రీని లోబర్చుకుని తనకు గులాములైన ప్రభ్యాధికారులను సంతృప్తి పరచమని బలవంతం చేస్తాడు. (ఆమె చివరికి ఒక ప్రజాకోర్టులో అతని మీద ఫిర్యాదు చేసి నక్సలైట్ల చేత అతనిని చంపిస్తుంది) ఈ కుళ్ళును దాచిపెట్టడానికి నిర్మాత ఎంతమాత్రం ప్రయత్నం చేయడు. అయితే ఈ నిర్మొహమాటం వెనక అంతకంటే బలమైన సంకల్పం అది. ఈ రకమైన బూటకపు నిర్మొహమాటం ఈ మధ్యకాలంలో పాలకవర్గం తరచూ ప్రదర్శిస్తూ వుంది. ఇంతకు మించి కొంచెం కూడా ఒప్పుకోవడానికి సిద్ధపడరు. వ్యవస్థే అన్యాయంగా, అసమంగా వుందని మనం వాదించే ప్రయత్నం చేస్తే - పోలెండ్ గురించి, రుమేనియా గురించి, తియాన్‌న్మెన్ స్క్వేర్ గురించి ఆవేశంగా వాదనకు దిగుతారు.

వ్యవస్థలో కొంతమాత్రమే కుళ్ళు వుందని, దానిని పరిష్కరించడానికి ఈ వ్యవస్థ ఆమోదించిన సాధనాలే సరిపోతాయని వాదిస్తే విప్లవహింసకు పునాది పోతుంది. చారిత్రక ఆవశ్యకత పోతుంది. కొంత మంది వ్యక్తులు కేవలం స్వయం సంకల్పంతో ఎంచుకున్న రాజకీయ మార్గమవుతుంది. ఆ ఎంపికకు వాళ్ళ సంకల్పమే తప్ప వేరే భూమిక వుండదు. విప్లవానికి ఈ విధంగా భౌతిక ఆవశ్యకతను తొలగిస్తే విప్లవకారులమీద, వారి వెనకవున్న ప్రజలమీద వ్యవస్థ ప్రయోగించే అణచివేత న్యాయమైన ప్రతిహింస అవుతుంది. సమర్థనీయమైన ఆత్మరక్షణ అవుతుంది. దాని వల్ల ప్రజలకు హాని జరుగుతుందంటారా అది గర్హనీయమే. కాని దానికి బాధ్యులెవరో ఈ వాదనలో స్పష్టమే. హింసను మొదలుపెట్టింది విప్లవకారులే అని చెప్పడం కోసమే వ్యవస్థీకృతహింసను గురించి మాట్లాడినప్పుడల్లా తూర్పుయూరప్ గురించి ఆవేశంగా వాదనకు దిగుతారు.

విప్లవాన్ని కేవలం సంకల్పమాత్రమైన చర్యగా మార్చేస్తే, చారిత్రక ఆవశ్యకతకు అతీతమైన నిర్ణయంగా మార్చేస్తే అది క్రూరంగాను రొమాంటిక్‌గాను కనిపిస్తుంది. ఈ సినిమాలో విప్లవాన్ని చూపించిన పద్ధతిలో రొమాంటిసిజం, క్రూరత్వం ప్రధాన అంశాలు. నక్సలైట్లలో అత్యధిక శాతం గ్రామాలలో, గనులలో, బస్తీలలో, ఫ్యాక్టరీలలో, కాలేజీలలో ప్రజల మధ్య రహస్యంగానో, బహిరంగంగానో పనిచేసే సాధారణ మానవులు. కాని ఈ సినిమాలో నక్సలైట్లు అటువంటి సాధారణ మానవులు కారు. వీళ్ళు శాశ్వతంగా ప్రజలకు దూరంగా కొండకు అవతలివైపున నివసిస్తుంటారు. గిరిజనులకు వాళ్ళ అవసరం ఏర్పడినప్పుడు వాళ్ళకు ఏదో మహత్తు ద్వారా తెలిసిపోతుంది. ఆకుపచ్చ యూనిఫారాలు వేసుకుని ఆటోమాటిక్ తుపాకులు పట్టుకుని కొండమీద నుండి నాట్యం చేసుకుంటూ దిగివస్తారు. గురికూడా చూడకుండా తుపాకులు పేలుస్తారు. కావలసినంత మందిని చంపిన తర్వాత కొండ ఆవలివైపుకు వెళ్ళిపోతారు. అప్పుడప్పుడు డాక్టర్ జ్యోతియిచ్చే సుదీర్ఘమైన ఉపన్యాసాలకు సమాధానంగా క్లుప్తంగా, తిరస్కారంగా రెండు మాటలు మాట్లాడతారు. జ్యోతిలోని మానవీయతకు, పోలీసుల నైతిక పతనానికి భిన్నంగా నక్సలైట్లది అమానవీయమైన కరుడుగట్టిన ఆత్మవిశ్వాసం. ఉదాహరణగా ఒక ఉదంతాన్ని చెప్పుకోవచ్చు. పోలీసులు ఒక నక్సలైటును బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపుతారు. శవాన్ని దహనం లేదా ఖననం చేసే బదులు అక్కడే ఉంచాలనీ, శవం కోసం ఇతర నక్సలైట్లు వస్తే పట్టుకోవాలని అనుకుంటారు. శవాన్ని ఒక చెట్టుమీద పెట్టి, దాని చుట్టూ పోలీసులు కాపలా కాస్తారు. నిజ జీవితంలో ఇటువంటి పరిస్థితిలో ఏ విప్లకారులైన శవాన్నిచేజిక్కించుకునే ఆశ వదులుకునే వెళ్ళిపోతారు. కాని ఈ సినిమా నక్సలైట్లు అట్లా కాదు. చెట్టుకొమ్మ నుంచి చెట్టుకొమ్మకు రోప్‌వే కట్టి నడుముకు తాడుకట్టుకుని మీదినుండి దిగి శవాన్ని పోలీసుల తలలమీద నుంచి తన్నుకుపోతారు. రామోజీరావు యిదంతా సాధ్యమని నమ్మేంత అమాయకుడా అనేది ప్రశ్న కాదు. పాలకవర్గ చైతన్యం సమృద్ధిగా వున్న వ్యక్తి తీసిన సినిమాలో నక్సలైట్లను ఈ రకంగా చూపించడంలో అంతర్యం ఏమిటన్నది ప్రశ్న. అమానవీయమైన సామర్థ్యంచ, కరుడుగట్టిన క్రూరత్వం మొదలైన లక్షణాల కలయికగా నక్సలిజాన్ని చిత్రీకరించడం ద్వారా యిచ్చే సందేశం ఏమిటన్నది ప్రశ్న.

భౌతిక పునాది,చారిత్రక ఆవశ్యకత లేని విప్లవంలో ఒక చర్యకూ ఒక చర్యకూ సంబంధం వుండదు. మొత్తానికి అర్థం వుండదు. తెలుగు దినపత్రికలు విప్లవ రాజకీయాలను ఈ రకంగానే చిత్రీకరిస్తున్నాయి. పరస్పర సంబంధంలేని, అర్థరహితమైన రొమాంటిక్ చర్యలుగా, నిష్కారణమైన హింసాకాండగా వర్ణిస్తున్నాయి. ఈ చిత్రం వాస్తవాలను వక్రీకరిస్తోందని విప్లవకారులు ఆరోపించినపుడు తాము చూపించిందంతా వాస్తవమని గత రెండేళ్ళుగా పత్రికలు చదువుతున్నవారందరికీ తెలుసునని రామోజీరావు సమాధానం చెప్పాడు. అది నిజమే. 'ఈనాడు'తో మొదలుపెట్టి తెలుగు దినపత్రికలన్నీ అలవాటు చేసుకున్న చిత్రీకరణను ఈ సినిమాలో ఆయన కొనసాగించాడు. గమ్యంలేని విడి విడి చర్యల కలయికగా విప్లవాన్ని చిత్రీకరించాడు. ఒక్కొక్కచోట యిది ఎంత దూరం పోతుందంటే కథనం వదిలిపెట్టి బస్సులు తగలబెట్టిన దృశ్యాలు, ఇళ్ళు పేల్చివేసిన దృశ్యాలు, ఇన్ఫార్మర్లను కాల్చివేసిన దృశ్యాలు కేవలం ఫోటోలుగా ఒకదాని తర్వాత ఒకటి చూపిస్తాడు. నక్సలిజం అంటే అర్థంలేని హింసాకాండ అనే సందేశాన్ని ఈ రకమైన చిత్రీకరణ బలంగా అందిస్తుంది. దీనిని ఎదుర్కోవడానికి పోలీసులు రంగప్రవేశం చేయకతప్పదని ప్రేక్షకులకు ఒకరు చెప్పకుండానే అనిపిస్తుంది.

పోలీసులలో కొందరు(బహుశా అత్యధికులు) అవినీతిపరులు, క్రూరులు కావొచ్చు. అయినప్పటికీ మన సమాజాన్ని డైనమెట్లతో పేల్చివేస్తున్న ఈ గమ్యంలేని హింసాకాండకు లొంగడానికి వీల్లేదు. (ప్రేక్షకుల సంకల్పం లేకుండానే ఈ సమాజం 'మన'సమాజంగా కనబడటం మొదలవుతుంది) పోలీసు వ్యవస్థను రామోజీరావు చాలా లజ్జాకరంగా చిత్రీకరించాడని పోలీసులకు కోపం వచ్చింది కానీ, పోలీసు వ్యవస్థను ఆయన చూపించింది అన్యాయమైన సమాజాన్ని నిలబెట్టే సాయుధ యంత్రాంగంగా కాదు, మన "సమాజాన్ని దుండగుల నుండి కాపాడలేని అసమర్థ యంత్రాంగంగా. రాజకీయ నాయకుల విషయం కూడా అంతే. ఈ రకమైన రాజకీయ నాయకుల చేతుల్లో మన భవిష్యత్తును పెట్టగలమా అన్న ఆందోళన కలుగుతుందే తప్ప వీళ్ళు సామాజిక అన్యాయానికి, అణచివేతకు రాజకీయప్రతినిధులన్న ఆగ్రహం కలగదు.

ఈ రకమైన చిత్రీకరణ సాధ్యం కావాలంటే కొన్ని వాస్తవాలు చెప్పకుండా వుండడం అవసరం. చాలా ఆవేదనతో "నక్సలైట్ సమస్య"ని చిత్రీకరించాలని చెప్పుకుంటూవున్న రామోజీరావు తెలిసీ కొన్ని వాస్తవాలను చెప్పలేదు. ఒక ముఖ్యమైన ఉదాహరణ చెప్పాలంటే విప్లవోద్యమాన్ని ఎదుర్కోవడానికి రాజ్యాంగ యంత్రాంగం చాలా పకడ్బంధీగా, పటిష్టంగా అన్ని రంగాల్లోనూ హింసాకాండను ప్రయోగించిందన్న వాస్తవాన్ని ఈ సినిమాలో ఎక్కడా చెప్పడు. ఇంద్రవెల్లి సీను దీనికొక నిదర్శనం. ఆదిలాబాద్ గిరిజనులలో విస్తరిస్తూవున్న విప్లవోద్యమ నిర్మాణాన్ని మొగ్గలోనే తుంచివేయడం కోసం ఉద్దేశపూర్వకంగా ప్రయోగించిన ఆ హింసాకాండను కాకతాళీయమైన కాల్పుల సంఘటనగా చూపిస్తాడు. తనపై అత్యాచారం చేసిన పోలీసు అధికారిని ఒక గిరిజన స్త్రీ చంపి వేయగా తదుపరి చెలరేగిన కల్లోలాన్ని అణచడం కోసం పోలీసులు జరిపిన కాల్పులుగా చూపిస్తాడు. పోలీసుయంత్రాంగంలో అవినీతిపరులు, అసమర్థులు, పిరికివాళ్ళు చాలా మంది వున్నారు. కానీ అది ఈ సినిమాలో చూపించినంత పనికి మాలిన యంత్రాంగం ఏమీకాదు. సాధారణ పోలీసు యంత్రాంగంలోనూ, ఊరు పేరు లేని తెల్లబట్టల గూండాలైన స్పెషల్ పోలీసులలోనూ సమర్థవంతంగా దమనకాండను అమలుచేసే నైపుణ్యం పుష్కలంగా వుంది. ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌కి ఇంటలిజెన్స్ తక్కువేమీలేదు. అయినా పోలీసులు "నక్సలైట్ సమస్య"ను పరిష్కరించలేక పోయారంటే అది వాళ్ళ చేతకాని తనం కాదు. ప్రపంచంలోని ఏ రాజకీయ సమస్యను ఎక్కడా పోలీసులు పరిష్కరించలేదు. ఎంతో కొంత క్రూరంగా, ఎంతో కొంత సమర్థంగా, ఎంతోకొంత తాత్కాలికంగా అణచడం మట్టుకే వాళ్ళకు సాధ్యమవుతుంది. అందులో ఆంధ్రరాష్ట్ర పోలీసులు వేరే ఎవరికి తీసిపోలేదు. రాజకీయనాయకులైనా అంతే. వాళ్ళు ఈ సమస్యను ఇప్పటిదాకా పరిష్కరించలేకపోయారంటే సామర్థ్యం లేక కాదు, సంకల్పం లేక కాదు, అది అసాధ్యం కావడం దానికి కారణం.

అయితే ఇదంతా చేస్తే రాజ్యాంగయంత్రమనేది ఒక అణచివేత యంత్రాంగమని చెప్పాల్సివుంటుంది. సామాజికవ్యవస్థ అణచివేత మీద, హింస మీద ఆధారపడిందని, రాజ్యాంగయంత్రం దాన్ని కాపాడే కవచం అని ఒప్పుకోవాల్సివుంటుంది. అప్పుడు నక్సలైట్ల నిరసన చర్యలను ఒక లక్ష్యం, కారణంలేని హింసా కాండగా చిత్రించడం సాధ్యపడదు. నక్సలైటు ఉద్యమం ప్రారంభమైన తర్వాత 2 దశాబ్దాలపాటు పోలీసుల అణచివేత ఎదురులేకుండా సాగిందని, దానిగురించి పత్రికలు ఏనాడూ రాయలేదని, "ప్రజాభిప్రాయం" పట్టించుకోలేదని, కోర్టులు, వాటి హెబియస్ కార్పస్ అధికారం అడ్డురాలేదని, ప్రజాస్వామికంగా ఎంత నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోలేదని అప్పుడు చెప్పాల్సి వుంటుంది. కిడ్నాప్‌లు, దహనం, పేల్చివేత మొదలైన చర్యలు ఎంత అభ్యంతర కరంగా అనిపించిన వాటి ద్వారా పాలకవర్గాల ప్రశాంతాన్ని తాత్కాలికంగానైనా భగ్నం చేయకపోతే రామోజీరావు వంటి వారు రెండు దశాబ్దాల మౌనాన్ని విడనాడి "నక్సలైట్ సమస్య"గురించి తమ పత్రికలలో సినిమాలలో చర్చించేవారే కాదని ఒప్పుకోవాల్సి వుంటుంది. మరొక అడుగు ముందుకు పోయి రామోజీరావు సినిమాగానీ, పాలకవర్గం ప్రచారంగానీ ఎంత మాత్రం ఒప్పుకోని మరికొన్ని విషయాలను అంగీకరించవలసి వుంటుంది. విప్లవాల చారిత్రక ఆవశ్యకత వంటి పెద్దవిషయాలను పక్కకు పెట్టిన, రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ఇవ్వాళ పేదలు, పీడితులు విప్లవోద్యమం ఫలితంగానే గౌరవంగా తలెత్తుకుని తిరుగుతున్నారని, శ్రీకాకుళంలో మొదలైన "నక్సలైట్ సమస్య"రెండు దశాబ్దాల పాశవిక అణచివేత తర్వాత హైదరాబాద్ నగరంతో సహా 23 జిల్లాలకు పాకి పోయిందని, నక్సలైట్లే లేకపోతే సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలుగాని, గిరిజన సహకార సంఘాలుగాని, మారుమూల ప్రాంత అభివృద్ధి పథకాలుగానీ ఉండేవి కావని, విప్లవోద్యమం ఇచ్చిన చైతన్యం వల్లనే ఎక్కడ అన్యాయం జరిగినా ఆందోళన చేసే సంస్కృతి పుట్టిందని, ప్రభుత్వ అధికారుల, రాజకీయనాయకుల అవినీతిని పక్షపాతాన్ని అసమర్థతను నిర్భయంగా నిరసించే సంస్కృతి పుట్టిందని, దేశాన్ని ఏలుతున్న దొరలంతా తాము ప్రజలకు జవాబుదారులమని ఒప్పుకునే అగత్యం ఏర్పడిందని - ఇదంతా చెప్పవలసి వుంటుంది.

సమస్యలో ఇంత ప్రధానమైన అంశాన్ని దాచిపెట్టే చిత్రీకరణ దానికి విశ్వసనీయమైన పరిష్కారాన్ని చూపించలేదు. నక్సలైట్లు తమ హింసాత్మక నిరసన మార్గాన్ని వదిలిపెట్టాలని, ప్రభుత్వం తన హింసాత్మక అణచివేత మార్గాన్ని వదిలిపెట్టాలని ఇద్దరి మీద డిమాండ్‌పెడుతూ "ప్రజల"తరపున నిరసన దీక్షకు కూర్చుంటుంది. ఈ "పీపుల్స్ ఎన్‌కౌంటర్"ఇరు పక్షాలలో ఎవరు సమస్యకు న్యాయం చేయదు కాబట్టి ఆమె దీక్ష ఫలించడం సాధ్యం కాదు. అది అసాధ్యమని గుర్తించి కృత్రిమ పరిష్కారం చూపించనందుకు రామోజీరావును అభినందించవచ్చును. చనిపోతూ జ్యోతి చూపిన చేతిని ఇరుపక్షాలలో ఎవ్వరూ అందుకోరు. పోలీసు అధికారి గిరిజన స్త్రీలపై అత్యాచారం చేయగా జన్మించిన పాప మాత్రమే ఆమె చేతిని అందుకుంటుంది. ఇందులో ఏదో సందేశం ఉండే వుండాలి. అయితే ఈ సందేశం ఎంత వాస్తవికమైందో భవిష్యత్తులోనే తేలగలదు. కాబట్టి అక్కడితో వదిలేద్దాం.

(ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ నుండి)

అరుణతార (మాసపత్రిక)అక్టోబర్ - నవంబర్ 1991

# బాలగోపాల్ స్ఫూర్తితో అణిచివేతను వ్యతిరేకిద్దాం! హక్కులను కాపాడుకుందాం!

ఎస్.శేషయ్య

హక్కుల ఉద్యమానికి పరిధి, పరిమితులు ఉన్నాయి. సమాజంలో ఉత్పన్నమయ్యే సామాజిక, ఆర్థిక సమస్యలను హక్కుల ఉద్యమం పరిష్కరించే శక్తిలేదు. ప్రత్యేకించి సమాజంలో మౌలికమైన మార్పును తీసుక రావడం హక్కుల ఉద్యమానికి అసాధ్యమైన పని. రాజకీయ ఉద్యమాలే ప్రజల సమస్యలను పరిష్కరించగల్గుతాయి. సామాజిక మార్పుకు దోహదం చేస్తాయి. హక్కుల ఉద్యమం కేవలం ప్రజాస్వామిక ఉద్యమాలు లేదా సమూహాలు ముందుకు తెచ్చే సమస్యలు, ఆకాంక్షలు న్యాయమైనప్పుడు వాటిని సమర్థించడం, ప్రజల్లో ప్రచారం చేసి వాటికి మద్ధతు కూడగట్టడం, హక్కులకోణం నుండి ప్రజల్లో చైతన్యం తీసుకరావడం కర్తవ్యంగా ఉంటుంది. ప్రజా ఉద్యమాలకు విలువలను నేర్పించడం హక్కుల ఉద్యమానికి మించిన పరిధి అవుతుంది.

బాలగోపాల్ ఆకస్మిక మరణం హక్కుల ఉద్యమ కార్యకర్తలను, అభిమానులను, ప్రజాస్వామిక వాదులను విషాదంలోకి నెట్టివేసింది. బాలగోపాల్ 'ఇకలేడు'అనే నిస్పృహతోపాటు, 'పౌరసమాజం'ఒక రకమైన భయానికి, వెలితికి లోనయ్యిందని కొంతమంది అభిప్రాయపడ్డారు. కానీ, ఈ పరిస్థితి తాత్కాలికమే. పురుషోత్తం, ఆజం అలీలను సర్కారీ హంతకముఠాలు కిరాతకంగా హత్య చేసి ఒక భయానక వాతావరణం సృష్టించారు. పౌరహక్కుల సంఘం ఇక పనిచేస్తుందా? అనే సంశయం, సందేహాలు ఏర్పడ్డాయి. బాలగోపాల్ ఆ సందర్భంలో 'నిరాశా, నిస్పృహలకు చోటివ్వొద్దు'అని సందేశం యిచ్చాడు. 'నిస్పృహను, నిస్సహాయతను అధిగమించడానికి కావల్సిన ధృఢసంకల్పం, మానసిక స్థైర్యాన్ని పురుషోత్తం నుండి ఉద్యమాలు, ఉద్యమకారులు, ప్రజలు నేర్చుకోగల్గితే అతని మరణం వృధా కానట్టే' అని హక్కుల కార్యకర్తలకు ధైర్యాన్ని యిచ్చాడు. మానవ హక్కుల వేదిక మూడవ రాష్ట్ర మహాసభల సందర్భంగా అనంతపురంలో బహిరంగసభలో 'భయం నుండి బయటపడాలనీ, నిర్భయంగా ప్రశ్నించాలనీ, రాజకీయ, సామాజిక జీవితంలో విలువలను పెంపొందించడానికి కృషి చేయాలి' అని చివరిసారిగా పిలుపునిచ్చాడు. విలువలకు గుర్తింపు, గౌరవం లేని మన సమాజంలో మానవహక్కులకోసం కృషి చేయడం కష్టం అని గ్రహించాడు. అనమాన, ఆధిపత్య, దోపిడీపై ఆధారపడి కొనసాగుతున్న సామాజిక సంబంధాలు ఉన్న మన వ్యవస్థలో హక్కుల ఉద్యమం చాలా అవసరం. ఒకవైపు రాజ్యాంగ యంత్రాన్ని, మరోవైపు ఆధిపత్య వ్యవస్థలను ఎదుర్కొంటూనే హక్కుల ఉద్యమం ముందుకు పోవాలి. బాలగోపాల్ తన జీవితకాలం వీటికి వ్యతిరేకంగా పోరాడాడు. ఆయన ధృఢ సంకల్పం, మానసిక స్థైర్యం నిర్ణయం హక్కుల ఉద్యమ కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చాయి. అందుకే ఆయన మనకు ఆదర్శనీయం.

బాలగోపాల్ తన 57 సంవత్సరాల జీవితకాలంలో 28 సంవత్సరాలు హక్కుల ఉద్యమానికి అంకితమయ్యాడు. పౌరహక్కుల సంఘానికి 15 సంవత్సరాలు కార్యదర్శిగా ఉండి దేశవ్యాపితంగా సంస్థకు గుర్తింపును, గౌరవాన్ని, విశ్వసనీయతను సాధించాడు. బాలగోపాల్ వ్యక్తిత్వం హక్కుల ఉద్యమం వ్యక్తీకరణకు విడిగా లేదు. హక్కుల ఉద్యమంలో ఆయన నిర్వహించిన క్రియాశీలక పాత్ర, వందలమంది కార్యకర్తల కృషి ఫలితంగానే యివ్వాళ హక్కుల ఉద్యమాన్ని ప్రజలు అభిమానిస్తున్నారు. సహకరిస్తున్నారు. బాలగోపాల్ మరణం తర్వాత హక్కుల ఉద్యమంపై వచ్చిన వాఖ్యానాలు, ఆయన ఆలోచనలు, ఆచరణ హక్కుల ఉద్యమానికి ఆయన కృషికి సంబంధించిన అంచనాలు హక్కుల కార్యకర్తలను కొంత గందరగోళానికి, గురిచేసాయి. మన రాష్ట్రంలో హక్కుల ఉద్యమ చరిత్ర, నేపథ్యం మరుగున పడిపోయింది. హక్కుల ఉద్యమాన్ని నిలబెట్టడంలో, ముందుకు నడిపించడంలో పౌరహక్కుల సంఘానికి (ఎపిసిఎల్‌సి)ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ పంస్థ (ఓపిడిఆర్)కి ఎలాంటి పాత్ర లేదా? ప్రధానంగా మానవహక్కుల ఉద్యమం విశాలమైందనీ, పౌర ప్రజాస్వామిక హక్కుల ఉద్యమం పరిమితమైందనీ, లేదా సంకుచితమైందనే విధంగా ప్రచారం జరిగింది. మానవహక్కుల వేదిక నక్సలైటు ఉద్యమాన్ని, వారి హింసను ఖండిస్తుందనీ, పౌరహక్కుల సంఘం సమర్థిస్తుందనీ, మానవహక్కుల వేదిక రాజకీయాలకు అతీతం అనీ, ఇతర సంస్థలు రాజకీయ పార్టీలకు అనుబంధం అనే భావన ఏర్పడేటట్టు ప్రచారం గతంలో జరిగింది. ఇప్పుడూ జరుగుతూ ఉంది. బాలగోపాల్ బ్రతికుంటే పై అభిప్రాయాలను సమర్థించేవాడు కాదు. హక్కుల ఉద్యమంలో బాలగోపాల్ ప్రతిపాదించిన దృక్పథం పట్ల పౌరహక్కుల సంఘంలో చర్చ జరిగింది. కొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయం కారణంగా, సంస్థనుండి విడిపోయి మానవహక్కుల వేదిక ఏర్పాటు చేసాడు.

### హక్కుల్లో విభజన, హెచ్చుతగ్గులు లేవు

పౌరహక్కులు, ప్రజాస్వామిక హక్కులు, మానవ హక్కులను వేరు వేరుగా భావించడం, వర్గీకరించడం వాటి మధ్య హెచ్చుతగ్గులు చూడటం, సరైందేనా? కాదని బాలగోపాల్ వివరించాడు. 'ప్రతి సమస్యకు ఒక హక్కుల కోణం ఉంటుంది'అని బాలగోపాల్ అభిప్రాయం. ప్రస్తుతం చట్టాల్లో, రాజ్యాంగంలో గుర్తించబడిన హక్కులన్నీ కూడా చరిత్రలో ప్రజల అవసరాలుగా, డిమాండ్లుగా ముందుకు వచ్చినవే. ప్రతి హక్కుకు ఒక చరిత్ర ఉంది. వివిధ చారిత్రక అభివృద్ధి దశలో అనేక రాజకీయ, సామాజిక ఉద్యమాల నుండి, ప్రజల త్యాగాల ఫలితంగానే హక్కులు ఉనికిలోకి వచ్చాయి. ప్రజల సామాజిక చైతన్యంలో, నాగరికతలో భాగమయ్యాయి. చట్టాల

రూపంలో వ్యవస్థీకృతం అయ్యాయి. కానీ, అసమాన, ఆధిపత్య, దోపిడీ సామాజిక వ్యవస్థలో నిత్యం హక్కుల నిరాకరణ, అతిక్రమణ జరుగుతూ ఉంది. ప్రజలు సాధించుకున్న హక్కుల అమలు కోసం, అనుభవించటం కోసం పోరాడుతూనే, కొత్తహక్కులకోసం ఆందోళన చేస్తూ ఉన్నారు. వీరికి సహకరించటం హక్కుల ఉద్యమ ప్రధాన కర్తవ్యం అని బాలగోపాల్ మొదటి నుండి అభిప్రాయపడ్డాడు. పౌరహక్కుల సంఘం 1993 డిసెంబరులో సవరించిన తన లక్ష్య ప్రకటనలో హక్కుల ఉనికి గల చారిత్రక నేపథ్యం గురించి, హక్కుల అవసరం, ప్రయోజనం గురించి చాలా స్పష్టంగా వివరించింది. హక్కులు జీవించడానికి అవసరం. జీవితాన్ని మెరుగుపరుచుకోవడానికి అవసరం. హక్కులు వాటంతటకవే విలువైనవే కాక, అణిచివేతను ప్రతిఘటించడానికి, జీవితాన్ని మెరుగుపరుచుకోవడానికి, సాధనాలు కూడా''అని పేర్కొంది. ఈ అవగాహనపట్ల రాష్ట్రంలో పనిచేస్తున్న మూడు సంస్థలకు ఏకభావం ఉంది. గతంలో పౌరహక్కులు, ప్రజాస్వామిక హక్కులు, మధ్య తేడాల గురించి, పరిమితులు, పరిధి గురించి గతంలో దేశంలోని హక్కుల సంస్థల మధ్య చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. పౌరహక్కులంటే వ్యక్తిగతమైనవనీ, పౌరులకు మాత్రమే చెందినవనీ, రాజ్యానికి వ్యతిరేకమనీ, రాజ్యాంగ యంత్రాన్ని దాని అధికారాన్ని నియంత్రించే సాధనాలనీ కేవలం చట్టంలో, రాజ్యాంగంలో గుర్తించబడినవనీ, ఈ హక్కుల ఉల్లంఘన జరిగితే బాధితులు కోర్టుల ద్వారా అమలు చేసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

ప్రజాస్వామిక హక్కులు అంటే ప్రధానంగా ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక జీవితానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవడానికి గల హక్కులే ప్రజాస్వామిక హక్కులు. అంతే కాకుండా, ప్రజాస్వామిక హక్కులు సామూహికంగా వ్యక్తీకరించబడతాయనీ, ప్రజాస్వామిక ఉద్యమాల ఆకాంక్షలుగా ముందుకు వస్తాయి. ప్రజాస్వామిక హక్కులకు ఏ నిర్వచనం చెప్పుకున్నా మనిషి మనిషిగా తలెత్తుకొని బ్రతకడమే పరమార్థం. దోపిడీని ప్రతిఘటించే హక్కు ప్రతిమనిషికి ఉంది. అది మౌళిక ప్రజాస్వామిక హక్కు. అందుకే సమస్యల పరిష్కారం కోసం, తమ జీవితాలను మెరుగుపరుచుకోవడం కోసం పోరాడే హక్కు లేదా ఉద్యమించే హక్కును మౌళికమైన ప్రజాస్వామిక హక్కుగా పౌరహక్కుల సంఘం గుర్తించింది. వ్యక్తిగత జీవితంలోకి, హక్కుల్లోకి రాజ్యం జోక్యం చేసుకోకూడదని పౌరహక్కుల భావన అయితే, ప్రజల జీవితాలను బాగుచేయడానికి, వారి సంక్షేమం కోసం రాజ్యం జోక్యం చేసుకోవాలని ప్రజాస్వామిక హక్కుల ఉద్యమం డిమాండు చేస్తుంది. పౌరహక్కులు వ్యక్తిగతం కాగా, ప్రజాస్వామిక హక్కులు సామూహికంగా వ్యక్తీకరించబడతాయి. ప్రజాస్వామిక హక్కులను చట్టం గుర్తించకపోవచ్చు. కానీ, ప్రజల చైతన్యంలో ఉంటాయి. కోర్టుల ద్వారా అమలు చేసుకొనే అవకాశం లేకపోవచ్చు. పోరాటాల ద్వారా సాధించుకోవాల్సిందే.

పౌరహక్కులు, ప్రజాస్వామిక హక్కులు అనే వర్గీకరణ ఒకటి మనదేశంలోని పౌరహక్కుల ఉద్యమంలో తరచుగా చర్చకు వస్తూ ఉంది. హక్కుల్లో హెచ్చు తగ్గులు నిర్ణయించడం కోసం దీనిని వాడుకోవడం జరుగుతూ ఉంది. ఈ వైఖరిని బాలగోపాల్ వ్యతిరేకించాడు. ఆయన మాటల్లోనే "నిజానికి మనుషులందరికీ రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో అన్ని రకాల సమానత్వం (హోదాలో, స్థితిగతుల్లో, అవకాశాల్లో)ఉండాలనేది హక్కులకు ప్రామాణికం. ఈ దిశగా యిప్పటికే సాధించుకున్న హక్కులు ఇంకా సాధించుకోవాల్సిన హక్కులు అనేదే ఉపయోగకరమైన వర్గీకరణ, వేరే ఏ వర్గీకరణ అయినా విశ్లేషణ సౌలభ్యం కోసం చేసుకునేదే. అంతే తప్ప హక్కులలో హెచ్చు తగ్గులు చూపించి ఒక దాని పేరు మీద మరొకదాని నిరాకరణను, సమర్థించడాన్ని వ్యతిరేకించాలి"అని స్పష్టం చేసాడు.

హక్కుల మధ్య వర్గీకరణకు, హెచ్చుతగ్గులకు పెట్టుబడిదారీ దేశాలకు, సోషలిస్టు దేశాల మధ్య హక్కుల ప్రాధాన్యత ప్రజాస్వామ్యంపై జరిగిన చర్చ వాటి రాజకీయ దృక్పథాలు కారణం. బాలగోపాల్ ఈ చర్చల ప్రభావం గురించి చర్చిస్తూ "దాదాపు అర్థ శతాబ్దం పాటు ప్రపంచరాజకీయాలను శాసించిన ప్రచ్ఛన్నయుద్ధం (కోల్డ్‌వార్)కాలంలో పౌర, రాజకీయ హక్కులే ప్రజాస్వామ్యమనీ, సామాజిక, ఆర్థిక హక్కులను పెట్టుబడి స్వామ్యం దయా దాక్షిణ్యాలకు వదిలేసినా అక్కడ ప్రజాస్వామ్యం లోపించినట్టు భావించడం అవసరం లేదని అమెరికా కూటమి వాదించగా, సామాజిక ఆర్థిక హక్కులే ప్రజాస్వామ్యమనీ, పౌర రాజకీయ హక్కులు సహితం కావాలనడం కేవలం బూర్జువా బలహీనత అని సోవియట్ కూటమి వాదించింది. ఆ తర్వాత చైనా కూటమి కూడా ఇలాగే మాట్లాడింది. మన దేశంలో కమ్యూనిస్టులు సోవియట్, చైనా వాదనలను సమర్థించారు. కానీ పౌరహక్కుల ఉద్యమం దృష్టిలో ఇది కృత్రిమమైన విభజన అని బాలగోపాల్ అభిప్రాయపడ్డాడు. పౌరహక్కులు లేకుండా, ప్రజాస్వామిక హక్కులను రక్షించుకోలేం. సాధించుకోలేం. భావప్రకటనా స్వేచ్ఛ, సంఘాలుగా ఏర్పడేహక్కు, సంఘటితమయ్యే హక్కు, సమావేశపు హక్కు అన్నీ కూడా ఉద్యమించే హక్కు(ప్రజాస్వామిక హక్కు) లో భాగమే. ఉద్యమించే హక్కు వ్యక్తీకరణలే.

మానవహక్కులంటే పౌర, ప్రజాస్వామిక హక్కులకు భిన్నమైనవి కాదు. వాస్తవానికి పౌరప్రజాస్వామిక హక్కుల సమాహారమే మానవ హక్కులు. ప్రపంచ నాగరికత అభివృద్ధి క్రమంలో ఉనికిలోకి వచ్చి, గుర్తించబడ్డ హక్కులన్నింటినీ ఇవ్వాళ అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటనలోనూ, వివిధ హక్కుల ఒడంబడికల్లోనూ, ఒప్పందాల్లోనూ పొందుపరచబడ్డాయి. హక్కులు మగవాళ్ళకే పరిమితం (Rights of man), సహజహక్కులు (Natural rights) స్థానంలో హక్కుల భావనలో లింగవివక్షతను నిరాకరిస్తూ, దైవసిద్ధాంతాన్ని (Divine theary) ని వ్యతిరేకిస్తూ మానవ హక్కులు (Human rights) అనే భావన వచ్చింది. ఈ మార్పు వెనుక అనేక ఉద్యమాల ప్రభావం ఉంది. పౌర, ప్రజాస్వామిక హక్కులు మానవ హక్కుల సమాహారంగా ఇవ్వాళ అందరూ అంగీకరిస్తున్నారు.

## కొత్త ప్రయోగం

మానవ హక్కులు అంటే మనుషులందరికీ హక్కులనీ, మానవ హక్కుల ఉద్యమం చాలా విశాలమైందనే అభిప్రాయంపై చాలా విమర్శలు ఉన్నాయి. రాష్ట్రంలో మానవ హక్కులవేదిక ఏర్పడిన సందర్భంలో వేదిక అవగాహన గురించి బాలగోపాల్ వివరించాడు. 'మానవహక్కుల భావనకి 'మనిషి'అన్న భావన కేంద్రం. మనిషి పుట్టినందుకు ప్రతి మనిషికి ఉండాల్సిన హక్కులు మానవ హక్కులు. ఇవి సమాజంలో ఒకరికి ఉన్నంతగా, ఇతరులకు లేవు. లేకపోవడానికి వర్గం, కులం, జెండర్, ప్రాంతం, జాతి, మతం మొదలైన అనేక కారణాలు ఉన్నాయి. ఈ విధంగా మనిషితో మొదలైన నిర్వచనం 'వర్గం'తదితర సామాజిక అంశాల దగ్గరికి సులభంగానే వస్తుంది. కానీ వర్గంతో మొదలయ్యే హక్కుల దృక్పథం 'మనిషి అందుకోవడానికి చాలా ఇబ్బంది పడుతుంది'బాలగోపాల్‌కు ఈ అవగాహన మొదట్లో లేదు. మార్క్సిజంపైన అసంతృప్తి, అందులో ఖాళీలను వెతికే ప్రయత్నం, విప్లవోద్యమాలపట్ల విశ్వాసం సన్నగిల్లింది. ఆ తర్వాత హక్కుల ఉద్యమానికి వర్గ దృక్పథం ఉండ కూడదని వాదించాడు. 'మనిషికేంద్రంగా మొదలైన ఆలోచనలు 'ప్రతిమనిషికి ఒకే విలువ'అనే సూత్రీకరణతో ముగిసింది. మానవహక్కులను సార్వజనీన నైతిక ప్రమాణాలుగా (Universal etnical principles) అర్థంచేసుకోవాలనీ, మానవహక్కుల ఉద్యమ లక్ష్యం సమాజంలో, మానవ జీవితంలో విలువలను పెంపొందిస్తూ ప్రజాస్వామీకరించడానికి మానవీకరించడానికి ప్రయత్నించడం అని బాలగోపాల్ ప్రతిపాదించాడు. ఈవిధంగా మన రాష్ట్రంలోని ప్రజా ఉద్యమాల చరిత్రలో మానవహక్కుల వేదిక ఒక కొత్త ప్రయోగాన్ని చేస్తుందని చెప్పాడు. "ఒక రాజకీయ సిద్ధాంతం పట్ల నిబద్ధతకానీ, ఒక రాజకీయ ఉద్యమం అవసరాలుకానీ, ఒక సామాజికవర్గ ప్రయోజనాలు కానీ కాక, కొన్ని విలువల పట్ల నిబద్ధతలో మనందరం ఒక దగ్గరకు వచ్చాం. ఆ విలువల వెలుగులో సమాజాన్ని, మానవ జీవితాన్ని అర్థం చేసుకుంటూ దానిని ప్రజాస్వామీకరించడానికి, మానవీకరించడానికి అవసరమైన కార్యరంగాన్ని నిర్దేశించుకుని కార్యక్రమాలు చేపడుతున్నాం" అని వేదిక మూడవ రాష్ట్రమహాసభలకు సమర్పించిన కార్యదర్శి నివేదికలో వివరించాడు. అంతేకాకుండా, హక్కుల ఉద్యమం కార్యక్రమాలు అణగారిన ప్రజల ఆరాటాలకు, ఆకాంక్షలకు ఆసరా యిచ్చినా, హక్కుల ఉద్యమానికి ఆపోరాటాల్లో వ్యక్తమయ్యే విలువలు మాత్రమే ప్రమాణం అని చెప్పాడు. ఇది 'మన రాష్ట్రంలోని ప్రజా ఉద్యమాల చరిత్రలో ఒక కొత్త ప్రయోగం'అంటూ 'దీనిని నిలబెట్టకపోతే మన ప్రయత్నానికే కాక, విలువలు మనుషుల్ని దగ్గరకు తీసుకురాగలవన్న ప్రజాతంత్ర విశ్వాసానికి కూడా నష్టం చేసిన వారం అవుతాం'అని హెచ్చరిక చేసాడు.

బాలగోపాల్ మొదటి నుండి హక్కుల సంస్థలు రాజకీయాలకు దూరంగా ఉండాలనీ, రాజకీయ విశ్వాసాలకు, కార్యక్రమాలకు వేదిక కాకూడదనీ వాదించాడు. ఆవిధంగానే పౌరహక్కుల సంఘం అవగాహనను, నిర్మాణాన్ని మలచడానికి ప్రయత్నించాడు. హక్కుల ఉద్యమానికి తన సొంత అవగాహన, సొంత అస్తిత్వం ఉండాలని చర్చ లేవదీసాడు. వీటితోపాటు అనేక అంశాలపై చర్చ జరిగింది. మెజారిటీ సభ్యులు ఆయన ప్రతిపాదనలను వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. బాలగోపాల్ ఆలోచనలకు ప్రతిరూపంగా ఏర్పడిన మానవ హక్కుల వేదిక దాని అజెండా ఏ రాజకీయ పార్టీకి కూడా పూర్తి చేయడం సాధ్యం కాదు. వాస్తవానికి బాలగోపాల్‌వి సాంస్కృతిక రాజకీయాలు. వీటిని స్వతంత్రంగా హక్కుల ఉద్యమం ద్వారా సాధించడం వీలవుతుందా అనే సందేహం కలుగుతుంది. హక్కుల ఉద్యమానికి పరిధి, పరిమితులు ఉన్నాయి. సమాజంలో ఉత్పన్నమయ్యే సామాజిక, ఆర్థిక సమస్యలను హక్కుల ఉద్యమం పరిష్కరించే శక్తిలేదు. ప్రత్యేకించి సమాజంలో మౌలికమైన మార్పును తీసుక రావడం హక్కుల ఉద్యమానికి అసాధ్యమైన పని. రాజకీయ ఉద్యమాలే ప్రజల సమస్యలను పరిష్కరించగల్గుతాయి. సామాజిక మార్పుకు దోహదం చేస్తాయి. హక్కుల ఉద్యమం కేవలం ప్రజాస్వామిక ఉద్యమాలు లేదా సమూహాలు ముందుకు తెచ్చే సమస్యలు, ఆకాంక్షలు న్యాయమైనప్పుడు వాటిని సమర్థించడం, ప్రజల్లో ప్రచారం చేసి వాటికి మద్దతు కూడగట్టడం, హక్కులకోణం నుండి ప్రజల్లో చైతన్యం తీసుకరావడం కర్తవ్యంగా ఉంటుంది. ప్రజా ఉద్యమాలకు విలువలను నేర్పించడం హక్కుల ఉద్యమానికి మించిన పరిధి అవుతుంది.

మానవ హక్కులు, విలువలు సార్వత్రికం, అనుల్లంఘనీయం, అవిభక్తం, అనే భావన ఆకర్షణీయంగా ఆమోదయోగ్యంగా ఉంటుంది. కానీ అసమాన, ఆధిపత్య, దోపిడీ సమాజంలో హక్కుల ఉల్లంఘన నిర్దిష్టంగానే ఉంటుంది. హక్కులమధ్య వైరుధ్యం ఎదురవుతుంది. హక్కుల సంఘం ఎటువైపు అనే ప్రశ్న వస్తుంది. సమాజంలో శ్రమ విభజన ఎంత తీవ్రంగా ఉంటే హక్కుల విభజనకూడా అంతే తీవ్రంగా ఉంటుంది. పరస్పర విరుద్ధమైన ఆలోచనలు,విలువలు, ప్రయోజనాలు గల వేర్వేరు వ్యక్తులు, సమూహాల మధ్య హక్కుల విభజన జరిగినట్టయితే నువ్వు ఎవరి హక్కుల గురించి మాట్లాడుతున్నావు అనే ఇబ్బందికరమయిన పరిస్థితి ఎదురవుతుంది. నక్సలైట్ల హక్కుల గురించి మాట్లాడితే పోలీసులకు హక్కులు లేవా అనే ప్రశ్న వస్తుంది. కాబట్టి మానవహక్కులు సార్వజనీనం అని సూత్ర రీత్యా అమోదించడం వేరు, అవి ఏ ప్రత్యేక పరిస్థితుల్లో, నేపథ్యంలో వాటి ఉల్లంఘన, అతి క్రమణలను అర్థం చేసుకోవడం వేరు. అప్పుడు ఎవరి హక్కులు ఎవరు ఉల్లంఘిస్తున్నారో సులభంగానే తెలుసుకోవచ్చు. మానవ హక్కుల ఉద్యమం రాజ్యాంగ యంత్రాంగం పాలనా వ్యవస్థలో, సామాజిక సంబంధాల్లో ప్రజాస్వామీకరణ తీసుకరావడానికి కృషి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా సమాజంలో ఆస్తి సంబంధాల్లో సమానత్వం సాధించకుండా, ప్రజాస్వామీకరణ సాధ్యం కాదు. హక్కుల ఉద్యమానికి సమానత్వం అనే విలువ, హక్కు పునాదిగా వుండాలి.

రాజ్యం, దాని స్వభావం

రాజ్యం కేవలం అణిచివేత యంత్రాంగం అనే అవగాహన సరయింది కాదనీ బాలగోపాల్ అభిప్రాయం. రాజ్యం (పాలకవర్గాలు)

తన ప్రయోజనాలకు ఎవరు అడ్డు తగిలినా వారిని అణిచివేస్తుంది. కానీ రాజ్యం సంస్కరణలను కూడా తీసుకవస్తుంది. అవి ప్రజల సంక్షేమాన్ని దోహదం చేస్తాయి. అంతేకాకుండా రాజ్యానికి 'అభివృద్ధి'తీసుకువచ్చే కార్యక్రమం కూడా ఉంటుందనీ బాలగోపాల్ చాలా సందర్భాలలో వ్యక్తం చేసాడు. కానీ, ప్రస్తుతం రాజ్యం తీసుకవస్తున్న సంస్కరణలు, 'అభివృద్ధి' ఎలాంటిదో వాటి ప్రభావం ఏవిధంగా ఉందో మనం ప్రత్యక్షంగా అనుభవిస్తూనే ఉన్నాం. ప్రజల జీవితాలను బాగు చేసే సంస్కరణలు, సంక్షేమ పథకాలు తీసుకవచ్చినా, వాటి అమలు కోసం మళ్ళీ ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆందోళన తీవ్రమయితే 'శాంతి భద్రతల పేరుతో అణిచివేస్తా ఉంది. భూమిపై ఆదివాసీల హక్కులను పరిరక్షించడానికి చట్టం తీసుకవచ్చి, దాన్ని అమలు చేయాలని పోరాటాలు చేస్తే రాజ్యం వారిపై యుద్ధం ప్రకటించింది. సంస్కరణలు-అణిచివేత కొనసాగుతూనే రాజ్యం తన విశ్వసనీయత పెంచుకోవడానికి ప్రయత్నిస్తుంది.

రాజ్యహింస గురించి కూడా బాలగోపాల్‌కు స్పష్టమయిన అవగాహన ఉంది. 1998లో పౌరహక్కుల సంఘం నుంచి విడిపోయి, మానవహక్కుల వేదిక ఏర్పాటు కావడానికి ప్రధానంగా నక్సలైట్ల హింసను సమర్థించడం, ఖండించడంగా అర్థం చేసుకున్నారు. దీనికి బాలగోపాల్ సమాధానం యిచ్చారు. "రాష్ట్రంలో (ఇటువంటి ప్రణాళికతో)పనిచేస్తున్న ఎపిసిఎల్‌సి ఉండగా హెచ్‌ఆర్‌ఎఫ్ ఏర్పడటం నక్సలైటు పార్టీలు చేసే హింసను ఖండించడానికేనన్న వాదన చాలా బలంగా వినపడుతుంది. నక్సలైటు పార్టీలు చేసే 'అప్రజాస్వామిక చర్యలు' గురించి పౌరహక్కుల ఉద్యమంలో జరిగిన చర్చను రాజ్యహింస వర్సెస్ నక్సలైటు హింసగా కుదించడం వల్ల ఏర్పడ్డ పరిణామమిది. దీనికి మీడియా సహకారం కూడా చాలానే ఉంది. "మానవ హక్కుల వేదిక రాజ్యహింసను, నక్సలైటు హింసను ఒకే గాటిన కట్టి చూడదు". కానీ నక్సలైట్ల చేర్యలను మొత్తంగా 'అప్రజాస్వామిక చర్యలు' అనే నామకరణం చేయడాన్ని పౌరహక్కుల సంఘం వ్యతిరేకించింది. పౌరహక్కుల సంఘంలో జరిగిన చర్చ కేవలం 'ఉద్యమకారుల హింస'కే పరిమితం కాదు. చాలా అంశాలు చర్చకు వచ్చాయి. కానీ, దీన్నే ప్రాధాన్యంగా చేసి ప్రచారం జరిగింది. ఇప్పుడూ జరుగుతూ ఉంది. బాలగోపాల్ మరణం సందర్భంగా ఇలాంటి ప్రచారం జరగడం చాలా విచారకరం.

సమాజంలో తలెత్తే సామాజిక, ఆర్థిక సమస్యలు, వాటి ఫలితంగా ముందుకువచ్చే ఘర్షణలు వివిధ సామాజిక వర్గాలమీద ప్రభావం చూపుతాయి. వీటి పట్ల స్పందనలు, పరిష్కారమార్గాల్లో తేడాలు ఉంటాయి. ప్రజాస్వామిక ఉద్యమాలను ప్రభుత్వాలు అణిచివేయడానికి ప్రయత్నించినప్పుడూ, ఆ ఉద్యమాల లక్ష్యాలను వక్రీకరించినప్పుడు హక్కుల ఉద్యమాలు తప్పనిసరిగా వ్యతిరేకించాలి. ప్రభుత్వాలు ఆ ఉద్యమాలను సాయుధంగా అణిచివేసినప్పుడు ప్రతిఘటన ఎదురవుతుంది. ఈ ప్రతిఘటన సాయుధంగానే ఉంటుంది. ఈ సాయుధ ఘర్షణ తీవ్రమయ్యేకొద్దీ దాని ప్రభావం సమాజం మీద పడుతుంది. ప్రజలను అభద్రతలోకి నెడుతుంది. ఇటువంటి సందర్భంలో బుద్ధి జీవుల గురించి బాలగోపాల్ రాస్తూ "మధ్యతరగతి బుద్ధి జీవులకు ఒక లక్షణం ఉంది. న్యాయాన్యాయాల సంఘర్షణ మన నిత్య జీవితానికి ఎంత దూరంగా జరిగితే అంత సులభంగా న్యాయం పక్షం వహిస్తాం. ఆ సంఘర్షణ మన నిత్య జీవితానుభవానికి చేరువ అయ్యేకొద్దీ న్యాయం పక్షం వహించడం కష్టం అవుతుంది. ఎందుకంటే అన్యాయం వ్యవస్థీకృతం అయినచోట మన దైనందిన జీవిత సుఖశాంతులు అన్యాయంతో ముడిపడి ఉంటాయి. అప్పుడు న్యాయాన్ని వ్యతిరేకించడానికి లేదా సంఘర్షణ పట్ల ఉదాసీనంగా ఉండటానికి మనకు ఎన్నో కారణాలు కనిపిస్తాయి. దూరంగా ఉన్నప్పుడు 'అంతఘోరం జరుగుతూ ఉంటే ఎవరు ఎందుకు మాట్లాడలేదో' అని ఆశ్చర్యపోతాం. దగ్గరగా ఉంటే మాట్లాడకుండా ఊరుకోవడానికి ఎన్నో కారణాలు కనిపిస్తాయి. అవి న్యాయమైన కారణాలు కూడా కావచ్చు. ఎందుకు కాకూడదు"అని ప్రశ్నించాడు బాలగోపాల్.

'హింసా-హింసల మీమాంసలో అనంతంగా కాలక్షేపం చేయకుండా పోలీసుల ఇనుపబూట్ల కింద నలిగిపోతున్న జీవితాన్ని గురించి ఆలోచించమని అడుగుతున్నాం'అని బాలగోపాల్ కల్లోల కథాచిత్రాల్లో నినదించాడు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభల్లో 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' ఆపాలని అందరం నినదించాలనీ పిలుపునిచ్చాడు. మావోయిస్టులు కూడా సంయమనం పాటించాలని విజ్ఞప్తిచేసాడు.

### ఐక్యత చారిత్రక అవసరం

మానవహక్కులవేదిక, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ, పౌరహక్కుల సంఘాల మధ్య అవగాహనలో ఆచరణలో పెద్దగా తేడాలు లేవు. కొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నా అవి కలిసి పని చేయడానికి ఆటంకం కావు. ఇవ్వాళ హక్కుల ఉద్యమం అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నది. అభివృద్ధిపేరుతో జరుగుతున్న విస్తాపన, విధ్వంసం, హిందూమతోన్మాదం పెరిగి మైనారిటీ మతస్థులపై ఊచకోత, ఉగ్రవాదం పేరుతో హక్కుల ఉల్లంఘన, తీవ్రవాదం పెను ప్రమాదం అని చెప్తూ ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ఆదివాసీలపై చేస్తున్న యుద్ధం, అన్నీ కూడా హక్కుల ఉనికికే ప్రమాదం ఏర్పడింది. ఈ సవాళ్ళను ఎదుర్కోవడం ఒంటరిగా సాధ్యం కాదు. హక్కుల సంఘాలు కలిసి ఐక్యంగానే హక్కులను కాపాడుకోగల్గుతాం. హక్కుల ఉద్యమాన్ని బలోపేతం చేయగల్గుతాం. ఈ కర్తవ్యం నిర్వహించడమే బాలగోపాల్‌కు నిజమైన నివాళి.

*('ఆంధ్రజ్యోతి' దినపత్రికలో శేషయ్య రాసిన ఈ వ్యాసాన్ని ఎడిట్ చేసి ప్రచురించారు. ఇది ఆ వ్యాసం పూర్తి పాఠం.)*

# ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో బాలగోపాల్

ప్రొ. జి. హరగోపాల్

*బాలగోపాల్ రాజీలేని ప్రజాస్వామ్య ప్రయోగం నుండి పౌరహక్కుల సంఘం నేర్చుకోవాలసిన పాటించవలసిన ఎన్నో మంచి అంశాలు ఉన్నాయి. అనుభవాలున్నాయి. ప్రజాస్వామ్య సంస్కృతి ఉంది. వ్యక్తి, సమిష్ఠిలో పని చేస్తున్నప్పుడు తనను తాను సమిష్టిలో అంతర్లీనం ఎలా చేసుకోవాలన్నది ఒక ప్రధాన సవాలుగా మన ముందు ఉంది. అలాగే ఒక స్నేహపూరిత వాతావరణం సమిష్ఠితత్వం ఎలా సృష్టించుకోవాలన్నది మరొక సవాలు. నాయకత్వానికి కార్యరంగానికి, కార్యకర్తలకు మధ్య అగాధం లేకుండా ఎలా పనిచేయాలన్నది కూడా ఒక ప్రశ్నే. విడిపోయినా ఎంత సహృదయంతో విడిపోవచ్చో ఒక పద్ధతిని నెలకొల్పాడు. బాలగోపాల్ పని విధానం పౌరహక్కుల ఉద్యమానికి ఒక సంపన్నమైన వారసత్వం ఇచ్చిందన్నది ఒక వాస్తవం. ఆయన జీవితాన్ని, ఆశయాలను, ఆచరణను మరింత లోతుగా అవగాహన చేసుకొని, బలమైన పౌరహక్కుల ఉద్యమాన్ని నిర్మించడమే పౌరహక్కుల సంఘం బాలగోపాల్‌కు ఇవ్వగలిగిన నిజమైన నివాళి.*

బాలగోపాల్ తాను గణితశాస్త్రంలో వరంగల్ ఆర్.ఇ.సి.లో పరిశోధన చేసి పి.హెచ్.డి. పొంది ఢిల్లీలో ప్రతిష్ఠాత్మకమైన Indian Institute of Statistics లో తన పరిశోధన కొనసాగిస్తున్న కాలంలో, అక్కడ ఒక సీనియర్ ప్రొఫెసర్ వైఖరి నచ్చక వరంగల్ తిరిగి వచ్చాడు. అప్పటికే వరంగల్‌లో ఉండే రాజకీయ చైతన్యం ఆయన మీద చాలా ప్రభావం చేసింది. రీజన్‌లో ఇనిజనీరింగ్ కాలేజీలో చదువుతున్నప్పుడు సూరపనేని జనార్ధన్ విప్లవ రాజకీయాల్లో చాలా చురుకుగా పని చేస్తున్నాడు. అయితే బాలగోపాల్ కమ్యూనిస్టులు వాస్తవాన్ని అతిశయం చేసి చెపుతారు అని నమ్మేవాడినని, ఒక సందర్భంలో నాతో అన్నాడు. కాని ఎమర్జెన్సీలో జనార్ధన్ గిరాయపల్లి ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం. తమ విశ్వాసాల కొరకు ప్రాణాలిస్తారన్న వాస్తవం, కమ్యూనిస్టుల పట్ల ముఖ్యంగా విప్లవ ఉద్యమాల పట్ల ఆయన వైఖరిని పూర్తిగా మార్చి వేయడానికి కారణమయ్యాయి. అందుకే వరంగల్‌కు తిరిగి వచ్చిన తర్వాత తాను కూడా సమాజం కొరకు ఏదైనా చేయలాని నిర్ణయించుకున్న తర్వాతే వరవరరావు గారిని కలిసి విరసంలో పని చేయడం ప్రారంభించాడు. వరవరరావుగారి సలహా మేరకే పౌరహక్కుల సంఘంలో చేరారు. అయితే అప్పటివరకే ఆయన వ్యక్తిత్వము, నిజాయితీ, వాడైన మేధస్సు, అకుంఠితమైన శ్రమతో కూడుకుని ఉన్నదన్నవి ఆయన కుటుంబ సభ్యులు, చిన్నప్పటి స్నేహితులు ఇపుడు చెపుతున్న సంఘటనలతో అర్థమవుతున్నది. ఏ కారణమైనా ఆయన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో చేరిన తర్వాత నిర్వహించిన పాత్ర ఒక చారిత్రకమైన పరిణామంగా మనం చెప్పుకోవచ్చు.

పౌరహక్కుల సంఘంలో చేరి అతి తక్కువ సమయంలో సంఘంలో ఆయన కీలక పాత్ర నిర్వహించడం ఆయన కున్న సంసిద్ధంత ఒక కారణమైతే, పౌరహక్కుల సంఘానికుండే ప్రజాస్వామ్య స్వభావం మరొక కారణం. సాధారణంగా ప్రజా సంఘాల్లో వ్యక్తులు అంత తొందరగా నాయకత్వ స్థానానికి ఎదగడానికి అవకాశముండదు. అయితే అది అప్పటి సంస్థ అవసరం కావచ్చు, బాలగోపాల్ యొక్క వ్యక్తిత్వం కావచ్చు, ఈ విషయంలో ఇవి రెండు కలవడం వల్లే ఇది సాధ్యమయ్యుండొచ్చు. అయితే బాలగోపాల్ సంస్థలో చేరినప్పుడైనా, ఆయన అంత తక్కువ కాలంలో కీలక పాత్ర నిర్వహించడం గురించైనా నాకు పూర్తిగా తెలియదు. నేను పౌరహక్కుల కొరకు పనిచేయడం 1977 ఒక నిజ నిర్ధారణ కమిటీ సభ్యుడుగా వెళ్ళడంతో ప్రారంభమయ్యింది. కాని నేను అప్పటికి సంస్థలో చురుకైన సభ్యుడిగా పనిచేయడం లేదు. అయినా మా పేర్లు పోలీస్ రికార్డ్‌లోకి అప్పటికే చేరాయి. నేను 1980లో వరంగల్ వదలడం బాలగోపాల్ వరంగల్ తిరిగి రావడం దాదాపు ఒకేసారి జరిగాయి. నేను బాలగోపాల్‌ను ఎప్పుడు వ్యక్తిగతంగా కలిసానో నాకు ఇప్పుడు జ్ఞాపకం లేదు. ఇది ఇప్పటికి నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తూంటుంది. అయితే వరంగల్ పోలీసు రిపోర్టులో మొట్టమొదట బాలగోపాల్ పేరు ప్రస్తావనకు వచ్చినప్పుడు, ఎవరో ఆఫీసరు ఈ పేరు తప్పు పడిందని, ఇది హరగోపాల్ అని ఉండాల్సింది అని అన్నప్పుడు వాడు వరంగల్ నుండి పోయాడు ఇంకొకడు వచ్చాడు, వీడు వాడికంటే ప్రమాదకరంగా ఉన్నాడు అని మరొక ఆఫీసర్ అన్నాడని అప్పుడు కలెక్టర్ ఆఫీసులో పనిచేస్తూన్న మా పూర్వ విద్యార్థి ఒకరు చెప్పాడు. అది ఎంత వాస్తవమో నాకు తెలియదు కాని. మా రెండు పేర్లు కవలల పేర్లుగా తెలుగు సమాజంలో ప్రచారానికి వచ్చాయి. నన్ను చాలా మంది, చాలా సందర్భాల్లో బాలగోపాల్ అని సంబోధించడం ఒక ఊహించని అనుభవ మయ్యింది. బాలగోపాల్ విశిష్ఠ, విలక్షణ వ్యక్తిత్వంతో పోటీపడడం కాని, పోల్చుకోవడం కాని ఆయన విశిష్ఠవ్యక్తిత్వానికి అన్యాయమని నేను పూర్తిగా నమ్ముతున్నాను. ఇద్దరం ఆత్మీయంగా ఉన్నాం. మీరు ఫలానా వాళ్ళ విషయంలో కొంచెం జాగ్రత్తగా ఉండాలి అని, నా గురించి కొందరు ఏమనుకుంటున్నారో అని ఆయన అన్నప్పుడు నాకు చాలా ఆశ్చర్యం కలిగేది. ఆయన అంత ఆత్మీయంగా చెప్పడం ఒక గొప్ప అనుభవంగా కూడా ఉండిపోయింది. ఇది బాలగోపాల్ వ్యక్తిత్వానికి కొంత భిన్నమైంది.

బాలగోపాల్ చాలా ముభావంగా ఉండే మనిషని ఇప్పుడు మొత్తం తెలుగు సమాజానికి తెలుసు. ఆయనతో పని చేసిన వారికి, పరిచయమున్న వారికి ఈ విషయం ఇంకా బాగా తెలుసు. ఈ విషయంలో ఆయనను తప్పుగా అర్థంచేసుకున్న వాళ్ళున్నారు. తప్పుపట్టే వాళ్ళున్నారు. దానికి భిన్నంగా నేను కొంచెం ఎక్కువగానే

మాట్లాడతాననేది చెప్పవలసిన అవసరం లేదు. మా ఇద్దరి మధ్య ఈ తేడా కొట్టవచ్చినట్టుగా కనిపిస్తుంది. ఒకసారి ఒక సుదూర ప్రయాణంలో నేను నిరంతరంగా మాట్లాడుతున్నాను, ఆయన వింటు ఉన్నాడు. ఇది గమనించి మీరేం మాట్లాడడం లేదు అని నేనంటే శ్రమ విభజనలో మాట్లాడేవాళ్ళు వినే వాళ్ళు అనే పార్శం కూడా ఒకటి ఉంటుంది అని నవ్వుతూ అన్నాడు. ఒక పది పదిహేను నెలల క్రితం మేమిద్దరం వికలాంగుల సమస్య గురించి మాట్లాడడానికి సెక్రెటరియట్‌కు వెళ్ళాం. పని అయిన తర్వాత బయటికి వచ్చినప్పుడు, ఇంటికి పోదాం పదండి, స్కూటర్ మీద కూర్చోండి అని అంటూ మీకు లడ్డూ, ఖరా, పెడతానూ, టీ చేసి ఇస్తాను అని అన్నప్పుడు వనమాల గారు పిక్అప్ చేసుకోవడానికి వస్తానన్నారు అని అంటే నా సెల్‌ఫోన్ తీసుకుని ఆమెకు ఫోన్ చేస్తూ నాతో అన్న మాటలే ఆమెతో కూడా అన్నాడు. ఇది నాకు విస్మయాన్ని కలిగించింది. స్కూటర్ మీద కూర్చున్నంత సేపు కొన్ని విషయాలు చెపుతూ నడుపుతున్నాడు. ఇంటికి చేరాకా కూడా వాళ్ళబ్బాయ్ ప్రభాత్‌తో సార్ వచ్చాడు. ఆయన పెద్దసార్ సరిగ్గా కూర్చో అని అన్నప్పుడు, ఆయన నీకు పెద్ద కావచ్చు నాకు కాదు అని ప్రభాత్ అన్నాడు. ఆ విషయాన్ని అప్పుడే ఆఫీస్ నుండి వచ్చిన వసంతతో కూడా చెప్పాడు. ఇది ఒక విధంగా చాలా చిన్న విషయం, కాని బాలగోపాల్ విషయంలో ఈ మార్పు నా దృష్టిలో చాలా పెద్దమార్పు. ఈ సంఘటన గురించి వరవరరావుగారికి, శంకరన్ గారికి, రాఘవాచారికి, మరి కొంతమంది మిత్రులకి అప్పుడే చెప్పాను. ముభావంగా ప్రారంభమైన పౌరహక్కుల సహచర్యం, స్నేహంగా ఆత్మీయంగా మారడం నాకు జీవితంలో ఒక ప్రగాఢమైన అనుభవం. ఉద్యమాలలో ఇలాంటి అనుభవాలకు చాలా విలువ ఉంటుంది. మరో రెండు విలువైన అనుభవాలు ఆయనతో పని చేసే క్రమంలో ఉన్నాయి. ఒకటి కన్నాభిరన్ గారు పౌరహక్కుల సంఘం అధ్యక్ష పదవి నుండి తనను తప్పించాలని, తనకు వయసుపై పడిందని ఒకే వ్యక్తి ఇంత కాలం కొనసాగడం ప్రజాస్వామ్యం కాదని అన్నప్పుడు, బాలగోపాల్ నాకు ఐదు వాక్యలతో ఒక కార్డు వ్రాసాడు. అందులో కన్నాభిరన్‌గారి కోరికను ప్రస్తావిస్తూ, మీరే ఈ ముళ్ళ కిరీటాన్ని భరించాలి. మీకుండే 'good nature' వలన సంస్థలో మీరు ఈ బాధ్యత నిర్వహించగలరు అని వ్రాసాడు. ఈ క్రమంలోనే సంస్థలో నాయకత్వం సామాజిక వర్గం మీద ఒక చర్చ ప్రారంభమయ్యింది. ఒక సందర్భంలో నా మీద వ్యక్తిగతమైన కొన్ని విమర్శలు వచ్చినపుడు, ఈ పద్ధతి ఏం బాగాలేదని నేను బాలగోపాల్‌తో అన్నప్పుడు సామాజిక మార్పు జరుగుతున్నప్పుడు ఇలాంటి ధోరణులు నూతన మానవ విలువల ప్రస్థానానికి ఒక సంకేతంగా పరిగణించాలి అని అన్నాడు. ఆయన కార్డు ముక్కలో వ్రాసిన పద్ధతి కాని, సామాజిక వర్గం మీద ఆయన సూత్రీకరణ చేసినప్పుడు కాని అవి ఎంత convincing గా చెప్పాడంటే మనం ఎదురు ప్రశ్న వేయడానికి వీలులేనంత logical ఉన్నాయి. ఈ మనస్తత్వం, ఆలోచనా ధోరణి, లోతైన అవగహన వలన ఆయన పౌరహక్కుల సంఘానికి ఒక దిశానిర్దేశం చేయ గలిగారు.

పౌరహక్కుల ఉద్యమంలో బాలగోపాల్ ఎన్నడు నాయకుడిగా ప్రవర్తించలేదు. అలా ప్రవర్తించడం ఆయనకు నచ్చదు. ఏదో ఒక సందర్భంలో పౌరహక్కుల నేత అని ఆయనను సంబోధించినపుడు చాలా విసుక్కున్నాడని ఈ మధ్యే జరిగిన విరసం సభలో వరవరరావుగారు ప్రస్తావించారు. ఆయనకు ఎప్పుడు ఒక కార్యకర్తలాగా, అందరితో కలిసి వాళ్ళలో ఒకడిగా ఉండాలని, తన గురించి ఎవ్వరు కూడా ఎక్కువ స్థాయి మనిషి అని అనుకోకూడదని ప్రగాఢంగా విశ్వసించి దాన్ని ఆచరించారు. అందుకే ఏ పౌరహక్కుల మీటింగ్‌లో అయినా తాను కూర్చుండే పద్ధతి నుండి మాట్లాడే తీరుగాని అందరిలో ఒకడిగా ఉండేవాడు. ఆ ఆచరణే ఆయనను ఒక విలువయినా కార్యకర్త నాయకుడిగా మలచింది. ఎన్నో సందర్భాలలో నిర్ణయాలు జరిగే దాకా చర్చించి, తాను విభేదించిన అంశంలో కూడా మెజారిటీ నిర్ణయానికి కట్టుబడి నిర్ణయమైన మరుక్షణం నుండి దాని అమలుకు పనిచేసేవాడు. సంఘంలో ఏర్పడిన సైద్ధాంతిక బేదాల మీద ఐదు ఆరు సంవత్సరాలు బహుశ ప్రపంచంలో ఏ పౌరహక్కుల సంఘంలో జరగనంత వాడిగా వేడిగా చర్చ జరిగింది. ఒక్కొక్కసారి గంటల తరబడి, రోజుల తరబడి విరామం లేకుండా చర్చ జరిగింది. సభ్యులు స్వేచ్ఛగా, స్వతంత్ర్యంగా, ఒక్కొక్కసారి హద్దులు దాటి తీవ్ర చర్చ చేసిన సందర్భాలున్నాయి. ఇంత బేధాభిప్రాయాలతో దాదాపు ఐదు, ఆరు ఏళ్ళు కలిసి పనిచేయడం అంత సామన్యమైన విషయం కాదు. ఈ మొత్తం ప్రక్రియలో సంఘం యొక్క ప్రజాస్వామ్య సంస్కృతి ఒక ఎత్తయితే ఇందులో బాలగోపాల్ ప్రత్యక్ష, పరోక్ష పాత్ర అంత కీలకమైంది. ఇలా సుదీర్ఘమైన చర్చ జరిగినపుడు సభ నిర్వహించే బాధ్యతలో నాకు కొంత పాత్ర ఉండేది. అలా బాధ్యత నిర్వహించిన ముగ్గురు నలుగురు సభ్యులకు ఈ చర్చ జరిగిన తీరు జీవితంలో మరచిపోలేని సుసంపన్నమైన అనుభవంగా ఉండి పోయింది.

1993లో పౌరహక్కుల సంఘంలో వచ్చిన సైద్ధాంతిక బేదాలు ఒక స్థాయికి చేరుకున్న తర్వాత, నాయకత్వానికి కార్యకర్తలకు మధ్య చాలా దూరం ఏర్పడింది. కార్యకర్తల పట్ల చాలా గౌరవభావన కలిగిన నాయకత్వానికి ఏం చేయాలో తోచని పరిస్థితి ఏర్పడింది. కార్యకర్తలకు నాయకుల దృక్పథంపట్ల తీవ్ర విబేధం ఉన్నప్పుడు వాళ్ళకు సంపూర్ణ విశ్వాసం ఉండే నాయకత్వం ఉండడం ప్రజాస్వామ్యమని భావిస్తే, కార్యకర్తలు బాలగోపాల్‌తో సహ అందరు నాయకత్వంలో కొనసాగాలని పట్టుబట్టడం ఒక ప్రజా సంఘం చరిత్రలో అపూర్వ అనుభవం. అభిప్రాయాల పట్ల బేధం, వ్యక్తిగతంగా విశ్వాసం, గౌరవం. ఇది విచిత్రమైన మేళవం. ఇలా కూడా కొన్ని సంవత్సరాలు సంఘం నడిచింది. కాని ఇలా ఎల్లపుడూ సంఘం అలా నడవడం కష్టమని భావించి నాయకత్వ స్థానాల నుండి మమ్మల్ని తప్పించాలని సంఘాన్ని కోరడమైంది. ఇది చివరిగా కొత్త నాయకత్వానికి దారి వేసింది. నాయకత్వం మార్పు బయట సమాజంలో తీవ్రమైన ఆసక్తిని రేపింది. హైద్రాబాదులో 1998 ప్రాంతంలో ఈ మార్పు జరిగినప్పుడు ఆ రోజు పెద్ద ఎత్తున మీడియా బయట ఎదురుచూస్తున్నది. అప్పుడు

అంతర్జాతీయ మీడియా కూడా వచ్చింది. సంఘం చీలుతున్నదన్న వార్త కొరకు వాళ్ళంతా ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంలో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో బాలగోపాల్ మాట్లాడుతూ "మీరనుకున్నట్లు సంఘం చీలిపోవడం లేదని" అని చెప్పాడు. మీడియా చాలా నిరుత్సాహానికి గురయ్యింది. ఆయన సంఘంలో వచ్చిన సైద్ధాంతిక విబేధాలను వేరు పడడాన్ని మీడియాకు చెప్పితే పౌరహక్కుల ఉద్యమానికి హాని జరుగుతుందని బలంగా నమ్మాడు, నిజానికి తర్వాత పౌరహక్కుల సంఘం నుండి విడిపోయి మానవ హక్కుల వేదిక ఏర్పడడం అంత పెద్ద వార్త కాలేదు. అది చాలా సున్నితంగా జరిగేలా బాలగోపాల్ ఆయనతో పాటు బయటికి వెళ్ళిన వారందరు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

పౌరహక్కుల సంఘంలో రెండు దృక్పథాలు ఏర్పడినప్పుడు నేను కూడా బాలగోపాల్ ప్రతిపాదించిన దృక్పథానికి దగ్గరగా ఉన్నాను. గుంటూరులో జరిగిన సభలో ఈ విషయాన్ని నేను సభ్యులకు స్పష్టంగా చెప్పాను. అయితే పౌరహక్కుల సంఘం నుండి బయటకు వెళ్ళాలి అనే నిర్ణయంతో నాకు అంగీకారం లేదు. ఈ విషయం నేను బాలగోపాల్‌తో వ్యక్తిగతంగా చెప్పినపుడు "మీరు పౌరహక్కుల సంఘంలో కొనసాగడమే మంచిదని, అది రెండు సంఘాలకు ఉపయోగకరంగా ఉంటుందని" సలహ ఇచ్చాడు. ఆయన గత పదేళ్ళు నా నిర్ణయాన్ని గౌరవించాడు. ఆ నిర్ణయం ఎప్పుడు కూడా వ్యక్తిగత సంబంధాల మీద ప్రభావం చూపలేదు. ఈ విషయం గురించి మళ్ళీ మేమెప్పుడు మాట్లాడుకోలేదు. అంతేకాక ఎప్పుడు పౌరహక్కుల సంఘం గురించి మాట్లాడుకున్న సంఘంలో ఎవరు ఏ బాధ్యతలు తీసుకుంటే మంచిదో, ఏ కార్యక్రమాలు చేయవచ్చో చెప్పేవారు. ఒక సందర్భంలో మళ్ళీ ఈ రెండు సంఘాలు కలిస్తే బావుంటుంది కదా అని నేనంటే నవ్వి ఊరుకున్నారు. గత పదేళ్ళల్లో నాకు తెలిసి ఆయన ఎ్కడ కూడా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం గురించి ప్రస్తావించడం కాని, విమర్శించడం కాని చేయలేదు. ఏ జిల్లాలోనైనా రెండు సంఘాల కార్యకర్తలు మధ్య విబేధాలు వస్తే, వాటిని స్నేహపూర్వకంగా పరిష్కరించాడే తప్ప, వాటిని ప్రోత్సహించలేదు. పౌరహక్కుల సంఘం సజీవంగా ఉండాలని, ఈ రెండు దృక్పథాల విలువ సామాజిక అనుభవాలతో రాటు తేలుతుందని విశ్వసించాడు. నిజానికి పౌరహక్కుల సంఘం పట్ల తన గౌరవభావనకు మార్చుకోలేదు. ఇవి రెండు భిన్నమైన ప్రజాస్వామ్య ప్రయోగాలుగానే ఆయన భావించారు.

ప్రజాసంఘాల మధ్య ఈ పరస్పర అవగహన గౌరవం అవసరంమనేది ఆయన ఆచరణ ద్వారా ఒక ఆదర్శాన్ని నిలబెట్టాడు. ఉద్యమ స్ఫూర్తిగల అన్ని సంఘాల మధ్యేకాక, విడిపోయిన సంఘాల మధ్య కూడా ఒక ఐక్య సంఘటన అవసరాన్ని బాలగోపాల్ నమ్మి, దాన్ని ఆచరించే ప్రయోగం చేసాడు.

బాలగోపాల్ రాజీలేని ప్రజాస్వామ్య ప్రయోగం నుండి పౌరహక్కుల సంఘం నేర్చుకోవాలసిన పాటించవలసిన ఎన్నో మంచి అంశాలు ఉన్నాయి. అనుభవాలున్నాయి. ప్రజాస్వామ్య సంస్కృతి ఉంది. వ్యక్తి, సమిష్ఠిలో పని చేస్తున్నప్పుడు తనను తాను సమిష్టిలో అంతర్లీనం ఎలా చేసుకోవాలన్నది ఒక ప్రధాన సవాలుగా మన ముందు ఉంది. అలాగే ఒక స్నేహపూరిత వాతావరణం సమిష్ఠితత్వం ఎలా సృష్టించుకోవాలన్నది మరొక సవాలు. నాయకత్వానికి కార్యరంగానికి, కార్యకర్తలకు మధ్య అగాధం లేకుండా ఎలా పనిచేయాలన్నది కూడా ఒక ప్రశ్నే. విడిపోయినా ఎంత సహృదయంతో విడిపోవచ్చో ఒక పద్ధతిని నెలకొల్పాడు. బాలగోపాల్ పని విధానం పౌరహక్కుల ఉద్యమానికి ఒక సంపన్నమైన వారసత్వం ఇచ్చిందన్నది ఒక వాస్తవం. ఆయన జీవితాన్ని, ఆశయాలను, ఆచరణను మరింత లోతుగా అవగాహన చేసుకొని, బలమైన పౌరహక్కుల ఉద్యమాన్ని నిర్మించడమే పౌరహక్కుల సంఘం బాలగోపాల్‌కు ఇవ్వగలిగిన నిజమైన నివాళి.


## హక్కుల పత్రికలను...

**చదవండి! చదివించండి!! చందాదారులుగా చేరండి!!**

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి) పత్రిక - స్వేచ్ఛ

ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సమితి (ఒపిడిఆర్) పత్రిక - జనపథం

మానవహక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) బులెటిన్ - మానవ హక్కులు

Civil Liberties (CLMC) - Bulletin

People's Union for Civil Liberties (PUCL) - Bulletin

Co-ordination of Democratic Rights Organizations (CDRO) - Bulletin

# బాలగోపాల్ - ప్రజాస్వామిక అవగాహన

- వరవరరావు

వర్గపోరాటమే ప్రజాస్వామిక హక్కుల సాధనకు కూడ చోటు (స్పేస్) కల్పిస్తుందనే అవగాహన పై బాలగోపాల్‌కు రాను రాను విశ్వాసం సన్నగిల్లుతూ వచ్చింది. చిన్న చిన్న సమస్యలు, చిన్న చిన్న పోరాటాలు, చిన్న చిన్న పరిష్కారాలు తప్ప ఆదర్శ సమ సమాజం అనుమానమే - కనుక విలువలు, ప్రమాణాలు నిజాయితీగా నిలుపుకునే ప్రజాస్వామిక ఉద్యమాలు చేపడదామనే దిశగా పయనించాడు. అది గాంధీజీ వంటి అహింసా మార్గం కూడా కాకపోవడం వల్ల సత్యాగ్రహాల, నిరాహార దీక్షల అలకలకు బెదరింపులకు కూడా అవకాశం లేకుండా పోయింది. తన నిజాయితీ వల్ల, ఆచరణ వల్ల ఆయన హక్కుల ఉద్యమానికి అసాధారణమైన గుర్తింపు తెచ్చాడు గానీ, ప్రజాస్వామిక హక్కులు నిజంగానే వర్గపోరాటేతర శక్తుల వల్ల సాధించబడి పరిరక్షింపబడుతాయని చరిత్రలో ఇప్పటివరకయితే రుజువు కాలేదు.

హక్కుల సంఘాలు స్వతంత్ర ప్రతిపత్తితో, తమవైన అవగాహనతో నడవాలని మొదటి నుంచీ అనుకుని ఉంటే బాలగోపాల్ మొదట విరసంలో, వెంటనే ఎపిసిఎల్‌సిలో చేరి ఉండేవాడు కాదు. 80ల ఆరంభంలో సృజన 'సాహితీమిత్రులు'లో, కొద్దికాలానికే విరసంలో చేరి '81లో గానీ ఆయన ఎపిసిఎల్‌సిలో చేరలేదు. '81లో చేరిన కొద్దిరోజులకే హైదరాబాద్ మహాసభల తర్వాత కార్యవర్గానికి కోఆప్ట్ అయ్యాడు. '83లో ఎపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శిగా తన ఇష్టపూర్వకంగానే ఎంచుకొని ఎన్నికయ్యాడు. బహుశా ఈ రెండేళ్ల ఆచరణలో ఆయన ఎపిసిఎల్‌సి ని స్వతంత్రంగా నడపాలనే ఆలోచనకు వచ్చి ఉంటాడు. అందుకే ఆయన మానసిక సంసిద్ధతతో బాధ్యతలు చేపట్టాడు. ఇందుకు ఆయన ముందు ఒక పదేళ్ల ఎపిసిఎల్‌సి విస్తృత ప్రజా ఉద్యమ ఆచరణ ఉన్నది. అది రాష్ట్ర స్థాయిలో బలమైన మార్క్సిస్టు-లెనినిస్టు లేదా ప్రజల దృష్టిలో నక్సలైటు సంస్థ ఇమేజ్‌తో ఉన్నది. జిల్లా స్థాయిలో ముఖ్యంగా వరంగల్‌లో ఆ ఇమేజ్ ఉంటూనే ప్రజాహిత కార్యాలన్నింటినీ చేపట్టే విశ్వసనీయత గల సంస్థగా కూడా పేరు తెచ్చుకున్నది. అందుకు ప్రధానమైన చొరవ డాక్టర్ రామనాథం గారిది. ఒక విధంగా డాక్టర్ రామనాథం గారి సాహచర్యం బాలగోపాల్‌కు విస్తృతంగా పనిచేసే ఒక వెసులుబాటును ఇచ్చింది. ఎపిసిఎల్‌సి కూడా ఎమర్జెన్సీ ముందటి సంస్థా నిర్మాణరూపం నుంచి, అవగాహన నిమగ్నత నుంచి కొంచెం తెరచుకోవాలనే ప్రయత్నంలో ఉన్నది. ముఖ్యంగా ఎమర్జెన్సీ చీకటి రోజుల అనుభవాలు అన్ని ప్రజా సంఘాలకు విస్తృత విశాల ఐక్య భావంతో పని చేయాలనే ఒక ఆచరణా అవగాహనను కలిగించినవి. ఎపిసిఎల్‌సి ఏర్పడిన నాడు కనీసం ఆరుగురు విరసం కార్యవర్గ సభ్యులు ఎపిసిఎల్‌సి కార్యవర్గ సభ్యులుగా కూడా ఎన్నికయ్యారు. విరసం అధ్యక్షుడు శ్రీశ్రీ ఎపిసిఎల్‌సి అధ్యక్షుడు కూడా కావడం అందరూ 'స్వర్గంలో జరిగిన నిర్ణయం'గానే తీసుకున్నారు. కారణాలు ఏమైనా ఎమర్జెన్సీ తర్వాత ఎపిసిఎల్‌సి అధ్యక్షులైన వాళ్లు రచయితల కన్నా రాజ్యాంగ జ్ఞానం కలవాళ్లు, రాజ్యాంగాన్ని, ఆదేశిక సూత్రాలను, ప్రాథమిక హక్కులను నిర్వచించే, వ్యాఖ్యానించే సామర్థ్యం కలవాళ్లయ్యారు. క్రమంగా విరసం ప్రాతినిధ్యం తగ్గుతూ వచ్చింది. విరసం మాత్రమే కాకుండా చంద్రపుల్లారెడ్డి నాయకత్వంలోని ఎం.ఎల్. పార్టీ రాష్ట్ర స్థాయి నాయకులు కూడ కనీసం ఆరుగురు మొదట ఏర్పడిన ఎపిసిఎల్‌సి కార్యవర్గంలో ఉన్నారు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత వరంగల్‌లో జరిగిన మహాసభల్లో పిడిఎస్‌యు బాధ్యతలు కూడ వదులుకొని పూర్తికాలం ఎపిసిఎల్‌సి కి పనిచేసిన సంసిద్ధతతోనే ప్రదీప్ కార్యదర్శి అయ్యాడు.

అయినా '83లో బాలగోపాల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కాగానే ప్రదీప్ స్వచ్ఛందంగానే ఎపిసిఎల్‌సిలో తన ప్రమేయాన్ని తగ్గించుకున్నాడు. నాకు, కాశీపతికి బాలగోపాల్ చేసిన సూచన నచ్చింది. శత్రువు ఏమన్నప్పటికీ '83 తర్వాత ఎపిసిఎల్‌సి రెండు ఎం.ఎల్. పార్టీల ఉమ్మడి అవగాహన వేదికగా కాకుండా ఒక స్వతంత్ర రాజ్యహింసా వ్యతిరేక హక్కుల వేదికగా రూపొందడం ప్రారంభమైంది.

**కనుక హక్కుల ఉద్యమంలో 83 నుంచి 87 వరకు బాలగోపాల్ ఎపిసిఎల్‌సి ని ఒక స్వతంత్ర హక్కుల సంఘంగా నడపాలని అనుకుంటూనే చాల దృఢంగానూ, స్థిరంగానూ దానిని రాజ్యహింస వ్యతిరేక వేదికగానే నిర్వహించాడు.** అందుకు కనీసం రెండు సందర్భాలు పేర్కొనాలి. ఢిల్లీ, పరిసర రాష్ట్రాల్లో ఇందిరాగాంధీ హత్య తర్వాత జరిగిన సిక్కుల హననంపై రజనీ కొఠారీ నాయకత్వంలోని సిడిఆర్, సుదేశ్ వైద్ కార్యదర్శిగా ఉన్న పియుడిఆర్ 'హూ ఆర్ ది గిల్టీ' అని ఒక నిజ నిర్ధారణ సమగ్ర గ్రంథం వెలువరించారు. సిక్కుల హననానికి, వాళ్ల గృహదహనాలకు, స్త్రీలపై అత్యాచారాలకు బాధ్యులని సాక్ష్యాధారాలు ఉన్న వ్యక్తుల జాబితా చివరన ఇచ్చారు. ఆ పుస్తకం దేశంలోను, విదేశాల్లోను వేల సంఖ్యలో అమ్ముడయి, పంజాబ్ మిలిటెంట్లు ఆ జాబితాలోని ఒకరిద్దరు ప్రముఖులను చంపేసారు. దానితో రజనీ కొఠారీ, సుదేశ్ వైద్‌ల ప్రాణాలకు అభద్రత ఏర్పడింది. 'హూ ఆర్ ది గిల్టీ' రెండవ ముద్రణకు రెండవ ముందుమాట రాస్తూ మిలిటెంట్ల హింసా చర్యలను కూడా ఖండించారు. ఆ నేపథ్యంలో డా. సుదేశ్ వైద్ వరంగల్‌కు వచ్చింది. డాక్టర్ రామనాథం గారి క్లినిక్ పై గదిలో ఎపిసిఎల్‌సి క్రియాశీల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. 'రాజ్యహింస'ను తప్ప, 'ప్రైవేట్ హింస'ను హక్కుల సంఘంలో ఖండించవద్దని, ప్రైవేట్ హింసకైనా, ఒకరు 'టెర్రరిస్టు'గా మారడానికైనా రాజ్యహింసయే ప్రేరకమవుతుందని గట్టిగా వాదించినవారు డాక్టర్ రామనాథం, బాలగోపాల్‌లే. అందులోను బాలగోపాల్ ఒక అవగాహన (కాన్సెప్ట్)ను కూడా ఇంగ్లిష్‌లో సమర్థంగా పెట్టగలడు గనుక ఎపిసిఎల్‌సి అవగాహనను '85 తొలిరోజుల్లోనే పియుడిఆర్ ముందుంచిన వాడు ఆయనే.

85 సెప్టెంబర్ 3న డాక్టర్ రామనాథం హత్య జరిగిన తర్వాత మర్నాడే సెప్టెంబర్ 4న హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో మీడియా ముందు మాట్లాడినపుడు ఆయన మాట మాత్రానికైనా ఎస్.ఐ. యాదగిరి రెడ్డి హత్యను ఖండించలేదు. పైగా ఎస్.ఐ. యాదగిరి రెడ్డి దురంతాల జాబితా అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. అట్లని సమర్థించాడని కాదు. వరంగల్ మిల్ కాలనీ సి.ఐ. ఇంటిపై రాడికల్స్ బాంబు వేసాక (జనవరి 18, 1985) అప్పటి ఎంఎస్సీ విద్యార్థి కత్తి మోహనరావు 'ఆ చర్య గురించి మీరేమను కుంటున్నారు' అని అడిగాడు. 'నేనేమనుకోవడమో, తప్పొప్పుల దృష్టితో కాదు ఇది చూడాల్సింది. పోలీసు ఒక వ్యవస్థితమైన క్రూర సంస్థ. మీరు రాజకీయ నాయకులను చంపినా అధికారం నుంచి ఒత్తిడి ఉంటే తప్ప పోలీసులు పట్టించుకోరు. పట్టించుకోక తప్పనపుడయినా కొందరు రాజకీయ నాయకుల విషయంలో మీ చర్యలు పోలీసులకు సంతోషంగానే ఉంటాయి. కాని మీరు పోలీసులనే ముట్టుకుంటే వాళ్లు ఊరుకోరు. పంజాబ్ మిలిటెంట్ల అనుభవంతో చెప్తున్నాను' అన్నాడు. బహుశా చివరి దాకా ఈ విషయంలో ఆయన అవగాహన అదే. కె.ఎస్. వ్యాస్, పరదేశినాయుడు హత్యలను ఖండించిన హక్కుల సంఘం నాయకులు ఉండవచ్చు. హనుమకొండ పోలీసు స్టేషన్‌లో బాంబులు పేలడాన్ని ఖండించిన వాళ్లు ఉండవచ్చు. ఆ సందర్భాల్లో బాలగోపాల్ స్పందించలేదు. లక్ష్మణానంద, బుద్ధదేవ్ భట్టాచార్యల సందర్భాల్లో కూడా చర్యలుగా వాటిని ఖండించలేదు. ఆ తర్వాత పరిణామాలు ఊహించారా అని మాత్రమే ప్రశ్నించాడు.

ఇందులో నుంచి వచ్చిందే ఆయన 'అనుద్దిష్ట వ్యక్తి'ని చంపినపుడు ఖండించాలనుకుంటున్నాను అని '87లోనో '88లోనో ఏర్పరుచుకున్న అభిప్రాయం. అది చెప్పే ముందు '87లో కూడ 'ప్రైవేట్ హింస' పట్ల ఆయన అవగాహన గురించిన ఒక ముఖ్యమైన సందర్భం రాయాలి. 87-88 దాకా కూడ 'ప్రైవేట్‌హింస'ను ఖండించాలనే విషయంలో పియుసిఎల్ ఎం.వి. రామమూర్తి గారితో బాలగోపాల్ వివాద పడుతుండేవాడు. రాజ్యహింసను మాత్రమే ఖండించాలంటుండే వాడు. కరీంనగర్ జిల్లా అంబాల దగ్గర గూడూరు అనే గ్రామంలో భూస్వామి, ఎంఎల్ఎ కూడా అయిన కేశవరెడ్డిని పీపుల్స్ వార్ దళం చంపింది. దానిని ఖండించాలని, నిజ నిరూపణకు వెళ్లాలని రామమూర్తిగారు ఎపిసిఎల్‌సికి ప్రతిపాదించారు. రామమూర్తి, అడ్వొకేటు ప్రతాపరెడ్డి, కాళోజీ మొదలైన వాళ్లు వెళ్లారు గానీ బాలగోపాల్ ఎపిసిఎల్‌సి కలిసి రామన్నారు.

అయితే '87లోనో '88 లోనో నిజామాబాద్ జిల్లాలో బస్సులో ఒక ఇన్‌ఫార్మర్‌ను చంపబోయి పీపుల్స్ వార్ దళ సభ్యుడు కండక్టర్‌నో, మరొకరినో చంపాడు. దానిని బాలగోపాల్ ఖండించాడు. 'అనుద్దిష్ట వ్యక్తి'ని అంటే లక్ష్యం కాని వ్యక్తిని చంపినపుడు ఖండించాలని అనుకుంటున్నాను అన్నాడు అప్పుడు. 'అమాయకులు' అనే మాట ఆయన ఈ అనుద్దిష్ట వ్యక్తులకు, సాధారణ ప్రజానీకానికే ఆ తర్వాత కాలంలో వాడుతూ వచ్చాడు. అయితే నరేంద్రనాథ్ సంస్మరణ సభలో ఈ అనుద్దిష్ట, అమాయక విశేషణాలతో 'హింస'ను ఆమోదించడం కూడ సరియైంది కాదని నరేంద్రనాథ్ గట్టిగా వాదించే వాడని, తాను కన్విన్సు అయ్యానని కాకుండా, గమనించవలసిన ఒక అభిప్రాయంగా ప్రస్తావించాడు.

ఈ 'అనుద్దిష్ట', 'అమాయక' లక్ష్యాలను చంపడం సరియైంది కాదనే అభిప్రాయం రాను రాను ఒక అవగాహనగా మారింది. ఎన్‌కౌంటర్ల విషయంలో కూడ పట్టుకొని చంపిన నక్సలైట్ల విషయంలో ఆ సమయంలో వాళ్లు ఆయుధాలు కలిగి ఉండి, కాల్చారా లేదా అనే దానికన్నా, అవకాశం ఉంటే వాళ్లు కాల్చేవారు కాదా అనే దృష్టితోనే ఆలోచించడం ప్రారంభించాడు. జాతీయ మానవ హక్కుల కమిషన్ ముందు ఆయన ఎపిసిఎల్‌సి కార్యదర్శిగా సమర్పించిన 350 పైగా ఉన్న ఎన్‌కౌంటర్ హత్యల జాబితాలో చేసిన వింగడింపు చూస్తే ఈ అవగాహన స్పష్టంగా అర్థమవుతుంది. జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఈ అవగాహన ఆమోదం అయింది గనుకనే, ఎన్నడూ ఏ కేసులో నిందితులు కూడా కాని, ఎన్నడూ సాయుధులని ఆరోపించబడని ఐదు 'ఎన్‌కౌంటర్'లలోని హతుల విషయంలో హత్యానేరం నమోదు చేయాలని సూచించింది.

కారంచేడు సంఘటన తర్వాత ఆయన రాజ్యహింసను మాత్రమే కాకుండా ఆధిపత్య హింసను కూడా ఖండించే ఎజెండాను ఎపిసిఎల్‌సి కోసం చేపట్టాడు. ఈ ఎన్‌కౌంటర్ల జాబితాలో ఆయన బడుగు, దళిత వర్గాల ప్రాతిపదికపై కూడా వింగడింపు చేసాడు. కారంచేడు నాటి నుంచి ఒరిస్సా, కర్ణాటకల దాకా కూడా ఆయన అగ్రవర్ణ హింసను, హిందుత్వ హింసను, ఆధిపత్య హింస గానూ, రాజ్యహింస గాను పరిగణిస్తూ వచ్చాడు గనుకనే ఆ విషయం వచ్చే వరకు రాష్ట్ర పరిధిని కూడా దాటాడు. ఆయన సంఘ పరివార్‌ను గానీ, హిందుత్వను గానీ రాజ్యం బయటి శక్తులుగా చూడలేదు. ఆ పరిభాష వాడినా వాడకున్నా సామ్రాజ్యవాదానికి దోహదపడే శక్తులుగా చూసాడు. ఆయన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అభివృద్ధి నమూనాను ఎంత విధ్వంస నమూనాగా చూసాడో, హిందుత్వ ఆచరణను అంత విధ్వంస నమూనాగా చూసాడు.

ఈశాన్య రాష్ట్రాలకు, కాశ్మీరుకు ఉన్న స్వయంనిర్ణయాధికారాన్ని గౌరవిస్తూనే కాశ్మీరు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒక హిందూ రాజ్యంగా - కాశ్మీరు ప్రజలను ముస్లింలుగా చిత్రించి జెనొసైడ్ ఆచరిస్తున్నది గనుకనే దానినొక 'దత్తత' తీసుకున్న దేశం వలె ప్రేమించాడు. 'నేను తరచూ వెళ్లే ఒకే ఒక్క విదేశం' అన్నాడు. ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసులపై సాల్వాజుడుం, పారా మిలిటరీ దాడులను, దౌర్జన్యాలను ఖండించినా ఆ రాజ్యహింసకు మూలకారణమైన కంపెనీల ఎం.ఒ.యు.ల గురించి మాత్రం ఆంధ్రజ్యోతిలో రాసిన ఆఖరి వ్యాసంలో తప్ప ఎక్కువగా ప్రస్తావించలేదు. అంతకన్న ఎక్కువగా మావోయిస్టుల 'అతిహింస' వివరాలు రాయడంలో సమయాన్ని వెచ్చించాడు.

ఒక పార్టీ, ఒక నిర్మాణం బలంగా ఉన్నపుడు వాటిపై జరిగే రాజ్యహింస కన్న బలహీనంగా ఉన్న పార్టీ, నిర్మాణాలపై జరిగే రాజ్యహింసను ముందుగా పట్టించుకోవాలనే అవగాహనను కూడా

(తరువాయి పేజీ 23లో)

# హక్కుల పరిభాషను వ్యాప్తిచేసిన 'స్వేచ్ఛ'ను తీర్చిదిద్దిన బాలగోపాల్

యం. కోదండరామ్

స్వేచ్ఛపత్రిక పౌరహక్కుల స్పృహను కలిగించడంలో చాలా ముఖ్యమైన పాత్ర వహించింది. అప్పటివరకు హక్కులనగానే అందరికీ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల అధ్యాయం మాత్రమే గుర్తుకు వచ్చేవి. కానీ హక్కులు పోరాటాల నుండి ఉద్భవిస్తాయని, పోరాటాల వల్లనే అమలులోకి వస్తాయన్న అవగాహనను స్వేచ్ఛ పత్రిక కలిగించింది. ఇంకొక విషయమేమిటంటే వివిధ ఘటనలపై హక్కుల దృక్పథం నుండి వ్యాఖ్యానించి స్వేచ్ఛ హక్కుల పరిభాషను వ్యాప్తి చేసింది.

పౌరహక్కుల సంఘం స్వతంత్రమైన సంస్థగా రూపుదిద్దుకుంటున్న తరుణంలోనే స్వేచ్ఛ పత్రిక ఏర్పడింది. 1981లో ఇది గోడపత్రికగా మొదలైంది. వరంగల్, హైదరాబాద్ నగరాలలో ముఖ్యమైన బస్‌స్టాప్‌లలో ఈ పత్రికను వేసేవాళ్ళం. సెక్రటేరియట్ ఎదురుగా ఎల్.ఐ.సిని ఆనుకొని ఉన్న బస్‌స్టాప్‌లో ఈ పత్రికను బాగా చదివే వాళ్ళు. ప్రతి వారానికొకసారి స్వేచ్ఛ అని పైన అచ్చువేసిన న్యూస్‌పేపర్ సైజు కాగితంపైన పౌరహక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఘటనలపై రాసి అంటించేవాళ్ళం. అప్పట్లో జిరాక్స్ లేదు. కనుక ప్రతి గోడపత్రికను చేతితోనే రాయవలసి వచ్చేది. ఎప్పుడైనా పనిబడి ఆలస్యం అయితే ఎల్.ఐ.సి, సెక్రటేరియట్ ఉద్యోగస్తులు పత్రిక రాలేదని అడిగేవాళ్ళు. అట్లా 1980లో మొదలై 1988 దాకా గోడపత్రిక నడిచింది.

పని ఒత్తిడి పెరగడంతో ఆపైన గోడపత్రిక ఆగిపోయింది. అప్పుడే పత్రిక అవసరమన్న ఆలోచన అందరిలోనూ వచ్చింది. పౌరహక్కుల భావనను వ్యాప్తి చేయడానికి కొత్త కార్యకర్తలను తయారు చేసుకోవడానికి పత్రిక ఉపయోగపడుతుందన్న ఆలోచనతోనే జూలై 1984లో స్వేచ్ఛ పత్రికను ప్రారంభించాము. హక్కుల సంఘం స్వతంత్రంగా పనిచేయాలన్న నిర్ణయానికి వచ్చినాము. కనుక ఆ సంఘం తరపున భావవ్యాప్తికి ఒక పత్రిక అవసరమేనని అనుకున్నాం.

ఆ పత్రిక లోగోను జయధీర్ తిర్మల్‌రావు గారు ఆకర్షణీయంగా డిజైన్ చేయించి ఇచ్చినారు. పత్రికలో రావలసిన ప్రధాన శీర్షికల రూపకల్పనలో బాలగోపాల్ ముఖ్యపాత్ర వహించారు. రిపోర్టులే కాక ముఖ్యమైన సమస్యలపై అవగాహన కల్పించడానికి వ్యాసాలు, హక్కుల ఉద్యమ చరిత్రలో ప్రాముఖ్యమైన ఘట్టాలపై చరిత్ర వ్యాసం మొదట పత్రికలో ఉన్న అంశాలు ఆ తరువాత సంఘం కార్యకలాపాలపై నివేదికలను వార్త శీర్షికలో వేయాలని నిర్ణయించాము. ప్రతీ సంవత్సరం మొదటి సంచికలో ఆ క్రితం సంవత్సరం జరిగిన హక్కుల ఉల్లంఘన ఘటనలపై వివరాలను వేసేవాళ్ళం. ప్రతి సంచికలో ఇతర రాష్ట్రాల హక్కుల సంఘాల నివేదికలను పొరుగు రాష్ట్రాల నివేదిక రూపంలో అచ్చువేసే వాళ్ళం. తెలుగులో ఏ పత్రిక తేవాలన్నా ప్రధాన సమస్య రాసేవాళ్ళ కొంత రాసేవాళ్ళు కూడా అందరూ రాయరు. కనుక ఒకరిద్దరి పైన మొత్తం భారం పడేది. స్వేచ్ఛకు ఎక్కువ రిపోర్టులు వ్యాసాలు రాసేది బాలగోపాల్. అయితే ఎవరి పేరు పెట్టవద్దని నిర్ణయించడం వలన ఈ విషయం గుర్తింపులోకి రాలేదు. రాయడమే కాక పత్రికను ఎడిట్ చేయడంలోనూ, అచ్చువేయించడంలోనూ బాలగోపాల్ ప్రధాన పాత్ర పోషించాడు.

బాలగోపాల్ కృషి వలన స్వేచ్ఛకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. 1990 దాకా సంచికలో రిపోర్టులకు ప్రాధాన్యత ఉండేది. పౌరహక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అనేక ఘటనలపై నిజనిర్ధారణ కమిటీలు సేకరించిన సమాచారం ఆధారంగా నివేదికలు రూపొందేవి. బాలగోపాల్ రాష్ట్రమంతటా తిరిగేవాడు కనుక ఎక్కువగా రిపోర్టులు ఆయనే తయారు చేసేవాడు. 1986 తరువాత హక్కుల సంఘాల కార్యక్రమాల పరిధి పెరిగింది. మారుతున్న పరిస్థితిని బట్టి పత్రిక స్వభావం కూడా మారిపోయింది. జరుగుతున్న అనేక ఘటనలపై ముఖ్యంగా మతకల్లోలాలపై రిజర్వేషన్లపై తలెత్తిన వివాదాలపై, మతతత్వంపై స్త్రీలపై ఇంటాబయటా జరిగే దాడులపైన హక్కుల దృక్పథం నుండి విశ్లేషించి వివరణాత్మకమైన వ్యాసాలు రాయవలసి వచ్చింది.

ఈ దశలో బాలగోపాల్ ఎక్కువగా వ్యాసాలు రాసిండు. రిజర్వేషన్లపైన, హిందూమతతత్వంపైన రాసిన వ్యాసాలు చాలామంది చదివారు.

స్వేచ్ఛపత్రిక పౌరహక్కుల స్పృహను కలిగించడంలో చాలా ముఖ్యమైన పాత్ర వహించింది. అప్పటివరకు హక్కులనగానే అందరికీ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల అధ్యాయం మాత్రమే గుర్తుకు వచ్చేవి. కానీ హక్కులు పోరాటాల నుండి ఉద్భవిస్తాయని, పోరాటాల వల్లనే అమలులోకి వస్తాయన్న అవగాహనను స్వేచ్ఛ పత్రిక కలిగించింది. ఇంకొక విషయమేమిటంటే వివిధ ఘటనలపై హక్కుల దృక్పథం నుండి వ్యాఖ్యానించి స్వేచ్ఛ హక్కుల పరిభాషను వ్యాప్తి చేసింది.

1990 ఆరంభం నుండి అన్ని సంఘాలు, సంస్థలు తమ సమస్యలను హక్కుల దృక్పథం నుండి చూసి, హక్కుల పరిభాషలో వ్యక్తం చేస్తున్నాయి. ఆ పరిణామానికి స్వేచ్ఛ పత్రిక దోహదపడింది.

*(1984లో 'స్వేచ్ఛ' ప్రారంభమయినప్పటి నుండి 1998 వరకు కోదండరాం 'స్వేచ్ఛకు' సంపాదకులు)*

# భారతదేశంలో కులం పౌరహక్కుల సమస్యగా గుర్తింపచేయడంలో బాలగోపాల్

కె. సత్యనారాయణ

రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలని దళితులపై అత్యాచారాలుగా అర్థం చేసుకోవాలని, ఈ ఆందోళనలు అగ్రకులాల వాళ్ళు తమ అహంకారాన్ని, ఆధిపత్యాన్ని ప్రదర్శించటానికే చేస్తున్నారని, వారు చెప్పులు కుట్టడం, వీధులు ఊడ్వడం లాంటి పోరాటరూపాల ద్వారా దళితుల్ని కించపరుస్తున్నారని, కాబట్టి సారాంశంలో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు దళిత వ్యతిరేక ఆందోళనలే అని అన్నారు. ఈ అప్రజాస్వామిక ఆందోళనకు అండగా ఎపిసిఎల్సి నిలవనక్కర లేదన్నారు. అలాగే, రిజర్వేషన్లు ఒక ప్రజాస్వామిక హక్కని ఆ హక్కు దళితుల పోరాటాల వల్ల వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు.

కె.బాలగోపాల్ హక్కుల ఉద్యమంలో కులసమస్యని పౌరహక్కుల సమస్యగా గుర్తించడం, ఆ అవగాహనని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రణాళికలో, ఆతరువాత మానవ హక్కులవేదిక లక్ష్యాలలో చేర్చడం ఒక గొప్ప ప్రజాతంత్ర కృషిగా గుర్తించాల్సిన అవసరంవుంది. దళితులపై అంటరానితనం, వివిధ రకాల వివక్షలకు వ్యతిరేకంగా, దళితులకు, ఓ.బి.సి.లకు రిజర్వేషన్లకోసము, వారికి రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కుల సాధనకోసం బాలగోపాల్ చేసిన కృషి చాలా గొప్పది. దళిత, పీడిత కులాల హక్కులకోసం బాలగోపాల్ కృషిని గుర్తించడం, ఆయన కులసమస్యని పౌరహక్కుల సమస్యగా వ్యాఖ్యానించి హక్కుల ఉద్యమంలో ఎజెండాగా చేర్చిన అవగాహనను ఆచరణలో పెట్టడమే బాలగోపాల్కు సరైన నివాళి అవుతుంది.

"పౌరహక్కుల సమస్యగా కులం"అనే అంశంపై బాలగోపాల్ 1996లో బెంగుళూరులో పీపుల్స్ డెమొక్రాటిక్ ఫ్రంట్(PDF) సమావేశంలో ప్రసంగించారు. ఆ ప్రసంగంలో ఆయన పౌరహక్కుల సమస్యగా కులసమస్యను గుర్తించడానికి గల నేపథ్యాన్ని, చరిత్రను వివరించారు. 1985లో కారంచేడులో దళితుల మారణకాండ జరిగింది. కమ్మకుల దురహంకారులు దళితవాడపై పడి మూకుమ్మడి హత్యాకాండ జరిపారు. ఎ.పి.సి.యల్.సి తరపున నిజనిర్ధారణ కమిటీ కారంచేడు మారణకాండపై పరిశీలన చేసి, ప్రకటన ఇచ్చింది. ఆ ప్రకటనలో "భూస్వాములు హరిజనులపై"చేసిన దాడిని ఖండిస్తూ, హంతకుల్ని ప్రభుత్వం అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. ఆ తరువాత కొద్దిరోజులకే వరంగల్లో కొందరు రెడ్డి కులానికి చెందిన విద్యార్థులు, 'తమ గ్రామంలో రెడ్డి కులస్థులపై, దళితులు దాడి చేసారని', బాలగోపాల్ గారు నిజనిర్ధారణకు రావాలని కావాలనే అడిగారు. 'భూస్వాములకు పోలీసుల, ప్రభుత్వ అండదండలుంటాయి, దళితులు పేదవారు కాబట్టి వారికోసం ఎపిసిఎల్సి మాట్లాడుతుందని' బాలగోపాల్ జవాబు చెప్పారు. అయితే, ఈ జవాబు సరపోదని, కారంచేడు దళితుల ఊచకోతను కేవలం రాజ్య అణచివేతగా చూస్తే సరిపోదని అపుడు దళిత ఉద్యమం లేవనెత్తిన ప్రశ్నల సందర్భంలో అర్థమయింది. దళిత ఉద్యమం మానవ మర్యాద, ఆత్మ గౌరవం అనే కొత్త ప్రశ్నల్ని ముందుకు తెచ్చింది. ఈ దేశంలో కొన్ని ప్రజాసమూహాల్ని పౌరులుగా కాదుగదా, కనీసం 'మనుషులుగా'సమాజం గుర్తించడం లేదు. మనుషులుగా గుర్తింపులేక, ఊరికి దూరంగా బతుకుతూ, అంటరానితనానికి , అత్యాచారాలకు, కనీస మానవ మర్యాదకు, గౌరవానికి గుర్తింపుకు నోచుకోని దళిత కుల ప్రజలు, సామాజికంగా వెనుకబడి, వివక్షకు గురవుతున్న ఓ.బి.సి.కులాలప్రజలు కనీసం "పౌరులు"గా పరిగణించబడటం లేదు. అలాంటి ప్రజా సమూహాల్ని, సామాజిక వర్గాల్ని అణచివేతకు, హక్కుల ఉల్లంఘనకు గురి చేసే ఆధిపత్య వ్యవస్థగా భారతదేశంలోని కులవ్యవస్థనూ, దానిని భావజాలపరంగా బలపరిచే బ్రాహ్మణీయ సంస్కృతినీ గుర్తించాల్సిన అవసరం వుందని ఎపిసిఎల్సి గుర్తించి, 1991లో తన ప్రణాళికలో కులసమస్య పౌరహక్కుల సమస్యగా చేర్చటం జరిగింది. అలాగే, 1986లో తెలుగుదేశం ప్రభుత్వం ఓ.బి.సిలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేయగానే అగ్రకుల విద్యార్థుల నుంచి రిజర్వేషన్ల వ్యతిరేక వుద్యమం వచ్చింది. ఆ సందర్భంలో అగ్రకుల విద్యార్థులు "తాము ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీలు తీస్తుంటే, మాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందనీ, ఎపిసిఎల్సిని తమ హక్కులు కాపాడాలని అడిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ తీసే హక్కు ప్రజాస్వామిక హక్కే. అయితే ఈ అగ్రకుల విద్యార్థులు పీడిత కులాలకు వ్యతిరేకంగా ఈ ప్రదర్శనలు, ర్యాలీలు చేస్తున్నారు. ఈ జటిలమైన ప్రశ్నకు బాలగోపాల్ అప్పట్లో తను రాసిన ఒక వ్యాసంలో జవాబు చెప్పారు. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలని దళితులపై అత్యాచారాలుగా అర్థం చేసుకోవాలని, ఈ ఆందోళనలు అగ్రకులాల వాళ్ళు తమ అహంకారాన్ని, ఆధిపత్యాన్ని ప్రదర్శించటానికే చేస్తున్నారని, వారు చెప్పులు కుట్టడం, వీధులు ఊడ్వడం లాంటి పోరాటరూపాల ద్వారా దళితుల్ని కించపరుస్తున్నారని, కాబట్టి సారాంశంలో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు దళిత వ్యతిరేక ఆందోళనలే అని అన్నారు. ఈ అప్రజాస్వామిక ఆందోళనకు అండగా ఎపిసిఎల్సి నిలవనక్కర లేదన్నారు. అలాగే, రిజర్వేషన్లు ఒక ప్రజాస్వామిక హక్కని ఆ హక్కు దళితుల పోరాటాల వల్ల వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. రిజర్వేషన్లని ఉద్యోగాల సమస్యగా, విద్యాహక్కు సమస్యగా చూడటం సరైంది కాదని అంటూ, రిజర్వేషన్లను కులవ్యవస్థ సృష్టించిన అసమానతల నేపథ్యంలో చూడాలని అన్నారు. కులవ్యవస్థ కారణంగా వివిధరంగాలలోకి ప్రవేశంలేక సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు రిజర్వేషన్లు కల్పించడం అంటే ఈ దేశంలో సమానత్వాన్ని పెంపొందించే చర్యగా చూడాలన్నారు. అందుకే, రిజర్వేషన్లు కుల ప్రాతిపదికపై వుండాలని చాలా గట్టిగా వాదించారు. కుల ప్రాతిపదికను నీరుగార్చే ఆర్థిక ప్రాతిపదిక, 'క్రిమిలేయర్'లాంటి భావనల్ని ఆయన తీవ్రంగా

వ్యతిరేకించారు.

కారంచేడు, చుండూరు లాంటి అనేక మారణకాండలను వ్యతిరేకిస్తూ ఆయన విస్తృతంగా ప్రచారం చేసారు, రాసారు. కోస్తా ఆంధ్రాలో హరిత విప్లవ కారణంగా వ్యవసాయరంగంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో కొత్తగా వచ్చిన నయా ధనిక వర్గమైన కమ్మ కులస్థులు, ఇతర శూద్ర అగ్రకులాల భూస్వామ్యవర్గం, విద్యా, ఉద్యోగరంగాల్లో ఎదుగుతున్న దళితుల్ని చూసి, ఓర్వలేక చేసిన దాడులుగా, ఆధునిక హింసగా అర్థం చేసుకోవాలన్నారు. చుండూరులో ప్రత్యేకకోర్టులు 13 ఏళ్ళ తర్వాత రెడ్డిహంతకులకి శిక్షలు పడడానికి బాలగోపాల్ చాలా కృషిచేసారు. చుండూరు రెడ్డి హంతకులు లేవనెత్తిన రకరకాల న్యాయవివాదాల్ని బాలగోపాల్, కన్నభిరన్‌లు హైకోర్టులో వాదించి, విచారణకు అడ్డంకులు తొలంగించారు.

దళిత కులాల మధ్య ఎస్.సి రిజర్వేషన్లు అనుభవించడంలో వచ్చిన వివాదంపై బాలగోపాల్ స్పష్టమైన వైఖరి తీసుకుని, ఎస్.సి రిజర్వేషన్ల వర్గీకరణ ప్రజాస్వామికమైన చర్యగా ఆయన వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు వర్గీకరణ చట్టాన్ని కొట్టివేసిన సందర్భంగా, సుప్రీంకోర్టు దళితకులాల మధ్య అసమానతల్ని చూడనిరాకరించడం సామాజిక వాస్తవాన్ని చూడనిరాకరించడమేనని ఆయన సుప్రీంకోర్టుని తీవ్రంగా వ్యతిరేకించాడు. అలాగే, ఓ.బి.సి.రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు న్యాయసూత్రాలు, రాజ్యాంగ సూత్రాల పరిధిలో కాకుండా, న్యాయమూర్తులు తమ భావజాలకోణం నుంచి తీర్పులు చెపుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం కేంద్రీయవిద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేచట్టంపై సుప్రీం కోర్టు తన పరిధి దాటి మాట్లాడిందని, అగ్రకులాలకు 100 శాతం దాటి సీట్లు వచ్చేలా చేసిందని అన్నారు. మొత్తంగా సుప్రీంకోర్టు అగ్రకులాల ఆధిపత్యాన్ని కాపాడే సంస్థగా మారిందని విమర్శించారు.

హక్కులరంగంలో అంబేద్కర్ రచనలు, ప్రతిపాదనల్ని ఆయన ముఖ్యమైనవిగా భావించారు. ఈ దేశంలో కులం ఆధారంగా ఆస్తి, విద్య, అధికారాలలో వాటా నిర్ణయింపబడుతున్నదని, అందుకే కులం నిర్మూలన జరగాలని, అంబేద్కర్ చేసిన వాదనలు హక్కుల ఉద్యమాల అవగాహనలో భాగం కావాలని వాదించారు. ముఖ్యంగా 'ప్రతిమనిషికీ ఒకే విలువ'అన్న ప్రజాస్వామిక సూత్రాన్ని అంబేద్కర్ నుంచి నేర్చుకోవాలని బాలగోపాల్ తన చివరి రోజుల్లో బలంగా ప్రతిపాదించారు.

బాలగోపాల్ భౌతికంగా మనమధ్య లేకపోయినా ఆయన ఆచరణ, అవగాహన మనముందువున్నాయి. దళితులు, ఓ.బి.సిలు తదితర పీడిత కులాల గురించి, వారి హక్కుల గురించి, వారికి ఒక కొత్త సమాజంకోసం బాలగోపాల్ చేసిన కృషిని గుర్తిద్దాం. గౌరవిద్దాం. ఆయన అవగాహనను ముఖ్యంగా 'కులం పౌరహక్కుల సమస్య'అన్న అవగాహనను మనం ఆచరిద్దాం. ఇదే. ఆయనకి నివాళి.

**సత్యానారాయణ, అధ్యాపకులు,**

EFLU, హైదరాబాద్.

(పేజీ 20 తరువాయి భాగం)

ఆయన ముందు నుంచీ అమలు చేసాడు. రవూఫ్ నాయకత్వంలోని నక్సలైట్ల ఎన్‌కౌంటర్‌లతో మొదలుపెట్టి రాను రాను దొంగల పేరుతో, రౌడీల పేరుతో ఎన్‌కౌంటర్ అయ్యే వారి విషయం, అసంఘటిత రంగంలో ఉన్నవారి హక్కుల అణచివేత విషయం ఎక్కువ పట్టించుకున్నాడు.

చలపతి, విజయవర్ధనరావుల ఉరిశిక్షల రద్దు గురించి పూనుకొని, చొరవ చూపినపుడు నాగభూషణ్ పట్నాయక్ అయినా, భూమయ్య, కిష్టాగౌడ్‌లైనా నక్సలైట్లు గనుక నక్సలైట్లు, కొన్ని రాజకీయ పార్టీలయినా పట్టించుకున్నాయి గానీ ఈ ఇద్దరూ ఏ నిర్మాణంలో లేని వ్యక్తులు. అందులోను దళిత, బడుగు వర్గాల వాళ్లు అని భావించాడు. 'నోరు లేని వాళ్ల'ను పట్టించుకోవాలన్న ఈ వ్యగ్రత రాను రాను బలమైన ఉద్యమాలలోని 'చీకటి కోణాలు' ఎత్తి చూపే అసహనానికి దారి తీసినట్లున్నది. నక్సలైట్లు, ప్రత్యేకించి పీపుల్స్‌వార్ చేసే మంచి పనులు చెప్పడానికి చాలామంది ఉన్నారు, (వాళ్ల విషయంలో చాల వ్యంగ్యంతో కూడిన విశేషణాలు కూడా వాడాడు) నేను కేవలం 'చీకటి కోణాలు' చూపే పనే పెట్టుకుంటానన్నాడు.

అయితే స్పెయిన్ అంతర్యుద్ధం, రెండో ప్రపంచ యుద్ధం కాలాల నుంచి ఇవ్వాటి వరకు సాయుధ పోరాటాల, వర్గ పోరాటాల అండ, నాయకత్వం, నేపథ్యం లేకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అయినా, మనవంటి దేశంలో రాజ్యాంగంలో రాను కున్న హక్కులయినా లభించాయా?

బాలగోపాల్ వంటి వాళ్లు దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో బయట చేపడుతున్న ఆదివాసుల హక్కుల పరిరక్షణ ఆశయాలు - నూటా ఏభై ఏళ్లుగా దేశంలో ఆదివాసులు రాజ్యంపై, కేంద్రంపై ప్రధానంగా చేసిన, చేస్తున్న సాయుధ పోరాట ఫలితాలు కావా? ఆదివాసులకు అడవిపై హక్కునిచ్చే వన్ ఆఫ్ సెవెన్టీ శ్రీకాకుళ రైతాంగ పోరాట ఒత్తిడి వల్ల వచ్చింది కాదా? బైలదిల్లా తర్వాత ఇవ్వాటికీ ఛత్తీస్‌ఘడ్‌లోకి ఒక్క బహుళజాతి కంపెనీ అయినా, బడా కంపెనీ అయినా ప్రవేశించలేక పోయాయంటే అక్కడ గత పాతికేళ్లుగా పీపుల్స్‌వార్ ప్రతిఘటన ప్రధాన కారణం కాదా? వర్గపోరాటమే ప్రజాస్వామిక హక్కుల సాధనకు కూడ చోటు (స్పేస్) కల్పిస్తుందనే అవగాహన పై బాలగోపాల్‌కు రాను రాను విశ్వాసం సన్నగిల్లుతూ వచ్చింది. చిన్న చిన్న సమస్యలు, చిన్న చిన్న పోరాటాలు, చిన్న చిన్న పరిష్కారాలు తప్ప ఆదర్శ సమ సమాజం అనుమానమే - కనుక విలువలు, ప్రమాణాలు నిజాయితీగా నిలుపుకునే ప్రజాస్వామిక ఉద్యమాలు చేపడదామనే దిశగా పయనించాడు. అది గాంధీజీ వంటి అహింసా మార్గం కూడా కాకపోవడం వల్ల సత్యాగ్రహాల, నిరాహార దీక్షల అలకలకు బెదరింపులకు కూడా అవకాశం లేకుండా పోయింది. తన నిజాయితీ వల్ల, ఆచరణ వల్ల ఆయన హక్కుల ఉద్యమానికి అసాధారణమైన గుర్తింపు తెచ్చాడు గానీ, ప్రజాస్వామిక హక్కులు నిజంగానే వర్గపోరాటేతర శక్తుల వల్ల సాధించబడి పరిరక్షింప బడుతాయని చరిత్రలో ఇప్పటివరకయితే రుజువు కాలేదు.

(వివి ఎపిసిఎల్‌సి వ్యవస్థాపక సభ్యుడు, 1985 వరకు కార్యవర్గ సభ్యులు)

# చరిత్ర మలిచిన నిత్య చలనశీలి బాలగోపాల్

- బి. రామకృష్ణ

*నిరంతర అధ్యయనం, సామాజిక విషయాలపై ఎప్పటికప్పుడు లోతైన విశ్లేషణలు, పల్లె పల్లెకు, వెళ్ళి ప్రజలతో మాట్లాడటం, నిర్భీతిగా పోలీసులతో, పాలకులతో పోట్లాడేతత్వం, పొగడ్తలకు విమర్శలకు లొంగక తాను విశ్వసించిన దాని కొరకు తుదకంటూ నిలబడటంలాంటి ఉన్నత విలువలను తనలో నింపుకుని కదిలిన బాలగోపాల్ నుండి ఈ సమాజం ఎంతో నేర్చుకోవాల్సిఉంది.*

ప్రపంచ సమాజంలో ప్రభావశక్తులుగా తక్కువ మంది ఎదుగుతారు. వారి చింతన,కార్యాచరణ సమాజంలో నుండి సమాజంపైకి విస్తరించి దాన్ని చలింప చేస్తూ, కుదిపేస్తూ, నిత్యచైతన్యాన్ని నింపుకుంటూ బలమైన ముద్రలు వేసుకుంటూ పోతుంది. ఒక్కో సామాజిక దశలో, చారిత్రిక సందర్భాల్లో సమాజం తనలో పరివర్తన కొరకు బహుకొద్ది మందిని ఉత్పత్తి చేస్తుంది. మానవీయ విలువలను విధ్వంసంచేసేవారిని,వాటిని సమున్నతంగా ఎత్తిపట్టేవారిని, పరస్పర వైరుధ్యాలను ఏక కాలంలో అస్థిత్వంలోకి తెస్తుంది సమాజం. అసలు సమాజమే వైరుధ్యాల పుట్ట. ఆ వైరుధ్యాలు ఎలా పరిష్కరింపబడతాయనేది ముఖ్యమైనది. ఈ ప్రక్రియ నిరంతరమైనది. ఒకటి పరిష్కరింపబడితే మరొకటి, అదిపరిష్కరింప బడితే ఇంకొకటితలెత్తి మానవసమాజం ఉన్నత మానవీయ విలువల కొరకు పరుగులు, నడకలు, నత్తనడకలు, గెంతులలో ఏదో ఒకటి లేదా కొన్నింటితో ముందుకు సాగిపోతుంటుంది. అలాంటి సామాజిక పరిణామ క్రమంలో అస్థిత్వంలోకి వచ్చిన ఉన్నతమానవుడు బాలగోపాల్.

సామ్రాజ్యవాదం విస్తరిస్తున్న సమయంలో, అది సకల మానవాళికి పెనుముప్పై వినాశనం వైపుగా కదులుతున్న సందర్భంలో సరిగ్గావ్యతిరేకంగా సాగిపోయిన వ్యక్తి బాలగోపాల్, సామాజిక చలన సూత్రాలను అర్థం చేసుకుంటూ, వాటికి నిత్య అనుభవంలో పుటం పెడపుతూ సత్యాన్వేషణ గావించిన మేధోసంపన్నుడు బాలగోపాల్.

ఎంతోమంది అంతరంగాలను స్పృశిస్తూ, కదిలిస్తూ, సాగిపోయిన, సాగిపోతున్న చరిత్ర సృష్టించిన సృజనశీలి. తాను ఎంచుకున్న మార్గంలో లోతుల్లో కెళ్ళి, మరింతగా లోలోతుల్లో చేరి విభిన్న శైలితో కదిలి పోయిన చెరగని ముద్ర అతనిది. గ్రామస్థాయినుండి జాతీయస్థాయిలో హక్కుల ఉద్యమ చైతన్యాన్ని ఎత్తిపట్టినవాడు. నక్సలైట్లను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపడాన్ని వెలుగులోకి తెచ్చే క్రమం నుండి పౌరహక్కుల ఉద్యమాన్ని సమాజంలోని భిన్న ఆధిపత్యాలను హక్కుల దృక్కోణంలో విశ్లేషించాడు. అది కులం, మతం, కరువు, ఫాక్షనిజం, లాకప్ మరణాలు, పురుషాధిక్యత, వరకట్న చావులు ఏవైనా సరే మానవ హక్కుల ఉల్లంఘనలో వాటి పాత్రను ఫోకస్ చేసాడు. వాటిని వెలుగులోకి తేవడంతోపాటు హక్కుల ఉద్యమ పరిధి విస్తృతికి ఓ రకంగా కేంద్రబిందువయ్యాడు. ఆ క్రమంలో సమాజం నుండి హక్కుల ఉద్యమంపైకి వస్తున్న అనేక సవాళ్లకు సమర్థవంతంగా సమాధావం చెప్పగలిగాడు. రాజ్యాంగంలోని విలువలైతేనేమి, సామాజిక రాజకీయ ఉద్యమాల ప్రజాస్వామిక ఆకాంక్షలకు, డిమాండ్‌లకు మద్దతు కూడ గట్టే ప్రయత్నంలో హక్కుల ఉద్యమానికి తాత్విక ఆధారాలను ఆవిష్కరించే దిశలో తీవ్రంగా కృషి చేసాడు.

వ్యక్తిగత, సామాజిక విలువలు, బాధ్యతలు, సృజనాత్మక ఆలోచనలు, తాత్విక చింతనలు, మేధోపర విశ్లేషణలు, వృత్తిపరమైన నిజాయితీ, కుటుంబపర విలువలు, నిబద్ధత, నిరాడంబరత్వం, సాధారణ మనిషి, అసాధారణ అరుదైన వ్యక్తిత్వం. కార్యకర్త, నాయకుడు, మేధావి, సమాజంలోని ఉన్నత విలువలు అన్నింటిని ఒకచోట చేరిస్తే అందులో నుండి అలలు అలలుగా, తెరలు తెరలుగా కదలాడుతూ కనిపించే చిత్రమే బాలగోపాల్, నిజంగా ఇదెంత ఆశ్చర్యం చరిత్రలో ఒక అద్భుతం.

నిరాడంబరత్వం, నిజాయితీ,తన ఆలోచనలకు కార్యరూపం ఇవ్వడంలో కనపరిచిన అనన్య సామాన్యమైన కార్య దక్షత,దీక్ష అతన్ని ఇంట్లో కూర్చోనివ్వలేదు. కుర్చీ మేధావిగా మిగలనివ్వలేదు. కడుపులో కుండ కదలకుండా మేధో విశ్లేషణలు చేయనివ్వలేదు. రాతకాడుగా, మాటలకారుడిగా, మీడియా మేధావిగా అతన్ని కట్టి పడేయలేదు. వీటన్నింటిని అధిగమిస్తూ పల్లె పల్లెకూ హక్కుల ఉల్లంఘనలకు గురౌతున్న జన సమూహాల వద్దకు చేరిపోయేవాడు. మితభాషిగా అనిపించేవాడు కాని, జనం మనస్సుల్లో ఎప్పుడూ మాట్లాడేవాడేనేమో అనిపిస్తుంది. అలా కాకుంటే హక్కుల ఉల్లంఘనలు జరిగినపుడు ఎందరికో ఎందుకు బాలగోపాల్ గుర్తుకొస్తాడు? అమితమైన మేధో సంఘర్షణలతో సమస్యల మూలాలను వెతకడంలో నిత్య కృషీవలుడయ్యాడు.

ప్రజల మధ్య ప్రజలకొరకు సాగిపోయిన సాధుజీవి, నిర్బంధాలు తరుముకొచ్చి, చుట్టు ముట్టినప్పటికీ వాటిని అధిగమిస్తూ అపహాస్యం చేశాడు. ఎవరెస్టు శిఖరమై తనపై దాడులను లెక్క చేయలేదు. అతిసాధారణంగా కనిపించే అసాధారణ ప్రతిభాశీలి. కిడ్నాప్‌కు గురై, పోలీసుల దాడులు ఒకవైపు, అక్రమకేసులు, జైళ్లు, తన సహచరులు జాపాలక్ష్మరెడ్డి, గోపిరాజన్న, రామనాథం, ప్రభాకర్ రెడ్డిల హత్యలు అన్ని తన ముందే, తన చుట్టే జరుగుతున్నప్పటికీ వెనుకడుగు వేయలేదు. మరింత కార్యోన్ముఖుడిగా ముందుకు పయనించాడు. అందువల్లనే నేడు అతడు ఒక బలమైన హక్కుల గొంతుకగా

అందరినీ ఒప్పించగలిగాడు. తన సిద్ధాంతపర ఆలోచనలతో విభేదించే సోదర హక్కుల సంఘాలు, విభిన్న నేపథ్యాల సామాజిక రాజకీయ ఉద్యమాలు, నిత్యం తనను వ్యతిరేకించే పోలీసు అధికారులు, పాలకవర్గ ప్రతినిధులు సహితం అతన్ని అభిమానిస్తున్నారు, గౌరవిస్తున్నారు అంటే, అతని ఆచరణ నిబద్ధతలకు అది తిరుగులేని సాక్ష్యం.

తన ఆలోచనల వట్ల స్పష్టత కలిగి, నిత్య అధ్యయనం, ఆచరణతో ప్రజల మధ్య నిరాఘాటంగా నిబద్ధతతో పని చేసుకుంటూ పోయాడు. తక్కువ మాట్లాడినా, ఎంత అవసరమో అంతే మాట్లాడే మాటల పొదుపరి. ఎక్కువ మాట్లాడి సమయం వృధా చేయడం అతనికి ఇష్టం ఉండేది కాదేమో. ఆ సమయంను అధ్యయనానికో, మరింత సృజనశీల ఆలోచనలకో కేటాయించుకునే వాడేమో! అంతర్ముఖుడిగా, ముభావంగా కనిపించే బాలగోపాల్ పకపకా నవ్వడాన్ని స్వయంగా చూసిన అనుభవం నాకున్నది. తస్లీమానస్రీన్‌పై మజ్లిస్ ఎమ్మెల్యేలు చేసిన దాడికి వ్యతిరేకంగా 'మహిళా చేతన'వారు హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సభను ఏర్పాటు చేసారు. అందులో బాలగోపాల్ ఒక వక్త. నేను మాట్లాడుతూ అర్థం లేని సంప్రదాయాలు ఎంత తెలివి తక్కువగా ఉంటాయో చెపుతూ ఒక హాస్యంతో కూడిన కథను చెప్పాను. అది విన్న బాలగోపాల్ పక పకా నవ్వడం చూసాను. బాల్‌గోపాల్ జోకులు వేస్తాడని, నవ్వుతాడని మిత్రులు అంతకుముందే చెప్పిన మాటలు నిజమని నాలో నేను అనుకున్నాను.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో అమరులపై ఒక డాక్యుమెంటరీ తీసే సందర్భంలో బాలగోపాల్‌ను కలిసాను. అప్పుడు అతనిలో మధ్యతరగతి తండ్రిని, అతను పాటించే ఖచ్చితమైన టైంసెన్స్‌ను ప్రత్యక్షంగా చూశాను. రెండేళ్ల క్రితం 11.10.2007న బాలగోపాల్‌ను వీడియో ఇంటర్‌వ్యూ చేయడానికి ఆయన ఇంటికి వెళ్లాను. సాయంత్రం ఆరు గంటలకనుకుంటా రమ్మన్నాడు. ఎంత సమయం పడుతుంది అని అడిగితే ఒక గంట పట్టొచ్చు అన్నాను. నన్ను ఇంతవరకు ఎవరూ గంటసేపు ఇంటర్‌వ్యూ చేయలేదు. అంత సమయం పట్టదులే అన్నాడు. ఎ.పి.సి.ఎల్.సి రాష్ట్ర కార్యదర్శి శేషయ్య, మరియు ప్రొఫెసర్ హరగోపాల్‌ల ఆలోచనలను పంచుకుని రూపొందించుకున్న ప్రశ్నలు. నా వద్ద చాలానే ఉన్నాయి. త్వరగా వెళితే సమయం కలిసి వస్తుందను కుని 30 నిమిషాల ముందుగానే వెళ్లాను. కూర్చోమని చెప్పి లోపలికి వెళ్లాడు. కాని సరిగ్గా ఆరుగంటలకే వచ్చాడు. ఆ సమయంలో అతని కొడుకుచే తెలుగుపాఠం చదివించడం విన్నాను. అక్షరాలు, పదాలను వత్తి పలికిస్తున్నాడు. ఉచ్చారణ దోషాలను సవరిస్తూ బోధిస్తున్నాడు. అప్పుడు ఆ అబ్బాయి పరీక్షలకు సిద్ధమవుతున్నాడని బాలగోపాల్ మాటల్లోనే తెలుసుకున్నాను. మధ్య తరగతి తల్లి తండ్రుల వలె తన కుమారున్ని చదివించుకోవడం చూసి నేను ఒకింత ఆశ్చర్యపోయాను. 1991లో వరంగల్‌లో పోలీసు మూకలచే కాల్చిచంపబడ్డ ఎ.పి.సి.ఎల్.సి. నాయకుడు నర్రా ప్రభాకర్ రెడ్డి పేరులోని 'ప్రభాకర్'అర్థం వచ్చేలా తనకొడుక్కి ప్రభాత్ అని పేరు పెట్టుకున్నారని ఆరోజు బాలగోపాల్ చెప్పాడు. సరిగ్గా ఆరు గంటలకు ఇంటర్వ్యూ మొదలు పెట్టాం. నేను వేసిన ప్రశ్నలకు సూటిగా, స్పష్టంగా క్లుప్తంగా సమాధానాలు ఇస్తూ పోయాడు. అలా సరిగ్గా గంట దాటింది. ఇంటర్వ్యూ పూర్తయ్యాక మొత్తం మీద నీవు నాచేత గంటపాటు ఇంటర్వ్యూ తీసుకున్నావు కదా! అన్నాడు.

ఎ.పి.సి.ఎల్.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉంటూ వరంగల్ వీధుల్లో పోస్టర్లు వేసేవాడని విన్నపుడు మేధావులు సహితం పోస్టర్లు వేస్తారా? అని అనుకున్నాను. వక్తలుగా వచ్చేవారు. మేధోపన్యాసాలు చేసే వారు కిందిస్థాయి పనులు చేస్తారనేది నా అనుభవంలో ఇప్పటికీ కూడా అరుదైన విషయమే. నేను ఇంటర్, డిగ్రీ ఆపై చదువులు చదివే రోజుల్లో (1983-91)నన్ను అధికంగా ప్రభావితం చేసిన అతి తక్కువమందిలో బాలగోపాల్ ఒకరు. అతని ఉపన్యాసాలు వింటుంటే తొలుత అర్థం అయ్యేదికాదు. చాలా స్పీడ్‌గా మాట్లాడే మాటలను అందుకోవడం కష్టంగానే ఉండేది. ఎంతో సావధానంగా వింటే గానీ తెలిసొచ్చేది కాదు. అప్పటికే అతనికి మార్క్సిస్ట్ మేధావిగా పేరుంది. అతని సింప్లిసిటీ, ఆచరణ, పని విధానం గురించి మిత్రుల ద్వారా విని ఉండటం చేత అతనంటే గౌరవభావం ఏర్పడింది. ఒక రకంగా చెప్పాలంటే నాకు బాలగోపాల్ Inspirer. నేను 1997లో పౌరహక్కులసంఘంలో చేరినప్పటికీ బాలగోపాల్‌తో ప్రత్యక్షంగా సన్నిహితంగా మాట్లాడింది మాత్రం అతను మానవ హక్కుల వేదిక ఏర్పాటు చేశాకే. అతను ఎ.పి.సి.ఎల్.సిలో ఉన్నపుడు అతనితో కలిసి కొంతకాలమైనా పనిచేయలేక పోయాననే భావన నాలో ఉండిపోయింది. పని నిబద్ధతలో, కార్యాచరణలో, నిస్వార్థంలో, మేధో విశ్లేషణలలో, అధ్యయనంలో, వృత్తి నిబద్ధత నిజాయితీల విషయంలో సీరియస్‌గా ఆలోచనలు వచ్చినపుడు నాకు స్ఫురణకు వచ్చే వ్యక్తి బాలగోపాల్. ఒకప్పుడు, ఇప్పుడు కాన్షెన్ కీపర్‌గా నిలిచిన బాలగోపాల్‌కు జోహార్లు.

నిరంతర అధ్యయనం, సామాజిక విషయాలపై ఎప్పిటికప్పుడు లోతైన విశ్లేషణలు, పల్లె పల్లెకు, వెళ్ళి ప్రజలతో మాట్లాడటం, నిర్భీతిగా పోలీసులతో, పాలకులతో పోట్లాడేతత్వం, పొగడ్తలకు విమర్శలకు లొంగక తాను విశ్వసించిన దాని కొరకు తుదకంటూ నిలబడటం లాంటి ఉన్నత విలువలను తనలో నింపుకుని కదిలిన బాలగోపాల్ నుండి ఈ సమాజం ఎంతో నేర్చుకోవాల్సిఉంది.

రాబోయే సంచికలో వరదలు ప్రకృతి భీభత్సం ప్రభుత్వ బాధ్యతపై ప్రత్యేక వ్యాసాలు ప్రచురిస్తున్నాము.

# ఎన్‌కౌంటర్ హత్యలు-న్యాయమైన ప్రశ్నలు

- CDRO(Co-ordination of Democratic rights Organisation)

## ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు, సెప్టెంబర్ 3-4,2009

24వ డాక్టర్ రామనాథం వర్ధంతి సందర్భంగా "రామనాథం స్మారక సభ" ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి), పీపుల్స్ యూనియన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్(PUDR) ఢిల్లీ ఆధ్వర్యంలో ఢిల్లీలో 3 సెప్టెంబర్, 2009 నాడు జరిగింది. ఈ సభలో "ఎన్‌కౌంటర్ హత్యలు, న్యాయమైన ప్రశ్నలు, మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మాజీ జాతీయ మానవ హక్కుల కమీషనర్ ఛైర్‌పర్సన్ జస్టిస్ జె.ఎస్.వర్మ ప్రసంగించారు. 4సెప్టెంబర్ 2009 నాడు "కోఆర్డినేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ ఆర్గనైజేషన్(సిడిఆర్‌వో)" దేశవ్యాప్త 20 పౌర, ప్రజాస్వామిక హక్కుల సమన్వయ ఐక్య కమిటి ఆధ్వర్యంలో రోజు రోజుకు దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఎన్‌కౌంటర్ హత్యలను నిరసిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాను నిర్వహించింది. ఈ ధర్నాలో MASS (అస్సాం), COHR (మణిపూర్), NPMHR (నాగాలాండ్), APCLC (ఆంధ్రప్రదేశ్), APDR (పశ్చిమబెంగాల్), AFDR (పంజాబ్), CPDR (మహారాష్ట్ర), PCHR (జమ్ముకాశ్మీర్), PUHR (హర్యానా), PUDR (ఢిల్లీ), PULL (జార్ఖండ్),రాజస్థాన్ సంఘాలు పాల్గొన్నాయి.

### జస్టిస్ వర్మ ఉపన్యాసం

285 ఎన్‌కౌంటర్లపై విచారణకు ఎపిసిఎల్‌సి వేసిన పిటిషన్ ఆధారంగా 1996లో జాతీయ మానవ హక్కుల కమీషన్ వెలువరించిన నిర్దేశికాలలో ఎన్‌కౌంటర్ హత్యలు జరిగినప్పుడు పాటించవలసిన విధివిధానాలను ప్రస్తావించారు. అట్లే ఫిబ్రవరి 2009లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అన్ని ఎన్‌కౌంటర్ హత్యలలో సంబంధిత పోలీసు సిబ్బందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపామని కోర్టుముందు నిరూపించు కోవాలని నిర్దేశించిందని తెలిపారు. కేవలం చట్టాలలో ఉన్నవిషయాన్నే కోర్టు మళ్ళీతన తీర్పులో ప్రకటించిందని తెలిపారు. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ పోలీసుల మనోస్థైర్యం దెబ్బతింటుంది. కాబట్టి మావోయిస్టుల సంఖ్య పెరుగుతుంది కాబట్టి దీని అమలును నిలిపివేయాలన్న సాకును పరిగణలోకి తీసుకుని ఏకపక్షంగా ఎక్స్-పార్టీ స్టేని సుప్రీంకోర్టు జారీ చేయడం ఆశ్చర్యాన్ని కలిగించిందని తెలిపారు. రంగనాథ్ మిశ్రా ఆర్డరు మరియు జస్టిస్ వెంకటాచలయ్యలు ఈ విషయంలో చాలా స్పష్టంగా ఆర్టికల్ 20,21 మరియు 14 కు సంబంధించిన విషయాలలో మధ్యంతర ఎక్స్-పార్టీ స్టేలు ఇవ్వడం సరైంది కాదని తెలిపినా సుప్రీం కోర్టు ఈ విధంగా వ్యవహరించడం బాధాకరం అని తెలిపారు. అట్లే 359 ఎమర్జెన్సీ ఆర్టికల్ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు. తీవ్రవాదం, అంతర్గత అభద్రత ఇవన్నీ సాకులే అని తెలిపారు. తర్వాత ఈ సభలో ప్రసంగించిన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ శేషయ్య ప్రసంగిస్తూ ఎపిసిఎల్‌సి 1980 తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని హైకోర్టులు మరియు ఇతర కోర్టుల్లో వేసిన వివిధ కేసులను గురించి చేసిన ఉద్యమాల గురించి ప్రస్తావించారు. శవాల స్వాధీనంకోసం, నిపుణుల ద్వారా రీపోస్టుమార్టం గురించి సంబంధిత అధికారులపై తీసుకోవలసిన చట్టపరమైన చర్యల గురించి, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం గురించి, కోర్టుల్లో హక్కుల న్యాయవాదులు, సంఘం చేసిన ఉద్యమాలను ప్రస్తావించారు. ఇది దేశవ్యాప్త హక్కుల సంఘాలకు, న్యాయవాదులకు ఒక మార్గదర్శకమని తెలిపారు. అట్లే కోర్టుల్లో,బయటా హక్కుల, ప్రజాసంఘాల ఉద్యమాల ప్రభావంతోనే ఫిబ్రవరి 2009లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విస్తృత ధర్మాసనం తీర్పునిచ్చిందని, ఇంకా చేయవలసింది ఎంతో వుందని తెలిపారు.

### సిడిఆర్ఓ సభ్య సంఘాల సమావేశము

భారత రాజ్యం, రాష్ట్రప్రభుత్వాలు ఎన్‌కౌంటర్ హత్యలలో ముద్దాయిలను, నేరస్థులను, రాజకీయ వ్యతిరేకులను, మావోయిస్టులను, మిలిటెంట్‌లను ప్రజా ఉద్యమాల సానుభూతి పరులను, కాశ్మీరీలు ముస్లిమ్‌లు మరియు ఈశాన్య రాష్ట్రాల్లో జాతివిముక్తి పోరాటాలు చేస్తున్న జాతి వ్యక్తులను హత్యలుచేస్తూ బీభత్సం సృష్టిస్తూ నిరసనలను అణిచివేయ ప్రయత్నిస్తుంది. 2008లో న్యూఢిల్లీలోని జామియా దగ్గర బాట్లా హౌస్ దగ్గర అతీఫ్,సజీద్‌లను ఇండియన్ ముజాహిదీన్ పేర్లతో ఎన్‌కౌంటర్ చేయడం, 2009 జూలైలో మణిపూర్ ఇంఫాల్‌లో ఛూగ్‌ఖామ్ సంజిత్‌ను అందరి కండ్లముందునుండి ఎత్తుకెళ్ళి ఎన్‌కౌంటర్ కథ అల్లినా, దాదాపు ప్రతిరోజూ మావోయిస్టుల పేరుతో ఆంధ్ర, ఛత్తీస్‌ఘడ్, లాల్‌గఢ్ లాంటిచోట్ల, కాశ్మీర్‌లో మిటిటెంట్లపేరుతో జరుగుతున్నవి చూస్తూనే ఉన్నాం. ముఖ్యంగా రాజకీయ విశ్వాసాలు కలిగిఉన్నందుకే మావోయిస్టుల ఉద్యమం గల ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్‌లలో, అట్లే సైనికపాలనగల జమ్ముకాశ్మీర్, మణిపూర్, అస్సాం, నాగాలాండ్‌లలోనే ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యల పరంపర విచ్చలవిడిగాకొనసాగుతూ ఉందని సి.డి.ఆర్.వో గత చరిత్ర ఆధారంగా చెపుతూంది.

ఇప్పటి వరకు దేశంలో జరుగుతున్న ఎన్‌కౌంటర్లకు సంబంధించిన గణాంకాలు ప్రభుత్వం వద్ద లేవు. కాబట్టి ఖచ్చితంగా ఒక సంవత్సరంలో ఎంతమంది చంపుతున్నామనే లెక్కలు లేవు. ఉదాహరణకు 2007NCRB రిపోర్టు ప్రకారం 'బూటకపు ఎన్ కౌంటర్ల'పట్టికలో పోలీసులచేతిలో 10 జరిగినట్టుగా చాలా తక్కువ సంఖ్యని ఇచ్చింది. ఈ పదింటిలో కూడా పోలీసులకు ఎవరికీ శిక్షపడలేదు. ఇదే NCRB రిపోర్టులో 'పోలీసు ఫైరింగులు', 'బందిపోటు వ్యతిరేక కాల్పులు', 'తీవ్రవాద వ్యతిరేక కాల్పులు'అనే రెండు విభాగాలు చేసి చాలా అసమంజసంగా వాటిని వ్రాసి వాటిసంఖ్య 334 మరియు 183 జరిగాయని తెలిపారు. ఇవి కేవలం పోలీసు ఆపరేషన్లే, ఇందులో ప్రాణాలొదిలిన బాధితులకు సంబంధించిన సంఖ్య ఎక్కడా ఇవ్వలేదు. బూటకపు ఎన్‌కౌంటర్లంటే సమాజంలో ఉన్న వ్యతిరేక అభిప్రాయాన్ని గమనించే జరిగిన ఎన్‌కౌంటర్లలో నిజంగా జరిగినవి, బూటకపు ఎన్‌కౌంటర్లని విడదీసి అందులో బూటకపు ఎన్‌కౌంటర్ల క్రింద చాలా తక్కువ సంఖ్య

ఇవ్వడం, మిగతావన్నీ నిజంగా జరిగిన ఎన్‌కౌంటర్లని ఒక ఆమోదం పొందేందుకు చేసిన ప్రయత్నమే నిజానికి ఇవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లే అని సిడిఆర్‌వో ప్రకటిస్తుంది. ఈ ఎన్‌కౌంటర్లపై ఒక నిష్పాక్షిక విచారణ ఏదీ చేయకుండానే ఇలా ప్రకటించడం హాస్యాస్పదం. సాధారణంగా నడుస్తున్న విచారణ, కోర్టుల్లో విచారణ, శిక్షపడడం, మొదలైన విధానాల ద్వారా కాకుండా ఈ ఎన్‌కౌంటర్ అనే పేరుతో చంపడానికి అధికారాలను కట్టబెట్టి విచ్చలవిడిహింసకు పూర్తి లైసెన్సులివ్వడం ఒక నియంతృత్వ పోకడే తప్ప ప్రజాస్వామ్య విధానంకాదు. నిర్వచనం ప్రకారం 'ఎన్‌కౌంటర్' అనేపదం చట్టబద్ధపాలనకు వ్యతిరేకం, అట్లే న్యాయసూత్రాలకు కూడా వ్యతిరేకం. రాజ్యం ఈ విధంగా చట్టవ్యతిరేకంగా ఎన్‌కౌంటర్ల రూపంలో, మాయం చేయడం ద్వారా హత్య చేయడం లాంటి పద్ధతులను వెంటనే నిలిపివేయాలి. చట్టబద్ధ పాలనను, రాజ్యాన్ని వ్యతిరేకించే కొన్ని సంఘాలు, ఉద్యమాలు ఈ విధంగా చేస్తున్నాయి, అనే నెపంతో రాజ్యం ఈ విధంగా చేయడం తన బాధ్యతను విస్మరించినట్టే. ఎందుకంటే చట్టబద్ధపాలన అమలుచేస్తానని రాజ్యాంగాన్ని, ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడేబాధ్యతను తాను నిర్వర్తిస్తానని ప్రతిజ్ఞచేసి అధికారాన్ని చేపట్టే బాధ్యతగల ఒక వ్యవస్థ ఈవిధంగా సాయుధసంఘాలతో పోలికపెట్టుకోవడం సిగ్గుచేటు.

రోజురోజుకి సైనికుల, ఆయుధాల సంఖ్యాపరంగా పెరుగుతూ ఉండటం జమ్మూకాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలతోపాటు కొన్ని ఇతర ప్రాంతాలలో సాయుధబలగాల ప్రత్యేక (అధికారాల)చట్టం అమలులో వుండి సాయుధబలగాలకు ఎవరు ప్రశ్నించలేని అధికారులుండడం, మొత్తం ప్రజల ప్రాణమంటే ప్రభుత్వాలకు ఎటువంటి బాధ్యత లేకుండా చేయడం నియంతృత్వమే ఇలా విచ్చలవిడి అధికారాలివ్వడం వల్లనే ఛత్తీస్‌ఘఢ్‌లోని సింగారంలో ఒకేరోజు 19 మంది గిరిజనులను చంపడమైనా, మణిపూర్‌లో కమెండో బలగాలు సంజిత్‌ను చంపడమైనా జరగడానికి కారణం, ఇలాంటివి ఇంకా ఎన్నో జరుగుతాయని ప్రభుత్వం ప్రజలనందరినీ బెదిరిస్తోంది.

ఎన్‌కౌంటర్ కేసుల్లో NHRC కాని, న్యాయవ్యవస్థ గానీ విఫలమైనాయి. కాబట్టి ఇంకా సాయుధబలగాలు పేట్రేగి పోతున్నాయని భావిస్తున్నది. ఒక్క ఉదాహరణలో చెప్పాలంటే జామియా మిలియాలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని చెబుతూ అనేక హక్కుల సంఘాల NHRCని, ఢిల్లీ హైకోర్టుముందు విన్నవించుకున్నా, పోలీసు నిర్ధారణలనే పరిగణలోకి తీసుకొని పోలీసులు ఏ తప్పుచేయలేదని నిర్ణయించడం చాలా దురదృష్టకరం.

దేశవ్యాప్తంగా వున్న అనేక హక్కుల సంఘాలు నిరంతరం ఎన్‌కౌంటరు హత్యలను ఆపాలని,సాయుధబలగాలను జవాబుదారీ తనంగా వ్యవహరించేట్టుగా చేయాలని బాధిత కుటుంబాలకు సరియైన నష్టపరిహారం అందించాలని రాజ్యం బాధ్యత వహించాలని ఎన్నోసార్లు డిమాండులు చేసినప్పటికీ ప్రభుత్వం దీనిపట్ల స్పందించడంగానీ, అనుకూలంగా వ్యవహరించడంగానీ చేయడం లేదు. 13 సంవత్సరాల క్రితమే ఏపిసిఎల్‌సి వేసిన కేసులో NHRC చాలా స్పష్టంగా అన్ని ఎన్‌కౌంటర్‌కేసులలో సంబంధిత అధికారులపై కేసు నమోదు చేసి కోర్టులో విచారణ జరపాలని స్పష్టంగా చెప్పింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా ఇదే తీర్పునిచ్చింది. కానీ సుప్రీంకోర్టు మాత్రం ఈ తీర్పును నిలిపివేస్తూ విచారణ చేపడుతున్నపేరుతో ఎన్‌కౌంటర్ల కేసుల్లో విచారణ చేసి కేసు మూసివేయాలనే ప్రస్తుత అమలును కొనసాగించాలనే మధ్యంతర ఉత్తర్వులను ఇవ్వడం అనేక సంశయాలకు కారణమౌతుంది.

ఈ విధంగా భారతదేశ అత్యున్నత న్యాయస్థానమే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు అమలును ఆంధ్రప్రదేశ్ పోలీసు, అధికారాల సంఘం పిటిషన్ ఆధారంగా భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేసే విధంగా చట్టాతీత హత్యలకు అంగీకారం తెలపడం చట్టబద్ధ పాలనకు రాజ్యాంగ స్ఫూర్తికే వ్యతిరేకమని సి.డి.ఆర్.వో. భావిస్తుంది.

**సిడిఆర్‌వో డిమాండ్స్**

1. సత్వరమే దేశవ్యాప్తంగా NHRC విధి విధానాలను, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును అమలు పరచాలి.
2. NHRC విధివిధానాలు నిర్ణయించిన 1996 నుండి జరిగిన అన్ని ఎన్‌కౌంటర్లలో బాధ్యులైన అధికారులు, సిబ్బందిపైసత్వరమే కేసు రిజిస్టర్ చేసి న్యాయవిచారణ జరిపేట్టుగా అందరు ముఖ్యమంత్రులను ఆదేశించాలి.
3. సాయుధ బలగాలను తృప్తి పరచేందుకు చేసే విచ్చలవిడి సైనికీకరణను వెంటనే ఆపివేయాలి.
4. వెంటనే సాయుధ బలగాలకు విచక్షణారహిత అధికారాలనిచ్చే సాయుధబలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చేయాలి.
5. దేశవ్యాప్తంగా జరిగిన ఎన్‌కౌంటర్ల గణాంకాలను ప్రభుత్వం నిర్వహించాలి.

**సిడిఆర్‌వో సభ్యసంఘాలు**

1. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్(ఎఎఫ్‌డిఆర్,పంజాబ్)
2. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి)
3. అసోషియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్(ఎపిడిఆర్,పశ్చిమబెంగాల్)
4. బంధీ ముక్తి మోర్చా(పశ్చిమబెంగాల్)
5. కమిటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ (సిపిడిఆర్,నాగ్‌పూర్)
6. కో-ఆర్డినేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ (సిఓహెచ్ఆర్, మణిపూర్)
7. మానవహక్కులవేదిక(హెచ్.ఆర్.ఎఫ్, ఆంధ్రప్రదేశ్)
8. లోక్‌షాహి హక్ సంఘటన్(ఎల్.హెచ్.ఎస్, మహారాష్ట్ర)
9. మానవ్ అధికార్ సంగ్రామ్ సమితి(మాస్, అస్సాం)
10. నాగా పీపుల్స్ మూవ్‌మెంట్ ఫర్ హ్యూమన్ రైట్స్ (ఎన్.పి.ఎం.హెచ్.ఆర్)
11. ఆర్గనైజేషన్ ఆఫ్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ (ఒపిడిఆర్, ఎ.పి.)
12. పీపుల్స్ కమిటీ ఫర్ హ్యూమన్ రైట్స్(పి.సి.హెచ్.ఆర్, జమ్మూ, కాశ్మీర్)
13. పీపుల్స్ డెమోక్రటిక్ ఫోరం (పిడిఎఫ్, కర్నాటక)
14. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్, నేషనల్)
15. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్,ఛత్తీస్‌ఘఢ్)
16. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్, జార్ఖండ్)
17. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్, నాగ్‌పూర్)
18. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్, రాజస్థాన్)
19. పీపుల్స్ యూనియన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్(పియుడిఆర్, ఢిల్లీ)
20. పీపుల్స్ యూనియన్ ఫర్ హ్యూమన్ రైట్స్(పియుహెచ్ఆర్, హర్యానా)

# సెప్టెంబర్ 17న, అక్టోబర్ 1న దంతెవాడ జిల్లాలో భద్రతాదళాలు చేసిన హత్యలపై నిజనిర్ధారణ నివేదిక

సెప్టెబర్ 17న గాచనపల్లిలోను, అక్టోబరు 1న గోంపాడ, చింతగుహ గ్రామాలలో భద్రతా బలాలు చేసిన హత్యలపై ఇంతవరకు ప్రచార సాధనాలకు సరియైన సమాచారం ఇవ్వలేదు. అక్టోబరు 1వ తేదీన అరెస్టు చేసిన యువకులకు సంబంధించిన సమాచారం కూడా లేదు. ఈ ఆపరేషన్ తరువాత జరిగిన దోపిడీలు, దహనాలు, చిత్రహింసల సమాచారం కూడా బయటకు పొక్కలేదు. ప్రజల తమ ఇళ్ళను వదలి పారిపోయి అడవులలో పాకలు వేసుకొని జీవిస్తున్నారనే విషయాన్ని ఎవరూ గమనంలోనికి తీసుకోవటంలేదు. వాస్తవమేమిటంటే భద్రతా బలగాలు (కోబ్రా, స్థానిక పోలీసు, ఎస్.ఓ.లు, సాల్వా జుడుం నాయకులు) గ్రీన్ హంట్ ఆపరేషన్‌లో వందలాది యువకులను అదుపులోనికి తీసుకోవటంకాక, దోపిడీలకు, గృహదహనాలకు, హత్యలకు పాల్పడిన విషయాన్ని బయట ప్రపంచం దృష్టికి రాకుండా జాగ్రత్తపడుతున్నారు. వాస్తవాలను సేకరించడానికి 15 మందితో కూడిన నిజ నిర్ధారణ బృందం దంతెవాడ ప్రాంతాన్ని అక్టోబర్ 10, 12 తేదీలలో సందర్శించింది. ఈ బృందంలో పి.యు.సి.ఎల్. (ఛత్తీస్‌ఘడ్), పి.యు.డి.ఆర్. (ఢిల్లీ), వన్‌వాసి చేతనా ఆశ్రమ్ (దంతెవాద), హ్యూమన్ రైట్స్‌లా నెట్‌వర్క్ (ఛత్తీసగఢ్), ఏక్షన్ ఎయిడ్ (ఒరిస్సా), మన్నా అధికార్ (మల్కాన్‌గిరి) మరియు జిల్లా ఆదివాసీ ఎక్తా సంఘ్ (మల్కాన్‌గిరి) ఉన్నారు. ఈ బృందానికి మొదట అనుమతి లభించలేదు. డోర్నపాల్, ఎర్రబోరు పోలీసు క్యాంపులలో పలుమార్లు ప్రశ్నించారు. ఈ బృందం నేంద్రగ్రామంలో ఒక రాత్రి బసచేసి బాధితులను, సాక్షులను కలుసుకొని సమాచారాన్ని సేకరించింది. తరువాత దంతెవాడ జిల్లా కలెక్టర్‌తోను, ఎస్.పి.తోను మాట్లాడటం జరిగింది.

పూర్తి నివేదిక తయారవుతున్నది. ఈలోగా ప్రాముఖ్యత గలిగివ విషయాలను ప్రస్తావిస్తున్నాం.

### సెప్టెంబర్ 17, 2009 :

**1. గాచనపల్లి హత్యలు :** సెప్టెంబరు 17వ తేదీ ఉదయం భద్రతా బలగాలు 6 గురు గ్రామస్తులను చంపివేశారు. డబ్బై సంవత్సరాల వయస్సు గల దుధి మొయిన వక్షోజాలు కోసి, తరువాత చంపారు. భద్రతా బలగాలను చూసిన వెంటనే ఆమె కుటుంబ సభ్యులందరూ పారిపోయారు. కావాసిగంగ (70)ను ఆమె మంచంపైనే చంపివేశారు. అడవిలోనికి పారిపోయిన ఆమె కుటుంబ సభ్యులే ఆమె భౌతికకాయాన్ని కనుగొన్నారు. మాద్వీదేవ (25)ను చెట్టుకుకట్టి కాల్చి చంపారు. అతని తాత ఈ ఘటనకు సాక్షి. అతని మృతదేహం దొరకలేదు. మాద్వి (జోగా), మాద్వి హద్మ (35), మడకం సుల్లాలను పొడిచి చంపారు. మడకం సుల్లా భార్య ఎదురుగానే ఈ హత్యలు జరిగాయి. మాద్వి జోగా పొలం దున్నుకుంటూ ఉండగా, బట్టలూడదీసి చంపారు. అన్ని ఇళ్ళపైనా దాడిచేసి తగులబెట్టారు. ఈ కుటుంబాల సభ్యులందరూ అడవిలోకి పారిపోయి తలదాచుకున్నారు. లేదా బంధువుల ఇళ్ళకు వెళ్ళారు. చాలా మంది ఇతరులు తమ ఇళ్ళను భద్రతా బలగాలు తగలబెట్టడంతో ఇదేవిధంగా తలదాచుకున్నారు.

**2. మాద్వీదేవ :** సింగనపల్లి గ్రామానికి చెందిన ఈ యువకుడు 17వ తేదీ ఉదయం కుటుంబ పని మీద బయలుదేరాడు. అతను తిరిగి రాకపోవటంతో అతని కుటుంబ సభ్యులు వెదకడం ప్రారంభించారు. రెండు రోజుల తరువాత భద్రతా బలగాలు అతనిని చంపివేశాయన్న వార్తను వేరే గ్రామ పటేల్ తెలియజేశాడు. చింతగుట్ట పోలీస్ స్టేషన్ ఆవరణలో అతని మృతదేహం పడివున్నది.

**3. వేడినూనెలో కాల్చుట :** ఒంథొర్‌పర గ్రామానికి చెందిన ముచకీదేవ (60) సెప్టెంబర్ 17 ఉదయం పశువులను మేపుకుంటున్నాడు. భద్రతా బలగాలు అతనిని పట్టుకొని కొడుతూ గ్రామంలోనికి ఈడ్చుకువెళ్ళారు. అతనిని ఒక చెట్టుకొమ్మకు తల్లక్రిందులుగా వేలాడదీశారు. చెట్టుకింద కుండలో నూనె మరిగించి అందులో అతనిని పడవేశారు. తరువాత బయటకులాగి చల్లటి నీళ్ళు చల్లారు. అతని శరీరం పైభాగం కాలిపోయింది. గాయాలలో పురుగులు పట్టాయి. అతను ఇంకా జబ్బుతోనే ఉన్నాడు. అతనికి ఎటువంటి వైద్య సహాయం అందలేదు. గ్రామాన్ని వదలి వెళ్ళటానికి అతను భయపడుతున్నాడు.

**4. కట్టి ఊరేగించినవారు :** ఆరుగురు గ్రామస్తులు (అందులో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు) కట్టివేసి గాచనపల్లి గ్రామ వీధుల గుండా నడిపించారు. భారీ వర్షాలు కురియటంతో వారు తప్పించుకుని పారిపోయారు.

**5. బలవంతంగా విస్థాపన చెందించుట :** హత్య చేయబడినవారి కుటుంబాలు, ఇళ్ళు తగులబెట్టబడిన వారి కుటుంబాలు గ్రామాల నుండి పారిపోయి అడవులలో తలదాచుకున్నారు. ఇతరుల పరిస్థితి కూడా ఏమంత మెరుగ్గా లేదు. భద్రతా బలగాల వారిని భయభ్రాంతులను చేస్తున్నారు.

### అక్టోబర్ 1, 2009 :

**1. గోంపాడ ఎన్‌కౌంటర్ :** గొంపాడలో అక్టోబర్ 1న ఎన్‌కౌంటర్ జరిగినట్లుగా దంతెవాడ ఎస్.పి. ప్రకటించాడు. భద్రతా బలగాలు 9 మంది గ్రామీణులను చంపివేశారు. భద్రతా బలగాలవైపు ఒక్కరు కూడా మరణించలేదు. వీరిలో నలుగురు ఒకే కుటుంబానికి చెందినవారు మాద్వి బజార్, ఆయన భార్య మాద్వ సుబ్బి, వారి కుమార్తెలు కర్తన్ కున్ని, మద్వి కుట్టి. వారిని అందరినీ పొడిచి

చంపారు. ఇద్దరు భదర్‌పాదర్ గ్రామానికి చెందిన ముబకి హందా, మరకు దేవా. వారు ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తూ, మాద్వి బజార్ ఇంట్లో ఆ రాత్రి బస చేశారు. ఇంకొక జంట సోయం సుబ్బా, సోయం జోగిని వారి ఇంట్లోనే చంపి వేశారు. 9 మృతదేహాలను గ్రామంలో వదిలివేశారు.

**2.** చింతగుఫలో తోమ్రే ముత్తా అను 45 ఏళ్ళ వృద్ధుడిని అతని ఇంట్లోనే పొడిచి, కాల్చి చంపారు. భద్రతాదళాలను చూడగానే తోమ్రే ముత్తా కుటుంబ సభ్యులతో కలిసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అడవులలో అతనిని కాల్చివేశారు. 10 మందిని ఖచ్చితంగా హత్య చేసి ఉంటారని ఈ బృందం నిర్ధారించింది. మరింత మంది చనిపోయి వుండవచ్చు. కాని అన్ని గ్రామాలతోనూ సంబంధాలు పెట్టుకోవటం సాధ్యం కాలేదు. ఆరోజు కోబ్రాలు, స్థానిక పోలీసులు గ్రామాలపై దాడి చేసినట్లుగా ఎస్.పి.యే ప్రకటించారు. ఎన్ని గ్రామాలమీద దాడి జరిగింది స్పష్టంగా తెలియలేదు.

**3.** మాద్వి బజార్ మనుమడిని కూడా వదలలేదు. అతనికి రెండేళ్ళు. అతని నాలుగువేళ్ళను నరికివేశారు. పళ్ళు ఊడగొట్టి నాలుకను కత్తిరించారు.

**4.** యాకుటింగ్, జనిటింగ్ గ్రామాలలోని 10 మంది యువకులను అక్టోబరు 1న తీసుకువెళ్ళారు. 8 మందిని ప్రేలుడు పదార్థాల చట్టం క్రింద అరెస్టు చేసినట్లుగా చూపించారు. వారు ప్రస్తుతం దంతెవాడ జైలులో ఉన్నారు. మరో ఇద్దరి ఆచూకీ తెలియటం లేదు. వారిని వెదుకుతూ వెళ్ళిన మహిళలను కుంటి పోలీసు స్టేషన్‌లో వేధించారు. తెల్లకాగితాలపై వేలిముద్రలు తీసుకున్నారు. రెండురోజుల తర్వాత మళ్ళీ తిరిగివస్తే మీవాళ్ళ ఆచూకీ చెప్తామని అన్నారు.

**5. గృహదహనాలు, ఆస్తి దోపిడి :** భద్రతా దళాలు 9 దోపిడీలకు, గృహదహనాలకు పాల్పడినట్లుగా ఈ బృందం దృష్టికి వచ్చింది. సెప్టెంబరు 17న గృహ దహనాలు జరగగా, ఆ రోజున ఇళ్ళు దోచుకున్నారు. వాళ్ళ ధాన్యం, పప్పులు, ఇత్తడి పాత్రలు, కోళ్ళని పట్టుకుపోయారు.

**6.** వేధింపులు, చిత్రహింసలకు సంబంధించి గ్రామస్తులు అనేకం చెబుతున్నారు. గొంపాడ గ్రామంలో ఒక వ్యక్తిని విచారిస్తే, అతని కాలిలో కాల్చారు. అతని గాయం ఇంకా అలాగే ఉంది. చింతగుప్తా నుంచి ఒక వ్యక్తిని బంధించి తీసుకువెళ్ళి చిత్రహింసలు పెట్టి సాయంత్రం వదలిపెట్టారు.

**7.** పోలీసులు, సాయుధ దళాలతోపాటుగా, సాల్వా జుడం అయిన బొద్దు రాజా కూడా ఉన్నాడని ముకుద్ తింగ్ గ్రామస్తులు చెప్పారు. ఎస్.పి.ఓ.లు పాండె సోమా (ఫిందెగూడ గ్రామం), గంగ (ఉసరగూడ గ్రామం)లకు గొంపాడ గ్రామస్తులు గుర్తించారు.

**8.** చాలామంది అడవిలో తాత్కాలిక ఆవాసాలలో నివసిస్తున్నారు. పారిపోలేని వాళ్ళు గ్రామాలలోనే భయంతో గడుపుతున్నారు. బంధువులు వారి ఇళ్ళకు సరిచేసుకోవటానికి సహాయపడుతున్నారు.

ఈ బృందం కొన్ని గ్రామాలే సందర్శించగలిగింది. చాలా గ్రామాలలో ఆ రెండు రోజులలో హత్యలు జరిగినట్లుగా తెలుస్తోంది. సమాచారం లేకుండా కట్టుదిట్టం చేయడంతో ఏం జరుగుతోందో తెలియటం లేదు. భద్రతాదళాల ఆపరేషన్ వలన ప్రజలు గ్రామాలను విడిచి పారిపోతున్నారని మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. గ్రామాలలోనే నివసిస్తున్న వారి పరిస్థితి దారుణంగా ఉంది. సాల్వాజుడుం దాడుల కారణంగా పునరవాస చర్యలకు సంబంధించి సుప్రీంకోర్టు యిచ్చిన ఆదేశాన్ని ప్రభుత్వం పాటించటం లేదు. భద్రతాదళాల చర్య వలన కొత్త సంక్షోభం వచ్చింది. ప్రజలకు పునరావసం కల్పించవలసిన ప్రభుత్వం, మావోయిజాన్ని ఎదుర్కొనే పేరుతో పారామిలిటరీ దళాలను పంపి హత్యాకాండ సాగిస్తున్నది. ప్రజలను ఖాళీ చేయించే ప్రక్రియను వెంటనే నిలిపివేసి ప్రజలను వారి గ్రామాలలోనే నివసించే ఏర్పాటు చేయాలి.

**డిమాండ్స్ :**

1. సెప్టెంబర్ 17, అక్టోబరు 1వ తేదీలలో జరిగిన హత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించి, బాధ్యులైన వారిపై ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలి. హింస, అక్రమ నిర్బంధం, ఆస్తుల విధ్వంసాన్ని ప్రభుత్వం గుర్తించాలి. ప్రతి కేసుపైన ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలి. నష్టపరిహారం చెల్లించాలి.

2. హత్యలు, హింసాకాండ, దోపిడీలు, గృహ దహనాలపై స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలి. ఈ హత్యల వెనుకనున్న వాస్తవాన్ని బహిర్గత పరచాలి. ఈ రెండు రోజులలో జరిగిన ఆపరేషన్‌పై విచారణ జరపాలి.

3. సుప్రీంకోర్టు పునరావాసంపై యిచ్చిన ఆదేశాలను వెంటనే అమలు పరచాలి. ఆ రెండు రోజులలో జరిగిన భయానక సంఘటనల వలన ప్రజలు గ్రామాలు వదిలి పారిపోయారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు పరచకపోతే ప్రజలు వారి గ్రామాలలో నివసించలేరు.

4. సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేయడం, భద్రతాదళాల ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలి. పునరావాస చర్యలు లేకపోవడం, పెద్ద సంఖ్యలో పారామిలటరీ దళాలు అంత వెనుకబడిన ప్రాంతాల్లో ఉండడం, ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతాయనే భయాన్ని కలిగిస్తున్నది.

**- షర్మిలపురకాయస్థ, ఆశిష్‌గుప్త, హిమాంశుకుమార్**

నిజనిర్ధారణ బృందం తరఫున

# ఆదివాసులపై ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో సైనిక దాడిని అందరం ఒకటయి వ్యతిరేకిద్దాం!

**ప్రజల సార్వభౌమత్వం, మట్టిమీద, మనుషుల మీద ప్రేమ, మన వనరులపై హక్కు, కష్టజీవులపై గౌరవం కలవారందరూ బలపరచవలసిన న్యాయపోరాటంపై నక్సలైట్లను నిర్మూలించే సాకుతో కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు తలపెట్టిన అన్యాయ యుద్ధాన్ని నిలవరిద్దాం. న్యాయంతో కూడిన శాంతి కోసం ఉద్యమిద్దాం!! ప్రజలకూ, ప్రజాస్వామికవాదులకూ పిలుపు**

ఆదివాసులపై దాడిలో ఆఖరి నెత్తురుబొట్టు సైతం చిందించడానికి సిద్ధమని ప్రకటించాడు కేంద్ర గృహమంత్రి చిదంబరం. కేంద్ర గృహమంత్రి దేశ ఆంతరంగిక వ్యవహారాలు కూడా చూస్తాడు. అంటే రాష్ట్రాల శాంతిభద్రతలకు ఆయన సమన్వయ కర్త. కాని ఆయన మరొక దేశంపై యుద్ధం ప్రకటించే మిలిటరీ జనరల్ వలె మాట్లాడుతున్నాడు. 'ఆక్రమించుకుంటాం, అదుపుచేస్తాం, అప్పుడుగానీ అభివృద్ధి చేస్తాం' అని ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌ల విషయంలో అమెరికా సైన్యాధికారి ప్రయోగించిన మాటలనే యథాతథంగా మన దేశంలో అటవీ ప్రాంతాల విషయంలో చిదంబరం వల్లిస్తున్నాడు. ఛత్తీస్‌గఢ్‌లోని 'జంగిల్ వార్‌ఫేర్' స్కూల్‌లోని సైనిక నిపుణులు మావోయిస్టులను, ఇతర ఉద్యమకారులను అణచివేయాలంటే అమెరికన్ కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్‌లో భాగమైన 'చెరువులో నీళ్ళను తోడేసి చేపలను చంపడం' అనే విధానాన్ని అవలంబించాలని సలహాలిస్తున్నారు. వాస్తవంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు (ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒరిస్సా, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్) ఈ విధానాన్నే అమలుచేస్తున్నాయి.

ఇది మావోయిస్టుల సాకు, బూచి చూపి కేంద్ర ప్రభుత్వం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా మొదలుకొని ఉత్తరాంధ్ర, గోదావరి లోయవరకు ఉన్న అడవిపై, ఆదివాసులపై చేస్తున్న దాడి. అడవిలోని ఖనిజాలు, వనర్లు, సంపదలు బహుళజాతి కంపెనీలకు, బడా కంపెనీలకు కట్టబెట్టడానికి చేసుకున్న ఒప్పందాలను అమలుచేయడానికి అడ్డం వస్తున్న ప్రజలపై, ఉద్యమాలపై ప్రకటిస్తున్న యుద్ధం ఇది.

1991లో నూతన ఆర్థిక విధానాన్ని రూపొందించిన అప్పటి ఆర్థిక మంత్రి మన్‌మోహన్ సింగ్ ప్రధాన మంత్రి అయిన నాటినుంచీ దేశభద్రతకు మావోయిస్టులు ఆంతరంగిక ప్రమాదంగా మారారని ప్రకటిస్తున్నాడు. జూన్ 18వ తేదీన పార్లమెంటులో మాట్లాడుతూ సహజ సంపదలయిన ఖనిజ వనర్లు ఉన్న ప్రాంతాల్లో వామపక్ష తీవ్రవాదం పెరిగితే అక్కడ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉండదన్నాడు. అందుకే తన తర్వాత నూతన ఆర్థిక విధానానికి ఆర్థిక మంత్రిగా కండపుష్టినిచ్చిన చిదంబరాన్ని ఈసారి పోలీసు మంత్రిగా ఎంచుకున్నాడు.చిదంబరం గతంలో బహుళజాతి కంపెనీ అయిన ఎన్‌రాన్‌కు న్యాయవాదిగా వ్యవహరించాడు. హోంమంత్రి అయ్యాక నామమాత్రంగా కాగితంపై ఆయన రాజీనామా చేసినా, ఆయన భార్యయే ఈ బాధ్యతలన్నీ నిర్వహిస్తున్నది. ఇప్పుడు చిదంబరం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు శ్రీకారం చుట్టాడు.

నవంబర్ మొదటివారంలో 75,000 కేంద్ర పారా మిలిటరీ బలగాలను ఆయా రాష్ట్రాల్లోని అటవీప్రాంతాల్లోకి సైనిక విమానాలలో, హెలికాప్టర్లలో తరలిస్తున్నారు. అంతే సంఖ్యలో ఆయా రాష్ట్రాల నక్సలైటు వ్యతిరేక పోలీసు బలగాలను మోహరించి రాష్ట్రాల సరిహద్దులు మూసివేయబోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కూడా అదనంగా నలభై ఐదువేల కేంద్ర రిజర్వు బలగాలను తరలిస్తారని పత్రికలు రాస్తున్నాయి.

**ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం చొరవతో 31 అక్టోబర్, 2009న హైదరాబాదులో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా 55 ప్రజా సంఘాలతో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో తొలి కార్యక్రమంగా 7 నవంబరు, 2009న హైదరాబాదులో ర్యాలీ, ధర్నా జరిగాయి. అ సందర్భంగా విడుదల చేసిన కరపత్రం**

ఇది ఆదివాసీలపై చేసే మానవహననం (జీనోసైడ్) తప్ప మరొకటి కాదు. అంటే ఇది మానవత్వంపై కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన యుద్ధనేరం.

ఈ న్యాయాన్యాయాల యుద్ధంలో మనం మౌనంగా ఉండటమైనా, తటస్థంగా ఉండడమైనా యుద్ధనేరమే అవుతుంది. మనం దీనిని నిర్ద్వంద్వంగా న్యాయపక్షం వహించి వ్యతిరేకించాలి. ఖండించాలి.

ఇది మావోయిస్టులకు, నక్సలైట్లకు, ఇతర ఉద్యమకారులకు ఆయా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు మధ్యన యుద్ధం కాదు. ఇది ప్రజలు, ముఖ్యంగా ఆదివాసీ ప్రజలు తమ సార్వభౌమత్వాన్ని, స్వావలంబనను ప్రకటిస్తూ, ఆచరిస్తూ, తమ అటవీ సంపదను, భూమిని, జలాలను, వనర్లను, ఖనిజాలను, ఆకుపచ్చదనాన్ని, అంటే ఒక్కమాటలో బతుకు సజీవత్వాన్ని కాపాడుకోవడానికి, ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవడానికి చేస్తున్న న్యాయమైన పోరాటం. ఈ అన్నింటినీ మరి ఎవరు కోరుకుంటున్నారు, వీటిపై ఎవరు దాడిచేస్తున్నారు?

ఒక్కసారి భారతదేశ చిత్రపటం చూడండి. ఈ జాబితా

చూడండి. పశ్చిమ బెంగాల్‌లో జిందాల్, ఝార్ఖండ్‌లో మిట్టల్, ఛత్తీస్‌గఢ్‌లో టాటా, ఎస్సార్, పోస్కో, ఒరిస్సాలో వీరందరితోపాటు వేదాంత, విజయనగరంలో బెంగాల్, విశాఖపట్నంలో దుబాయి - కంపెనీలకోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది ఎకరాల భూమిని ఖనిజ సంపద తవ్వుకొని పోవడానికి, ఉక్కు ఫ్యాక్టరీలు, ఇతర బడా పరిశ్రమలు పెట్టడానికి అనుమతి ఇచ్చాయి.

మరొకవైపు కోట్లాదిమంది ఆదివాసులు నిలవడానికి నేల, తలదాచుకోవడానికి నీడ, కట్టుకోవడానికి బట్ట లేవు. తాగడానికి శుభ్రమైన నీళ్ళు లేవు. చదువు, ఆరోగ్యం సంగతి అసలు పట్టించుకున్నదే లేదు. అరవై రెండేళ్ళుగా ఆదివాసుల పేరుమీద ఎన్ని బిలియన్ల కోట్ల రూపాయల ఖర్చు చూపారు. అదంతా ఆదివాసుల, వాళ్ళ పక్షం వహించే ఉద్యమకారుల, విప్లవకారుల అణచివేతకే ఖర్చయిపోయింది. నిన్నటికి నిన్న అభివృద్ధి పేరిట కేవలం రోడ్లు వేయడానికి 7,200 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించారు. ఆ రోడ్లమీదుగా ఖనిజాలను దోచుకోవడానికి, అడ్డగించే వాళ్ళను అణచివేయడానికి, అడవిలోని వాహనాలు ప్రవేశించడానికన్నమాట.

2005లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సాల్వాజుడుం అనే ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసి దాదాపు 3.5 లక్షల మంది ఆదివాసీలను బలవంతంగా తమ నివాసాలనుండి, అడవినుండి తెచ్చి క్యాంపుల్లో పెట్టారు. సాల్వాజుడుంలో చేరలేక, క్యాంపులో ఉండలేక లక్షమంది ఆదివాసులు ఇటు ఖమ్మం, భద్రాచలం ప్రాంతాల్లో, అటు ఒరిస్సా సరిహద్దుల్లోకి వెళ్ళి తలదాచుకుంటున్నారు. సాల్వాజుడుంను ఏర్పాటు చేయడం రాజ్యాంగ విరుద్ధమని, బాధితులైన ఆదివాసులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ పని చేయకుండా సాల్వాజుడుంను కొనసాగిస్తూనే, దానికి తోడు నాగా, మిజో బెటాలియన్లను, సిఆర్‌పిఎఫ్‌ను, కోబ్రాలను ప్రయోగిస్తూ స్త్రీలపై అత్యాచారాలు, ఆదివాసులపై హత్యాచారాలు కొనసాగిస్తున్నారు. మహరాష్ట్రలోని గఢ్చిరోలి జిల్లాలో డెబ్బై ఏళ్ళ వృద్ధురాలి వక్షోజాలు కోసి 'ఎన్‌కౌంటర్' చేసిన ఘటన, కంధమాల్ జిల్లాలోని మూడు గ్రామాల్లో ఆదివాసీ మహిళలపై సిఆర్‌పిఎఫ్ జవాన్ల లైంగిక అత్యాచారం, ఒక మహిళ మరణం - సభ్య సమాజాన్ని సిగ్గుపడేలా చేసినవి. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, లాల్‌గఢ్‌లలో సైన్యం చేస్తున్న దుర్మార్గాలు సేంద్రా, సాల్వాజుడుం, హర్మత్‌వాహిని వంటి చట్టవ్యేతిరేక సాయుధ బలగాలు చేస్తున్న హత్యలు, అత్యాచారాలు బయటిప్రపంచానికి తెలియడంలేదు. ఎందుకంటే ఈ ప్రాంతాల్లోకి హక్కుల సంఘాలనుగానీ, మీడియాను గానీ అనుమతించడంలేదు. మహాశ్వేతాదేవి, మేధాపాట్కర్ వంటి వాళ్ళను కూడా అనుమతించ కుండా వెనక్కుపంపారు. ఛత్తీస్‌గఢ్‌లో మీడియా వాళ్ళను ఆ ప్రాంతాలకు వస్తే కాల్చివేయవలసిందిగా కూడా దంతేవాడ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశాడు.

ఒకవైపు మావోయిస్టులు ఉగ్రవాదులు కారు, ఈ రాష్ట్రాలేవీ దేశం నుండి విడిపోవాలని వాళ్ళు అనడంలేదు, వాళ్ళతో చర్చలు జరపడానికి సిద్ధం అంటూనే మరొకవైపు సిపిఐ మావోయిస్టును టెర్రరిస్టు సంస్థల జాబితాలో చేర్చి యుఎపిఎ కింద నిషేధించారు. 'మనదేశంపై, మన ప్రజలపై సైన్యాన్ని ప్రయోగిస్తామా?' అంటూనే కాశ్మీరు నుంచి వెనక్కి తెస్తున్న రాష్ట్రీయ రైఫిల్స్‌ను, సైనిక బలగాలను ఈ అటవీ ప్రాంతాలకు తరలిస్తున్నారు. మహరాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో ఉన్న పారా మిలిటరీ బలగాలకు సైనిక శిక్షణ ఇస్తున్నారు. పోలీసు చర్య పేరుతో సైనిక దురాక్రమణకు పూనుకోవడం కేంద్ర ప్రభుత్వానికి కొత్త విషయం కాదు.

మరిదంతా ఎందుకోసం? అటవీప్రాంతంలో ఆదివాసీలను వెంటాడి, వేటాడి, వెళ్ళగొట్టి విస్తారంగా ఉన్న ఖనిజ సంపదలను, ఇతర సహజ వనరులను బహుళ జాతి కంపెనీలకు, వాటి తాబేదార్లయిన బడా కంపెనీలకు ధారాదత్తం చేయడమే గ్రీన్ హంట్ లక్ష్యం.

మావోయిస్టులు, ఇతర విప్లవ పార్టీలు, ఆయారాష్ట్రాల్లోని ఇతర ఆదివాసీ ఉద్యమ సంస్థలు - జల్, జంగల్, జమీన్ (నీళ్ళు, అడవి, భూమి) ఆదివాసీలకే చెందాలంటున్నారు. అడవిపై ఆదివాసులకే హక్కు అని నినదిస్తున్నారు. ఇది అన్యాయమా? రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, ఐదవ షెడ్యూళ్ళు, గతంలో సుప్రీం కోర్టు తీర్పులు - ఈ ఆదివాసుల హక్కులను గుర్తించినవే కదా, పరిరక్షించాలన్నవే కదా. మరి దీన్ని ప్రభుత్వాలు సహించడంలేదు. అపుడు మనమేం చేయాలి?

- *సమస్య హింసాహింసలది కాదు. న్యాయాన్యాయాలది. శాంతితో కూడిన న్యాయం కోసం ఈ యుద్ధాన్ని ప్రతిఘటిద్దాం.*
- *ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే నిలిపివేయాలి*
- *ఆదివాసీ ప్రాంతాల నుంచి అన్నిరకాల పారా మిలిటరీ బలగాలను వెంటనే వెనక్కు తీసుకొని గాలింపు చర్యలు, దాడులు నిలిపివేయాలి.*
- *బహుళ జాతి కంపెనీలతో, బడా కంపెనీలతో ఆయా ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేయాలి, లేదా నిలిపివేయాలి.*
- *సాల్వాజుడుం, సేంద్రా, హర్మత్‌వాహిని వంటి చట్టవ్యతిరేక ప్రైవేటు సాయుధ బలగాలను రద్దుచేయాలి.*
- *మావోయిస్టులతో, ఇతర విప్లవ పార్టీలతో, ఉద్యమకారులతో ప్రభుత్వాలు ప్రజాస్వామికంగా వ్యవహరించాలి. రూల్ ఆఫ్ లా పాటించాలి.*
- *కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయానికి అనుగుణమైన, సానుకూలమైన వాతావరణాన్ని కల్పించి, కాల్పుల విరమణ ప్రకటించి బేషరతుగా మావోయిస్టులను, ఇతర విప్లవ పార్టీలను, ఇతర ఉద్యమ సంస్థలను చర్చలకు ఆహ్వానించాలి.*

**- ఆదివాసీలపై గ్రీన్‌హంట్ వ్యతిరేక కమిటీ**

మహబూబ్ నగర్ జిల్లాలో పుట్టి, పెరిగి, చదువు సంధ్యలు నేర్చుకొని టీచరుగా, జర్నలిస్టుగా పనిచేసి, ఆతర్వాత 'లా'డిగ్రీ పూర్తిచేసి న్యాయవాదిగా ఉంటూనే పూర్తి సమయాన్ని సంస్థ నిర్మాణాన్ని, ఆచరణను పెంపొందించాడు. మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల హృదయాల్లో నిలిచిపోయాడు. ప్రజల గొంతై వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసాడు. దళితులకు ఆసరాగా నిలబడి వారికి కొండంత ధైర్యాన్నిచ్చాడు. కరువు సమస్య, వలస చావులు, బాణామతి పేరుతో జరుగుతున్న దారుణాలను, హత్యలను, జోగినీల సమస్యను హక్కుల కోణం నుండి నిరసన తెలిపాడు. వాటి పరిష్కారం కోసం అందరు కలిసి పోరాడాలని పిలుపునిచ్చాడు.

రాజ్యహింసకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసాడు పురుషోత్తం. బూటకపు ఎన్‌కౌంటర్లకు, లాకప్పు మరణాలకు వ్యతిరేకంగా, బాధితుల తరపున కోర్టుల్లో న్యాయం కోసం పోరాడాడు. చెంచు గూడేలపై నిత్యం జరిగిన పోలీసు దాడులను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసాడు. వారి జీవితాలను సమస్యలను అధ్యయనం చేసాడు. విలువైన నివేదికలను తీసుకవచ్చాడు. అలాగే ఆదిలాబాదు జిల్లాలో ఆదివాసీల గురించి, విషజ్వరాల ప్రభావం గురించి, వారి చావుల గురించి ఎన్నోసార్లు ఆ ప్రాంతాల్లో పర్యటించాడు. గుత్తికోయల గురించి మావోయిస్టులకు సహకరిస్తున్నారనే పేరుతో పోలీసులు చేసే దాడుల గురించి వివరమైన వ్యాసాలు రాశాడు.

ఇవ్వాళ దేశవ్యాపితంగా అటవీ ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రధాన లక్ష్యం అడవి నుంచి ఆదివాసీలను గెంటివేయడం. అటవీ ప్రాంతంలో విస్తారంగా ఉన్న సహజ ఖనిజ సంపదను దేశీయ, విదేశీ బహుళజాతి కంపెనీలకు దారాదత్తం చేయడం. ఛత్తీస్‌ఘఢ్, ఝార్ఖండ్, ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వాలతో బహుళజాతి కంపెనీలతో కుదుర్చుకున్న లక్షల కోట్ల రూపాయల ఒప్పందాలను అమలు చేయడం. ఈ ఒప్పందాలను అమలు కాకుండా, బహుళజాతి కంపెనీలు అడవిని, అడవి సంపదను దోచుకోకుండా అడ్డుపడుతున్న ఆదివాసీలను, వారికి అండగా వున్న మావోయిస్టు ఉద్యమాన్ని అణిచివేయడం ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో జరుగుతున్న కుట్ర.

అటవీ ప్రాంతాన్ని, ఆదివాసీలను అభివృద్ధి చేయడానికి వేల సంఖ్యలో సైనిక బలగాలను మోహరించి యుద్ధం చేయడం అవసరమా? మావోయిస్టులు అభివృద్ధికి వ్యతిరేకం అనీ, ఖనిజసంపద విస్తారంగా ఉన్న ప్రాంతంలో తీవ్రవాదం ప్రాబల్యం పెరిగితే పెట్టుబడులు రావడం తగ్గుతుందనీ, అందువల్ల తీవ్రవాదం దేశ ఆంతరంగిక భద్రతకు పెనుముప్పుగా తయారయిందని మన్మోహన్ సింగ్, చిదంబరం పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. సైనిక చర్య అవసరం అని చెబుతున్నారు. 'అభివృద్ధి'పేరుతో బహుళజాతి కంపెనీల దోపిడీకి స్వేచ్ఛను కల్పించడమే కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన యుద్ధం. వాస్తవానికి ఇది యుద్ధం కాదు. ఆదివాసీల బ్రతుకులను ఛిద్రం చేసే కుట్ర. పోలీసు, పారా మిలటరీ బలగాలు ఆదివాసీలను వెంటాడి, వేటాడి హత్య చేస్తున్నారు. వేలాదిగా ఆదివాసీలు భయపడి అడివి నుండి బయటికి పారిపోతున్నారు. ఇదంతా 'అభివృద్ధి'కోసం అని ప్రభుత్వం ప్రచారం చేస్తూ ఉంది.

గత 62 సంవత్సరాల తర్వాత కూడా ఆదివాసీల బ్రతుకుల్లో చెప్పుకోదగ్గ మార్పు రాలేదు. పేదరికంలోని ఉన్నారు. విద్య ఆరోగ్య సదుపాయాలు కూడా సరిగ్గా అందుబాటులో లేవు. జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. అభివృద్ధి విధానాలను రూపొందించడంలో ఆదేశకసూత్రాలను తప్పని సరిగా పాటించాలని రాజ్యాంగం చెబుతుంది. 'ప్రభుత్వం విధాన రచన చేసేటప్పుడు సమాజం యొక్క భౌతిక వనరులను అందరి ప్రయోజనాలు సాధించే రీతిలో పంపిణీ కావాలి. సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతమై సమాజ ఉమ్మడి ప్రయోజనాలు దెబ్బతినే పరిస్థితి ఉండకూడదు. ఆర్థిక వ్యవస్థను అలా నడప కూడదు.'(ఆర్టికల్ 39). అంతే కాకుండా రాజ్యంగాంలోని 5వ షెడ్యూలు ఆదివాసీలకు ప్రత్యేక రక్షణలను కల్పించింది. షెడ్యూలు ప్రాంతాలు (ఆదివాసీ ప్రాంతాలు) అభివృద్ధికి, ఆదివాసీల సంక్షేమానికి సంబంధించి విధానాలను రూపొందించడానికి ఆదివాసీ సలహా మండళ్ళు ఏర్పాటు చేయాలని రాజ్యాంగం ప్రత్యేకంగా చెప్పింది. ఈ మండళ్ళు ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలి.

కానీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యంగంలోని ఆదేశిక సూత్రాలను, ప్రత్యేకమైన 5వ షెడ్యూలనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయి. బహుళజాతి కంపెనీలకు సార్వభౌమత్వాన్ని, రాజ్యాంగాన్ని, 5వ షెడ్యూలును తాకట్టుపెట్టాయి. దీని ఫలితంగా ఆదివాసీల హక్కులకు తీవ్ర ప్రమాదం ఏర్పడింది. 'జంగల్, జల్, జమీన్'మాదే అని ఆదివాసీలు తమ జీవనోపాధికి, జీవనాధారమైన అడవి కోసం, దానిపై హక్కుకోసం పోరాడుతున్నారు. మావోయిస్టులు వారికి అండగా నిలబడ్డారు. సాయుధబలగాల అణిచివేత నుండి రక్షణ కల్పిస్తున్నారు. గతంలో ఛత్తీస్‌ఘఢ్‌లో సాల్వాజుడుం అత్యాచారాలను ఎదిరించారు. దాని స్థానంలో ఇవ్వాళ సైనిక బలగాలు ప్రత్యక్షంగా రంగంలోకి దిగాయి. 'అభివృద్ధి'భావజాలంలో పడిపోయి, అభివృద్ధి కోసం త్యాగాలు చెయ్యాలి. 'అభివృద్ధి'కోసం శాంతి భద్రతలను నెలకొల్పాలి. అందుకోసం సైనిక చర్య అవసరం అనే వాదన, ధోరణి అప్రజాస్వామికం. అడవిపై ఆధారపడి బ్రతుకుతున్న ఆదివాసీలపై సైనిక చర్య అన్యాయం. దీన్ని అందరం వ్యతిరేకించాలి. పురుషోత్తం వర్ధంతి సందర్భంగా హింస-అహింస మీమాంసలో పడిపోకుండా సైనిక బలగాల బూట్లకింద నలిగిపోతున్న ఆదివాసీలను, వారిపై అమలవుతున్న అణిచివేతను ఆపాలనీ, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం**

## బాలగోపాల్ సంస్మరణ సభలు



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో 9-11-2009న పౌర హక్కుల సంఘం సభలో మాట్లాడుతున్న ఏపిసియల్‌సి మాజీ కార్యదర్శి, ఐఎఫ్‌టియు అఖిల భారత కార్యదర్శి బి. ప్రదీప్. వేదికపై బిచ్చారెడ్డి, రాజానందం, ఆంజనేయులు గౌడ్, మురళి (హెచ్‌ఆర్‌ఎఫ్), సురేశ్‌కుమార్, నరసింహ.




కృష్ణా జిల్లా పౌరహక్కుల సంఘం శాఖ 31-10-2009న నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఆంజనేయులు. వేదికపై సుధ (హెచ్.ఆర్.ఎఫ్.), భాస్కరరావు (ఒపిడిఆర్), సుభాష్ చంద్రబోస్.

## 7-11-2009న హైదరాబాద్‌లో జరిగిన గ్రీన్‌హంట్ వ్యతిరేక ఐక్య ఉద్యమం



రామ్‌నగర్‌నుంచి సుందరయ్యపార్కు వరకు జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న ప్రజాకళాకారులు రాజనర్సింహ, కోటి, విమల తదితరులు




సుందరయ్యపార్కు వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలు, ఐక్య కమిటీ కన్వీనర్ క్రాంతిచైతన్య, వరవరరావు.

## డాక్టర్ రామనాథం వర్ధంతి సందర్భంగా ఢిల్లీలో జరిగిన సిడిఆర్ఒ కార్యక్రమాలు




ఎన్‌కౌంటర్ హత్యాకాండకు నిరసనగా అఖిలభారత హక్కుల సంఘాలు ఢిల్లీ జంతర్‌మంతర్‌లో 4-9-2009న నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ఎపిసిఎల్‌సి కార్యకర్తలు లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మయ్య, నారాయణరావు, సుగుణాథం తదితరులు




'ఎన్‌కౌంటర్లు - న్యాయమైన ప్రశ్నలు' అన్న అంశంపై పియుడిఆర్, ఎపిసిఎల్‌సి సంయుక్తంగా ఢిల్లీలోని ఇండియన్ లా ఇన్‌స్టిట్యూట్‌లో 3-9-2009న నిర్వహించిన డా. రామనాథం స్మారకసభలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జాతీయ మానవహక్కుల కమీషన్ మాజీ ఛైర్మన్ జె. ఎస్. వర్మ. వేదికపై ప్రొ. శేషయ్య.



# పౌరహక్కుల పురుషోత్తం సంస్మరణలో

## ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేకసభ

పౌరహక్కులనేత పురుషోత్తంను హైదరాబాదులో నవంబరు23, 2000లో నయీం ఆధ్వర్యంలో సర్కారీ హంతక ముఠాలు అతి కిరాతకంగా హత్యచేసారు. అమరుడు పురుషోత్తం 9వ వర్థంతి సందర్భంగా జరిగే ఈ సభకు అందరికీ ఆహ్వానం.

రాష్ట్రంలో పౌరహక్కుల సంఘాన్ని పని చేయకుండా, హక్కుల కార్యకర్తల గొంతును నొక్కివేయడానికి మొదటినుంచీ పాలకులు ప్రయత్నించారు. కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారు. దాడులు చేసారు. బెదిరించారు. కుటుంబ సభ్యులను భయపెట్టారు. చివరికి తమ చేతికి రక్తం అంటకుండా హంతక ముఠాలను చేరదీసి, ప్రత్యేకించి మాజీ నక్సలైట్లను ఉసిగొలిపి హత్యలు చేయించారు. పురుషోత్తంను హత్యచేసిన మూడు నెలల్లోపునే నల్గొండ పట్టణంలో పురుషోత్తం సంస్మరణసభ జరుపుతుండగా ఆజంఅలీని నయీం ముఠావారే దారుణంగా హత్యచేసారు. పౌరహక్కుల సంఘం బాధ్యులనే కాక, ప్రజా సంఘాల కార్యకర్తలను 'డెత్ వారంట్స్'తో భయాందోళనకు గురిచేసారు. రంగు రంగుల పులుల పేర్లతో కోబ్రాల పేరుతో కనకాచారిని, మన్నెం ప్రసాద్‌ను, మునెప్పను హత్యచేసారు. రాష్ట్రంలో హక్కుల ఉద్యమాన్ని, ఇతర ప్రజాసంఘాల చట్టబద్ధమైన కార్యక్రమాలను, ప్రజాస్వామిక పద్ధతిలో, పరిధిలో కూడా సహించలేని ప్రభుత్వం తీవ్రమైన అణిచివేతను, నిర్బంధాన్ని అమలు చేసింది. హత్యలతో, దాడులతో హక్కుల ఉద్యమాన్ని ఆపలేరు'అని పౌరహక్కుల సంఘం తన కార్యక్రమాలను కొనసాగిస్తూ ఉంది.

మహబూబ్ నగర్ జిల్లాలో పుట్టి, పెరిగి, చదువు సంధ్యలు నేర్చుకొని టీచరుగా, జర్నలిస్టుగా పనిచేసి, ఆతర్వాత 'లా'డిగ్రీ పూర్తిచేసిన పురుషోత్తం న్యాయవాదిగా ఉంటూనే పూర్తి సమయాన్ని కేటాయించి సంస్థ నిర్మాణాన్ని, ఆచరణను పెంపొందించాడు.



**స్థలం: సుందరయ్య హాల్, బాగ్‌లింగం పల్లి, హైదరాబాద్**

**సమయం: సా॥ 5 గం॥లకు, తేది: 23 నవంబర్, 2009**

సభాధ్యక్షులు : ప్రొఫెసర్ యస్. శేషయ్య (అధ్యక్షులు, ఎపిసిఎల్‌సి)

వక్తలు : అరుంధతీరాయ్ (రచయిత్రి, సామాజిక కార్యకర్త)
కణ్ణబిరన్ (అధ్యక్షులు, పియుసిఎల్)
చుక్కారామయ్య (ఎం.ఎల్.సి, విద్యావేత్త)
క్రాంతి చైతన్య(ప్రధాన కార్యదర్శి, ఎపిసిఎల్‌సి)

If not delivered, please return to the following address

**Working Editor, Swechcha,**
298, TRT Colony, Opp. Railway Station,
Viday Nagar, Hyderabad - 500 044.

To

Book Post

Edited, Printed, published and owned by Prof. S. Seshaiah, Printed at Charita Impressions, Azamabad, Hyd.
for Anathapur, Printers, Anathapur by Andhra Pradesh Civil Liberties Committee, Plot, No.49, Vidyut Nagar, Anathapur - 515 001.